ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక



4 అణాలు
3-12-52

ANDHRA PATRIKA ILLUSTRATED WEEKL



నిరీక్షణ

—చిత్రకారుడు : శ్రీ ఇరుకుల కుమారిలస్వామి.

సాంవత్సర చందా
రు 12-0-0
విడిప్రతి 4 అ

ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder K. NAGESWARA RAO

సంపుటము 45
సంచిక 15
3.12-52

నందన మార్గశిర బహుళ విదియ బుధవారము



అగ్నిమాపకుడు

—ఫోటో: శ్రీ పి. వీరయ్య.

హైదరాబాదు దసరా కళా ప్రదర్శనంలో ఛాయా చిత్రాల
పోటీలో ప్రథమ బహుమతి పొందినది.

విషయానుక్రమణిక

ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

"గోడమీద బొమ్మ"

త్వరలో ప్రచురించబడనున్న

★ చిన్న నవల ★

రచన : **శ్రీ బలివాడ కాంతారావుగారు**

★

ఆంధ్రపత్రిక సచిత్ర వారపత్రికలో శ్రీ బలివాడ కాంతారావుగారి "గోడమీద బొమ్మ" అను చిన్న నవల త్వరలో సీరియల్‌గా ప్రచురించ బడగలదని మా పాఠకులకు తెలుపుటకు సంతసిస్తున్నాము.

—సంపాదకుడు.

రచయితలకు మనవి

★

మాకు కథలు, గేయాలు, చిత్రాలు, ఫోటోలు పంపేవారు వానిని త్రిప్పి పంపగోరినట్లయితే, రచనలూ చిత్రాలతోపాటు అవసరమైన స్టాంపులను గాని, స్టాంపులుఅంటించి చిరునామా వ్రాసిన కవర్లను గాని చేర్చి పంపవలసిందని మనవి. స్టాంపులను పంపేవారికి మాత్రమే వారి రచనలనుగాని, చిత్రాలనుగాని ప్రచురించేముందు ప్రచురణ విషయమై తెలియపరచగలము. ఈ సందర్భంలో రచయితలు, చిత్రకారులు మాకు సహకారమివ్వగలరని ఆశిస్తున్నాము.

—సంపాదకుడు.

కాలక్షేపం

శీతలవారి ద్రావు వడజెందినవాడు ;— క్షుధార్తుడిష్టమృష్టాతతభక్ష్యమాంస కలితాన్నము సాపడు ; - మన్మథాగ్నితాపాతురుడైనవాడు జవరాలి గవుంగిటిలోన జేర్చు ; - నీ రీతిని రోగశాంతికర కృత్యము భోగమనంగ జెల్లునే ?

ఎండవడదెబ్బగొట్టినటువంటివాడు (దాహముచే నోరెండినటువంటివాడు) చల్లని నీరు త్రాగును;-క్షుధార్తుడు (ఆకలితో బాధపడుచున్నవాడు) తనకిష్టమైన మాంసము, భక్ష్యములతో కూడిన వరియన్నమును ఆరగించును ; - మన్మథాగ్ని తాపముతో బాధపడుచున్నవాడు జవరాలిని (వయసుకత్తెను) కవుగిట జేర్చుకొనుచున్నాడు :— ఈ విధమున రోగశాంతికరముగా చేయుచున్న పనిని "భోగము" అని వర్ణించి చెప్పవచ్చునా ?

ఇది చాలా గడుసు ప్రశ్న. ఇది కొంచెముగడ్డుప్రశ్న కూడా- దాహంఅనేది ఒక శరీరబాధ - ఆకలి అనేది ఒక శరీరబాధ - ఇవిరెండూ ఎటువంటి శరీరబాధలో, కామాతురుని విరహబాధకూడా అటువంటిదే-ఆహారము అన్నిజీవరాసులకు అవసరమే. ఆహారం అంటే అన్నము, నీరు, గాలి ఇవన్నీ శరీరమును కాపాడుట కొరకై అనగా ప్రాణరక్షణార్థము అవసరమైనవే - కాబట్టి ఆకలి దప్పులనేవి ఆత్మరక్షణార్థము తీర్చుకోవలసినవైయున్నవి. ఈ ఆకలి దప్పులనేవి అప్పుడు పుట్టిన పసిబిడ్డమొదలుకొని, కాటికి కాళ్లుజాచుకొనియున్న ముక్కాలి ముదుసలివరకు విధిగా తీరవలసిన దైహికవాంఛలే - కాని, "జవరాలిని కవుగలించుకొనుట" అనే దేహవ్యాపారముమాత్రము జవ్వనులకు సంబంధించిన ప్రత్యేకవిశిష్టవ్యాపారంగా ఉంది. ప్రకృతిసిద్ధముగా, యీ వ్యాపారము యొక్క ఫలిత పర్యవసానములు రెండు కన్పిస్తున్నాయి. స్త్రీ పురుష సంగమమువల్ల కేవలము వారి భోగసంతృప్తిమాత్రమే కాకుండా, సంతానోత్పత్తి కూడా కలుగుతోంది. ఇది ఆత్మసంతృప్తికి, ఆత్మసంతానోత్పత్తికి కూడా హేతుభూతమవుతూ ఉన్నది. ఈ విధంగా చూస్తే, ఇది ఆకలి దప్పులవంటి దేహవాంఛ కాదు. ఇది స్వయంసృష్టి కార్యము. మనుష్య జాతి యొక్క సృష్టివ్యాపారం యిది. జీవరాసులన్నియు, యిదేవిధంగా తమ తమ జాతుల సంఖ్య వృద్ధి అవుతూ ఉండడానికి, అనగా స్వజాతి రక్షణ నిమిత్తము యీ సంసార వ్యాపార కలాపమును సాగించవలసియుండుటచేత, ఆయా జీవరాసులను అందు కొరకై ప్రోద్బలంచేసి, ప్రేరేపించేటటువంటి కామోద్రేకమును భగవంతుడు కల్పించినట్లుగా స్పష్టమవుతూ ఉంది.

ఈవిషయమై జీవశాస్త్రవేత్తలు చేసిన పరిశోధనలను గమనిస్తే, సృష్టిస్థితి లయములు అనేవి జగత్తును అంతటినీ ఒక నియమబద్ధంగా నడిపిస్తూ ఉన్నవని బోధపడుతుంది. ఎందుచేతనంటే, మానవులలోనూ జంతువులలోను స్త్రీ జాతియున్నూ పురుష జాతియున్నూ వేర్వేరుగా కన్పిస్తూ ఉన్నాయి. కాని, జీవరాసుల కన్నింటికీ మూలబీజములైన జీవాణువులు కొన్ని ఉన్నాయి. మర్రిచెట్టుకు ఊడలు దిగి, ఒక్కొక్క ఊడ ఒక్కొక్క చెట్టుగా తిరిగి విస్తరించిన విధంగానే, ఒక్కొక్క జీవాణువు తాను తినిన ఆహారంతో పెరిగి పెద్దదై అదియే రెండు మూడు ముక్కలుగా విడిపోయి, ఆ రెండు మూడు ముక్కలు వేర్వేరుగా రెండు మూడు జీవాణువులు అవుతాయి. ఈ జీవాణువుయొక్క సంతాన వృద్ధి, ఆ జీవాణువు రెండు మూడు ముక్కలుగా చీలిపోవుట వల్లనే కలుగుతోంది. దానియంతట అదియే విస్తరించి శాఖోపశాఖలుగా అవుతోంది. ఆ విధంగా జీవాణు వంశవృద్ధి అవుతోంది. ఇట్టి వంశవృద్ధికి జీవాణువుల పరస్పర స్త్రీపురుష సంయోగ వ్యాపారమనేది లేదు. ఇవిగాక కొన్ని రకములైన నేల ప్రాకెడి పరీసృపములు (అనగా సర్పములవంటి ప్రాణులు) ఉన్నాయి. అట్టివానిలో కొన్నింటికి తలవైపు స్త్రీభాగమూ తోకవైపు పురుష భాగమూ ఉండును. అది తోకను నోటిలో పెట్టుకొని మ్రింగుననియు, ఈవిధమైన తల తోక సంయోగమువల్లనే దానికి గర్భమై సంతానోత్పత్తి కలుగుచున్నదనియు శాస్త్రపరిశోధనవల్ల తెలియుచున్నది. ఇటువంటి ప్రాణికి ఏక శరీరమునందే స్త్రీ పురుష భాగములు అవినాభావ సంబంధము కలిగిఉన్నాయి. కాబట్టి "అర్ధనారీశ్వరం" అనేది ప్రాణికోటియొక్క ఒకానొక అనాదిసిద్ధమైన ప్రాతిపదికదశలో కన్పిస్తోంది. ఇట్టి జీవాన్ని స్త్రీలింగం అనిగాని, పుంలింగంఅని గాని నపుంసకలింగం అనిగాని భాషలో వ్యవహరించడానికి వీలులేదు. అట్టిజీవమునుగూర్చి ప్రస్తావించేటప్పుడు దానిని ద్విలింగవాచకం "అని ప్రయోగించవచ్చు-లేదా దానిని "ఉమ్మడి లింగం" అనవచ్చు. దీనినే *Herma Phrodite* "హెర్మాఫ్రొడైట్" అంటారు. క్రమేణ సృష్టిపరిణామంలో, ఏక ప్రాణి యందు ఏర్పడినటువంటి భిన్న వ్యాపార స్వభావమునుబట్టి రెండు భిన్నలింగభేదములు జీవరాసులలో ఏర్పడిఉండవచ్చును.

కాని ఒకప్పుడు సృష్టిలో స్త్రీప్రాణికి పురుష ప్రాణము అర్ధాంగముగాను పురుష ప్రాణికి స్త్రీ ప్రాణము అర్ధాంగముగాను ఉండి, ఏకశరీరభాగంగానే ఉండి అవినాభావసంబంధము కలిగిఉండేవి. సృష్టిలో కలిగిన మార్పులమూలంగా స్త్రీ భాగము ఒక ప్రత్యేక శరీరంతోను, పురుషభాగం మరొక ప్రత్యేక శరీరంతోను వేర్వేరుగా వెలసినవి. స్త్రీపురుష భాగములు ఒకప్పుడు ఏక శరీర భాగములుగా ప్రవర్తించియుండినటువంటివి. కనుక, ఈ పూర్వ వాసనవల్ల రెంటికిని ఉన్నటువంటి అవినాభావ సంబంధలక్షణమున్నూ, పరస్పరాకర్షణలక్షణమున్నూ, మిగిలిఉన్నాయి.

ఇందుకు ఒక ఉదాహరణము పదార్థవిజ్ఞానశాస్త్రంలో నుంచి చూపించవచ్చు. నాలుగు పలకలుగా ఉండే చిన్న యినుపకడ్డీని తీసికొని,

కాలక్షేపం

దానికి తుప్పు లేకుండా పరిశుభ్రము చేసి, ఒక సూదంటురాయితో ఆఖడ్డీమీద ఒకే వైపుగా కొంతసేపు రుద్దినట్లయితే, ఆ యినుపఖడ్డీ కూడా సూదంటురాయి అవుతుంది. ఆసూదంటురాయికి గల ఒక లక్షణము ఏమిటంటే, దానిమధ్య నొక సన్న నిదారమునుకట్టి వ్రేలాడకట్టినట్లయితే ఆఖడ్డీయొక్క ఒక కొన ఉత్తరధృవం వైపుకు రెండవకొన దక్షిణ ధృవం వైపుకు తిరిగి ఉంటుంది. అట్టి స్థితిలో ఆ ఖడ్డీకి ఒక వైపునకు ఉత్తరధృవ ఆకర్షణశక్తియున్నూ యింకొక వైపునకు దక్షిణ ధృవ ఆకర్షణశక్తియున్నూ ఏర్పడినవని మనం గ్రహించాలి. అయితే యీపలకల ఇనుపఖడ్డీకి యీ విధమైన అయస్కాంతశక్తి ఎట్లావచ్చింది? సూదంటురాయితో రుద్దడంవల్ల. ఆసూదంటురాయిలో ఉన్నటువంటి అయస్కాంతశక్తి యీ యినుపఖడ్డీలోకి ప్రవేశించి దానిని ఆవహించినదని చాలాకాలము సిద్ధాంతీకరించేవారు. కాని యిది దురభిప్రాయమని శాస్త్రజ్ఞులు నిర్ణయించినారు. సాధారణమైన యినుపఖడ్డీలో అంతర్గతంగా అదివరకే అయస్కాంతశక్తి ఉంది. ప్రస్తుతము సూదంటురాయితో దానిని రుద్దుటవల్ల పలకల ఇనుపఖడ్డీలో ఉన్న అయస్కాంతశక్తి ప్రకోపించి వికాసం పొందింది. అది వికసించగానే, అందులోని ఉత్తర ధృవాకర్షణ శక్తి ఒక వైపుకున్నూ, దక్షిణ ధృవాకర్షణశక్తి ఇంకొక వైపుకున్నూ స్పష్టంగా భిన్నముఖములైనవి. కాని, ఆరెంటికీ అవినాభావసంబంధం తెగకుండా, ఒక భాగం స్త్రీలింగంగానూ, రెండవభాగం పుంలింగంగాను పరిస్ఫుటమైనట్లుగా వ్యక్తమైనాయి. ఆ యినుపఖడ్డీలో పరిస్ఫుటం కానట్టిఅయస్కాంతశక్తి అదివరకే ఉంది.

అయస్కాంతిముతో విద్యుచ్ఛక్తిని కూడా ఉత్పత్తి చేయవచ్చు. ఒక తీగలోకి ఈవిద్యుచ్ఛక్తి ప్రవేశించినప్పుడు, ఆ తీగెయొక్క రెండు కొనలను దగ్గరకు చేర్చినప్పుడు, మెరుపుతీగవలె ఒక మెరుపు ఈ కొననుంచి ఆ కొనకు వ్యాపించి మెరుస్తుంది. అదే విద్యుచ్ఛక్తి. ఒక కొనను ఋణవిద్యుత్తుగల కొన అంటారు. రెండవ కొనను ధనవిద్యుత్తుగల కొన అంటారు. ధనవిద్యుత్ కొనయున్నూ, ఋణవిద్యుత్ కొనయున్నూ సంయోగింపబడిన వైనప్పుడు విద్యుచ్ఛక్తి ప్రవహిస్తుంది. ఏవిధంగా సూదంటురాయిలోని ఉత్తరధృవాగ్రము, దక్షిణధృవాగ్రము అవినాభావసంబంధము కలవై ఆఖడ్డీలోని అయస్కాంతశక్తిని పరిస్ఫుటం చేస్తున్నాయో, ఏ విధంగా విద్యుత్ తంతువులోని ఋణవిద్యుత్తున్నూ ధనవిద్యుత్తున్నూ అవినాభావసంబంధం కలవై ఆ తీగెలోని విద్యుచ్ఛక్తిని పరిస్ఫుటం చేస్తున్నాయో, అదేవిధంగా యీ జగత్తులో ఉన్నటువంటి స్త్రీ ప్రకృతియున్నూ పురుష ప్రకృతియున్నూ అవినాభావసంబంధం కలవై పరస్పరాకర్షణ కలవై సంసార చక్రాన్ని త్రిప్పేటటువంటి శక్తిని ప్రవర్తింప జేస్తున్నాయి. అందువల్ల యిది సహజవ్యాపారమేగాని, ప్రకృతివిరుద్ధమైన వ్యాపారం కాదు.

అయితే సహజంగా, సత్యంగా, సక్రమంగా ఆహార విహారములు సాగుతూ ఉన్నంతకాలమూ ఆరోగ్యంగానే ఉంటుంది. రోగం అనేది ఎప్పుడు సంభవిస్తుంది అంటే, సక్రమమైన, సత్యమైన దారి తప్పినప్పుడు సంభవిస్తుంది. దాహం అయినప్పుడు నీళ్లు త్రాగవలసిందే. ఆ నీళ్లు

— నేను వాడుకగా సరుకులు కొనే కొట్లో తరుచు, పొట్టి మనిషి ఒకాయన కనిపిస్తూ వుండేవాడు. ఆయన కొనే వస్తువులు, వాటిని ఆయన చేసే పరిశీలనలు, అవీ చూస్తే యీాయన 'ఎంత పొదుపు కల మనిషిరా' అని ఆశ్చర్యం వేసేది. ఒకరోజున ఆయనతో పరిచయం చేసుకొని, ఆమాటా యీమాటా మాట్లాడుతూ, 'మీ అంతటి పొదుపరి మరొకరు వుండరండీ,' అన్నాను.

ఆయన మొఖం అదోలా పెట్టి, "నే నింకా యీ బస్తీకి వచ్చి దుబారా చేస్తున్నాను కానీయండీ, అక్కడ మా పల్లెటూర్లో మానాన్న గారి దగ్గర అయితే యింకా ఎంత పొదుపుగా వుండే వాణ్ణి అనుకొన్నారు? దొడ్లో వున్న తోటకూర మొక్కలను మా ఆవిడ ప్రొద్దున్నే కోసేది. పొద్దు ననగా కోసిన కూర మధ్యాహ్నం పదకొండు, పన్నెండు గంటలకు కాని పొయ్యిమీదకు ఎక్కదు కదా! అల్లాంటప్పుడు ఆతోటకూర మొక్కలను ఆ కాస్త కూడా ఎదగనీయకుండా ముందుగా కోసి పెట్టుకోవటం ఎందుకు చెప్పండి. అదుగో అల్లా ప్రతి విషయంలోనూ పొదుపుగా వుండేవాణ్ణి."



మంచినీళ్లుగా ఉండాలి. ఇంకొకరు ఎంగిలి చేసిన నీళ్లుగా ఉండకూడదు. మంచినీళ్ళు కూడా మితం తప్పి తాగకూడదు. వేళ తెలియకుండా రాత్రిఅంతా నీళ్లు తాగుతూ ఉంటే తెల్లవారేసరికి ముఖం ఉబ్బుతుంది. శిరోభారం కూడా కలుగుతుంది. ఆవిధంగా అది రోగకారణ మవుతుంది.

అదేవిధంగా దేహరక్షణకోసం ఆహారం ఆరగించవలసిందే. కాని, మనం తినే పదార్థాలు చక్కగా పక్వమైనవిగా ఉండాలి. పరిశుభ్రంగా ఉండాలి. ఇతరులు ఎంగిలి చేసినవిగా ఉండకూడదు. మిగుల మాగిన పండ్లు గాని, సులభంగా జీర్ణం కాని వస్తువులు గాని, మత్తు పుట్టించేటటువంటి పులిసిన వస్తువులు గాని స్వీకరించకూడదు. అటువంటివి ఆరగిస్తే రోగం సంభవిస్తుంది.

కాబట్టి యిందువల్ల, యీ అనుభవజ్ఞానంవల్ల, మనకు తెలిసిన విషయం ఏమిటంటే, "దప్పి కలుగుట" అనేది సర్వసాధారణమైన దేహపరిస్థితినిబట్టి రోగం కానే కాదు. మితిమీరిన తాగుడువల్లను, అక్రమమైన పానీయమువల్లను కలుగునటువంటిదే రోగము. అదేవిధంగా ఆకలి కలగడం సక్రమమైన శరీరావస్థయందు దోషము కాదు. అది రోగలక్షణము కాదు కాని, తినగూడని వస్తువులను తినడంవల్లను, మితిమీరి తినుటవల్లను, వేళకాని వేళలందు తినుటవల్లను, శరీరమునకు రోగపరిస్థితి ఏర్పడుతుంది. ఆకలి కలుగుట రోగం కాదు. ఈ ఆకలి అనే జఠరాగ్నిని సక్రమంగా సద్వినియోగం చేయక పోవడమువల్ల రోగం సంభవిస్తుంది. దాహముఅంటే దహింపబడుట. ఆ విధంగా దహించేటటువంటి తాపమొకటి శరీరంలో ఉండాలి. శరీరంలో వేడి ఉండడంవల్లనే చెడుపదార్థం ఎప్పటికప్పుడు దహించి వేయబడుతోంది. మనము పీల్చే ప్రాణవాయువుమూలంగా శరీరం అనేటటువంటి కొలిమి ఆరి పోకుండా మండుతూ ఉండేటట్లు తిత్తి వేస్తున్నాము. మోటారుకారులో ఇంజను వేడి ఎక్కకుండా దానిలో ఒక గొట్టంలో చల్లనినీళ్లు పోసిఉంచుతున్నాము. అదేవిధంగా శరీరం ఎక్కువ వేడి ఎక్కి దహించుకొని పోకుండా ఆ శరీరంలోకి చల్లని మంచినీళ్లు పోస్తున్నాము. కొలిమిలోనికి బొగ్గులు సమృద్ధిగా ఉండాలి గనుక, ఆహారం కడుపులో వేస్తున్నాము.

కాబట్టి శరీరానికి దాహాగ్ని, జఠరాగ్ని విధిగా ఉండాలి. శరీరంలో వేడి నెత్తురు ప్రవహిస్తూ ఉండాలి. ఇవి రోగలక్షణాలు కావు. ఇవి ఆరోగ్యలక్షణాలు—ఆరోగ్య సూచనలు. కాబట్టి సహజమైన సవ్యమైన మానవశరీరానికి దాహం అనేది రోగం కాదు. దాహమైతే నీరు త్రాగడం అనేది రోగశాంతికరకృత్యం కాదు. ఆకలి కలుగడం రోగం కాదు. ఆకలిమంటకు ఆహుతిగా ఆహారమును భుజించడం రోగశాంతి కర కృత్యము కాదు.

దాహాగ్ని, జఠరాగ్ని వంటిదే మన్మథాగ్ని కూడా. కనుక మన్మథాగ్నికి సక్రమమైన ఉపాసన జరుగవలసిందే. దానికి సక్రమంగా, ఆరోగ్య విధులను అనుసరించి, ఆయుర్వేదసూత్రముల ప్రకారంగా, వేదసూక్తముల ప్రకారంగా జరుగవలసిన కార్యక్రమం జరుగవలసిందే. సరియైన వధువును పెండ్లాడి సంసారము

(9-వ పేజీ చూడండి)

జనగణ అభివర్ధన జయహే!

ఫ్రాన్సు దేశంలోని జనాభా లెక్కలను పరిశీలిస్తే, గత రెండువందల ఏండ్లనుంచీ ఆ దేశపు జనసంఖ్య, ఒక్కటే సంఖ్యాప్రమాణంలో ఉంది. "హెచ్చు" అనేది లేదు. ఎందుచేత? ఫ్రాన్సులో ప్రజావిప్లవం వచ్చినప్పుడు, రాజవంశాధికారం తొలగించారు. అట్టి రాచరిక ప్రభుత్వాన్ని అభిమానించిన జమీందార్లను, వారి పక్షమువారిని "గిల్లోటీను" యంత్రంతో చెఱుకుగడలు నరికినట్లుగా నరికివేశారు. అటు తర్వాత నెపోలియను అనేవాడు ప్రభుత్వాధిపత్యం వహించి ఫ్రాన్సును అనేక యుద్ధాలలోకి దింపాడు. చాలా ఫ్రెంచిసేన ఆ యుద్ధాలలో నాశనమైంది. ఈ విధంగా ఫ్రాన్సులో జనసంఖ్య వృద్ధి కాలేదు. అన్నింటికన్న ముఖ్యకారణం ఒకటిఉంది. ఫ్రాన్సులో సంతాన నిగ్రహ సాధనాలను స్త్రీ పురుషులు విచ్చలవిడిగా చాలాకాలంనుంచీ ఉపయోగిస్తున్నారు. సంతానవృద్ధి కాకుండా యీ సాధనాలు చేస్తున్నాయి. గత మొదటి ప్రపంచ సంగ్రామంలో చాలా మంది ఫ్రెంచివారు మరణించారు. రెండో ప్రపంచ సంగ్రామంలో ఫ్రాన్సును సులభంగా హిట్లరు ఓడించి ఆక్రమించాడు. "ప్రబలమైన సేనను సమకూర్చడానికి ఫ్రాన్సులో జనసంఖ్యాభివృద్ధి లేదు. ప్రజలకు విషయసౌఖ్యాలోలత్వం సంతాన నిరోధంతోపాటు ఎక్కువైంది. ఈ కారణాలవల్ల ఫ్రాన్సు ఓడిపోయింది" అని అప్పుడు మార్షలుపెటేను అనే ఫ్రెంచి సేనాధిపతి అన్నాడు.

భారత దేశంలోని జనగణ అభివృద్ధికి జయహే! అనవలెనా? పరాసుపద్ధతి నవలంబించవలెనా? పురుషులుపయోగించు సంతాననిరోధం నిమిత్తమైన రబ్బరు సాధనములు ఇంగ్లీషుభాషలో "ఫ్రెంచి-లెటర్సు" అనే పేరుతో వ్యవహరింపబడుతున్నాయి. ఇవి కవరులలో ఉంచబడిన "ఫ్రెంచి ఉత్తరములు" వంటివి అని భావము.

అతడూ ~ ఆమె

శ్రీ చల్లా రాధాకృష్ణశర్మ

ఆమె: (కూర తరుగుతూ) ఆరంభించా —

అతడు: (మౌనం)

ఆమె: ఏముంది - తెల్లవారటం తరువాయి. ఆ పడకకుర్చీ, ఆ దిక్కుమాలిన పత్రికా వుంటే చాలు. ఇంట్లో మంచి చెడ్డా యేమీ అక్కర్లేదు. రామరామా! ఈ మాయదారి పత్రిక ఎక్కడ పోగయిందో గాని, పొద్దస్తమానం దాని సేవతో సరిపోతోంది.

అతడు: (విసుగుతో చదివే పత్రికను కింద వేస్తాడు)

ఆమె: (పత్రికను తీసుకొని) దీన్లో ఏముందండి మహా చదువుతారు! ఇదేమైనా రామాయణమా, భారతమా? అబ్బెబ్బె...

అతడు: (నవ్వుతూ) పిచ్చిదానా...

ఆమె: (మూతి ముడుచుకొని) నేనెలాగో పిచ్చిదాన్నే లెండి. ఇవ్వాళ్ళ మీరు నాకేమీ కొత్తగా నామకరణం చెయ్యక్కర్లేదు.

అతడు: నీ మొహం - యీ కాలంలో పత్రిక చదవకపోతే లోకజ్ఞానం కలగదు. ఈ విశాల ప్రపంచంలో జరిగే విషయాలన్నీ మనకు పత్రికల మూలంగా తెలుస్తాయి.

ఆమె: ఇంకేం - పొద్దస్తమానం పత్రికల్నే తిరగేస్తూ వుండండి. అమ్మాయి పెళ్లి తొందర్లోనే అవుతుంది.

అతడు: (చదవటం ఆపి) మళ్లా సాగించావూ - నీ పాట నీదే గాని నేను మాత్రం వూరికే వుంటున్నానా చెప్పు?

ఆమె: మీ పత్రిక లేమిటో మీరేమిటో - అంతేగాని యీడు వచ్చిన పిల్ల యింట్లో వుందిగదా దానికి పెళ్ళి పేరంటాలు జరుపుదామని మీ రనుకుంటేగదా! ఎంత తల పగులగొట్టుకున్నా నా మాటలు మీకు రుచిస్తాయీ - మీకు లేనప్పుడు నాకుమాత్రం ఎందుకులెండి యీ విషయం.

అతడు: నీ మొహం - నేను పడే శ్రమ అంతా బూడిదలో పోసిన పన్నీరవుతోంది. లేకుంటే యీపాటికి మనమళ్లతో ముద్దాడుతూ వుండవలసిన వాళ్ళంకదూ.

ఆమె: అయ్యో అన్నారు. ఈ జన్మలో ఆ గీత లేదులెండి. మా చెల్లెలు మనమరాళ్ని ఎత్తుకొని ముద్దాడుతూ వుంటుంటే నే నింకా అల్లుడికోసం ఎదురుచూస్తూ వున్నాను. అంతమాత్రం అదృష్టమే వుంటే యీ వేళకు అన్నీ సక్రమంగానే జరిగి వుండేవి.

అతడు: పిచ్చిదానా - అల్లుడంటూ ఒకడు రావాలి గాని ఆ ముచ్చటలన్నీ ఎంతసేపూ...

ఆమె: ఆ - తీరకేం - అమ్మాయి పెద్ద మనిషై రెండేళ్ళయింది. మూడో యేడు కూడ మొన్న పౌర్ణమికి వచ్చింది. ఈడు వచ్చిన పిల్లను ఇంట్లో పెట్టుకోవటం రొమ్ముల కుంపటేగదా - అదీ గాకుండా నలుగుర్లోను తలెత్తుకొని తిరుగుతూ వున్నందుకు మనల్ని నలుగురూ నానా మాటలూ అంటున్నారు.

అతడు: అయితే నన్నేం చెయ్యమంటావ్?

ఆమె: మాట్లాడితే యిదొక పాట నేర్చారు - బాగానే వుంది. తడవతడవకు ఏం చెయ్యమంటావు, ఏం చెయ్యమంటావని అడుగుతూ వుండండి... పుణ్యకాలం కూడా దాటిపోతుంది.

అతడు: అబ్బా - వేధించుకు తినకు - నీ సల్హా ఏమిటో, చెప్పు -

ఆమె: నా సలహా మీకు పనికివస్తుందీ - మీరు చేసే ప్రతి పనికీ నన్నే సలహా అడుగుతున్నారు కాబోలు. ఏదో మీ చిత్తం వచ్చినట్టు చేసుకోండి. మధ్య నే నెందుకు పానకంలో పుడక మాదిరి.


అతడు: పోనీ యిప్పుడడుగుతున్నాగా చెప్పు.

ఆమె: నాకేమీ తెలీదండి. మీ ఇష్టం మీ అమ్మాయి యిష్టం. మీరంతా చదువుకున్నవాళ్ళు. తెలివిగలవాళ్ళు. నేను వట్టి పిచ్చిదాన్ను...

ఆ డాక్టరుగారి దగ్గరకు డబ్బు వున్న రోగులే ఎక్కువ మంది వెళ్లుతూ వుంటారు. లావు తగ్గించటానికి ఆయన ఏదో గొప్ప చిటకా కనిపెట్టాడని పేరు పాకిపోయింది. ప్రతి రోజూ ఆయన గుమ్మంలో పలు కాయులు, అతి కాయులు, మహాకాయులు గుమికూడుతూ వుండేవారు.

కొంతకాల మిలా జరగాక ఒకాయన యీ చిటకా ఏదో తెలుసుకోవాలన్న సరదా కొద్దీ డాక్టరుగారితో చనువు చేసుకొని "లావు తగ్గించటానికి మీరే మందు వాడుతున్నారో చెప్ప" మని అడిగాడు.

"ఆ మందూ లేదు: మాకూ లేదు. ఒళ్లు బలిసిన వాళ్లు ఎవరైనా నాదగ్గిరకు వస్తే, నేను వాళ్ళతో మొట్టమొదటిరోజు ఏమీ మాట్లాడకుండా తూకం అదీ తూచి, యిక ఆ రోజు మొదలుకొని రెండు వారాల వరకు వాళ్లు ఏ నిమిషాన ఏ వేవి తింటారో అదంతా జాబితా వ్రాసుకు పట్టుకు రమ్మంటాను. వాళ్లు ఆ రెండు వారాల గడువూ తీరాక, ఆ జాబితా పట్టుకు తయారు అవుతారు. అప్పటికే ఏనుగుల్లాంటి ఆ మనుషులు పీనుగులై వస్తారు!" అన్నాడు ఆ డాక్టరుగారు చిరునవ్వులు ఒలకబోస్తూ.



అతడు: (నవ్వుతూ) దండకం పూర్తయిందా?

ఆమె: అది కాదండీ - ఈడు వచ్చిన తర్వాతకూడ అమ్మాయికి చదువు లెందుకు చెప్పండి. అవ్వేమైనా వుద్ధరిస్తాయా పెడతాయా?

అతడు: (నవ్వుతూ) ఈ కాలంలో ఆడదైనా సరే మగవాడైనా సరే చదువుకోని తీరాలి. లేకపోతే ఏమీ లాభం లేదు.

ఆమె: అయితే మీరు కూడా చదువుకున్న దాన్ని చూసి పెళ్ళి చేసుకుంటే బాగుండేదిగదా!

అతడు: మన కాలం, మన పద్ధతులు పూర్తిగా మరిపోయాయి. ఇప్పుడంతా కొత్తరకం. రోజురోజుకీ కాలం మారుతూ వుంటుంది. దాంతోపాటు మనం కూడ మారుతూవుండాలి. అసలు మార్పు అనేది..

ఆమె: చాల్లెద్దురు మీ వుపన్యాసం, మీరూను.

అతడు: ఇంతకూ అమ్మాయిని చదివించడం నీకు సుతరాం యిష్టం లేదన్నమాట

ఆమె: నా యిష్టా యిష్టాలతోనే మీరు ప్రతీ పనీ చేస్తున్నట్టు. ఎంత చక్కగా మాట్లాడుతారండి.

అతడు: ఈ మాటలకేంగాని - మన రాఘవయ్యగారి రెండోకొడుకు బి. ఏ. చదువుతున్నాట్ట...

ఆమె: (విసుగుతో) నాకేమీ తెలీదండి.

అతడు: కూర తరగటం మాత్రం తెలుసు. ఇంకేమీ తెలీదు...

ఆమె: (గొంతు మార్చుకొని) నా పనిని నేను చేసుకున్నా మీకు కష్టమే—

అతడు: అదికాదే - యీ సంబంధం చూడు...

ఆమె: సంబంధాలతో నాకేమీ సంబంధం లేదండి.

అతడు: (విసుగుతో) నా మాట వినవే నీకు పుణ్యం వస్తుంది. రాఘవయ్యగారి రెండోకొడుకు...

ఆమె: నాకేమీ తెలీదండి. అంతా మీ యిష్టం, మీ అమ్మాయి యిష్టం.

అతడు: దాని యిష్టమేమిటే - మనమే మంచీచెడ్డా విచారించి మంచి సంబంధం ఖాయంచేస్తే అది పెళ్లిచేసుకుంటుంది.

ఆమె: ఈ పైపై మాటలకేం లెండి... ఇంతకూ మీవల్లనే బంగారంలాంటి పిల్ల చెడిపోయింది.

అతడు: ఇది మరీ బాగుంది. నేనేం చేశాను.?

ఆమె: మీరు చేసేవన్నీ బాగుండక వంక పెట్టేట్టు వుంటాయా ఏమిటి? లేకపోతే ఆ విధంగా నిక్షేపం లాంటి ఆ వెంకయ్యగారి కొడుకుని అదీ మీరూ కలిసి నానామాటలూ అంటారూ...

అతడు: నేనేం చేశాను. ఆ అబ్బాయి పైన మన అమ్మాయికి యిష్టంలేదు. అందుకనే అది వద్దని గోలచేసింది.

ఆమె: పాపం! మీరేమి చెయ్యలేదు. పరాయివాళ్లకు లేనిపోని వంకలు పెట్టడం అమ్మాయికి ఘట్టుగా నేర్పారు. ఇది చాలదు కాబోలు.

అతడు: ఆ అబ్బాయి నల్లగా, లావుగా, పొట్టిగా వుండడంబట్టి అమ్మాయి...

ఆమె: చాల్లెద్దురు - మీరు చేసిన ఘన కార్యాన్ని రొమ్ము విరుచుకుని చెబుతున్నారు కూడాను. ఈవిధంగా అమ్మాయి దగ్గర పాటలుపాడి బంగారం వంటి ఆ అబ్బాయికి లేనిపోని వంకలెన్నో తెచ్చిపెట్టారు.

అతడు: అయినదానికీ, కానిదానికీ నన్నంటే లాభమేముంది చెప్పు?

ఆమె: అవున్లెండి - యిట్లా చెప్పుకోటంకూడా సిగ్గుచేటే - ఆ అబ్బాయిని మీరు అవమానం చేసినంతమాత్రాన అతడికి పెళ్లి కాకపోదు. గంతకు తగినబొంత దొరక్కపోతుందీ—

అతడు ఆమె

అతడు: అవమానం చేశానా? విచిత్రంగా వుంది నీధోరణి.

ఆమె: అవమానం కాదులెండి. నలుగుర్లోను నానా మాటలూ అన్నారు. ఇంతకన్నా యింకేం చెయ్యాలి? మీరూ, మీ అమ్మాయీ మహా అందంగా వున్నారు కాబోలు.

అతడు: (నవ్వుతూ) అందంగావున్నానని నేనేమీ టాం టాం వేసుకోటం లేదే..

ఆమె: ఎవరెట్లా వుంటే నాకెందుకులెండి...(కూరల బుట్టను తీసుకుని లేస్తూ) యీ మండిపోయిన పనిని చేసుకోలేక చచ్చిపోతున్నాను. (వెళ్ళబోతుంది)

అతడు: ఎక్కడికి?

ఆమె: (విసుగుతో) మీతో మాట్లాడుతూ కూర్చుంటే అక్కడ వండి వార్చేవాళ్ళెవరూ లేరు. కాలుపైన కాలువేసుకొని కూర్చున్నా మీకు జరుగుతుంది. నాకెట్లా జరుగుతుంది. అంతా నన్ను మండపెట్టేవాళ్ళేగా -

అతడు: ఏమిటి మాటలు?

ఆమె: అంతేలెండి - నిజం నిష్ఠూరంగా వుంటుంది. ఆ వ్మాయి మ ట్టుకు అది ఏమైనా పనిచేస్తుంది? దాని చదువేమో దానిస్నేహితులేమో - అంతే గాని అమ్మ కష్టపడుతోందిగదా కొంచెం సహాయం చేద్దామని అనుకుంటుంది...దాన్ని నేను పట్టుకొని వ్రూగులాడాల్సిందే కాని రవ్వంతైనా లాభంలేదు. ఎంతలో నుంచుంటే నీడకు రమ్మని పిల్చేవాళ్ళెవరూ లేరు.

అతడు: (విసుగుతో) ఏమిటే యిదంతా—

ఆమె: ఏమిటా - నా ఖర్మ, ఏనాడో చేసుకున్న పాపం యీనాడు యిట్లా బద్దలవుతోంది. నా ఘటం యిట్లా వెళ్ళిపోవాల్సిందే...

అతడు: రోజూ వున్న యీ గొడవకేంగాని రాఘవయ్యగారి రెండో అబ్బాయి..

ఆమె: నాకేమీ తెలీదండి...

అతడు: నీకు తెలియదు కాబట్టే చెబుతున్నాను. రాఘవయ్యగారు మహా ఘరానా మనిషి. వాళ్ళది పాలవంటి వంశం. కుఱ్ఱాడు బి. ఏ. చదువుతున్నాడు. చాలా బుద్ధిమంతుడని నలుగురూ అనుకుంటుంటే విన్నాను.

ఆమె: నాకేమీ తెలీదండి. అంతా మీ యిష్టం, మీ అమ్మాయి యిష్టం. మధ్య నాదేముంది. నే నెవత్తెనో పరాయి దాన్ని.

అతడు: మళ్ళీ కథ మొదటికొచ్చిందీ- రామ రామ - నీ మాటలు విని విని చెవులు తడికలు కట్టిపోయాయి.

[వీధిలోంచి 'మూర్తిగారూ' అనే పిలుపు వినబడుతుంది]

అతడు: ఆఁ - వస్తున్నా, వస్తున్నా... (వీధిలోకి వెళ్తున్నాడు)

ఆమె: ఏమండీ - మిమ్మల్నే... నేను గొంతు చించుకోవడమే కాని ఆయన సమాధానంకూడా యివ్వరు.

అతడు: (లోనికి వచ్చి) స్నేహితుడితో మాట్లాడుతూవుంటే ఎందుకట్లా బొబ్బలు పెడతావు?

ఆమె: మీతో మాట్లాడకూడదని ఎంత నోరు నొక్కుకున్నా మాట్లాడవలసి వస్తోందిగదా... నేను చేసుకున్న కర్మ...

[అతడు దుస్తులు వేసుకొని వీధిలోకి వెళ్తూవుంటాడు]

ఆమె: మిమ్మల్నే...

అతడు: మళ్ళీ ఏమిటి?

ఆమె: ఇందాకేదో అన్నారే—రాఘవయ్యగారికొడుకు విషయం...

అతడు: (నవ్వుతూ) నీకేమీ తెలీదుగా.

ఆమె: (నవ్వుతూ) సర్లెద్దురూ - ఆ విషయంగూర్చి గట్టిగా వాకబ్ చెయ్యండి! మంచి ముహూర్తాలుకూడ లేవట వచ్చే నెలలో.

అతడు: చిత్తం...(వీధిలోకి వెళ్లును.)

★

★ కొండంత దేవుడు

జపానులో టోకియో నగరమునకు ఉత్తరదిశగా ఫూచూపిమా అనే జిల్లాలో ఒక పర్వతం ఉంది. ఆ పర్వతమునంతను ఒక్కటే శిలావిగ్రహముగా చెక్కుచున్నారు. ఇది బుద్ధదేవుని విగ్రహము. ఇటువంటి బుద్ధవిగ్రహమును జపాను భాషలో "దాయి బుట్సూ" అంటారు. "ధ్యానబుద్ధుడు" అని ఆ మాటకు అర్థము.

ఇటువంటి పర్వత ప్రతిమలు బుద్ధదేవుని ఆకారములో జపాను దేశమందు అనేక ప్రాంతాలలో చెక్కబడినవి. అట్టి విగ్రహములలోకెల్ల ఫూచూపిమాలో చెక్కబడిన "ధ్యాన బుద్ధుడు" (దాయిబుట్సూ) అత్యంత బ్రహ్మాండమైనది. ఈ బుద్ధవిగ్రహముయొక్క శిరస్సు మాత్రమే సుమారు 11 గజముల ఎత్తుగలదై యున్నది. దానినిబట్టి నిలువబడిన పూర్ణాకారవిగ్రహము 88 గజముల యెత్తుగాని 99 గజముల ఎత్తుగాని ఉంటుంది. కాని సుఖాసీనుడై కూర్చున్న బుద్ధ విగ్రహము 44 గజముల ఎత్తు ఉంటుంది. ఒక్కటే కొండను ఇంతపెద్దవిగ్రహంగా చెక్కడమైనది. కనుక కొండంతదేవుడు జపానులో ఉన్నాడు.

★ కాలక్షేపం ★

చేయవలసిందే. అట్టి స్త్రీపురుషుల సహవాస సమాగమవాంఛ సహజమైన శరీర ఆరోగ్యమును సూచించే లక్షణము. అందుకు సందేహము లేదు. అది రోగలక్షణము కాదు. కనుక మన్మథాగ్ని తప్పుడైనవాడు జవరాలిని చేబట్టుట అనేది రోగశాంతి కరకృత్యము కాదు. కాని, స్త్రీపురుషుల పరస్పరవిహార వ్యవహార ప్రవర్తనలయందు నియమములను పాటించాలి. లేకపోతే, ఆ నియమ శూన్యమైన విహారం రోగహేతువు అవుతుంది. జఠరాగ్నిని దుర్వినియోగం చేస్తే రోగస్థితి కలిగినవిధంగానే, మన్మథాగ్నిని దుర్వినియోగం చేస్తే కొంపలు కాలుతాయి, కొంపలు కూలుతాయి. ఈ మన్మథాగ్ని అటువంటిది. విద్యుచ్ఛక్తికంటె ఎక్కువ ప్రమాదకరమైంది. విద్యుచ్ఛక్తితీగె ఎక్కడైనా తెగి విస్ఫులింగములు (రవ్వలు) బయలుదేరి కొంపకు నిప్పంటుకొన్న సందర్భాలు అనేకం ఉన్నాయి. తర్వాత ఫైరుయింజన్లువచ్చినా ప్రయోజనం ఉండదు.

“నలదమయంతు లిద్దరు
    మనఃప్రభవానల బాధ్యమానులై
పలిపిరి దీర్ఘ వాసరనిశల్
    విలసన్నవ నందనంబులన్,
నలిన దళంబులన్, మృదు
    మృణాళములన్, ఘనసారపాంసులన్
దలిరులశయ్యలన్,
    సలిలధారల, జందనచారుచర్చలన్.”

[తా॥ నలదమయంతు లిద్దరును మన్మథతాపముచే బాధింపబడినవారై, చక్కని తోటలలో, తామరాకులమీదను, మెత్తని తామర కాడలమీదను, పచ్చ కర్పూరపు పొడిరాసులమీదను, చిగురుటాకులపాన్పులమీదను, చల్లని నీటిధారలతోను, మంచి గంధపు పూతలతోను దీర్ఘమైన రాత్రిళ్లు పగళ్లు కాలము గడపిరి.]

పూర్వమొకప్పుడు నలునకు దమయంతికి మధ్య మన్మథాగ్ని (హంసఒకటి మీట (స్విచ్) నొక్కగానే) ఎలెక్ట్రిక్కు కరెంటులాగున (విద్యుచ్ఛక్తిలాగున) ప్రవహించింది. ఉభయులకు ప్రేమ అతిశయించింది. ఇందులో విచిత్రం ఏమిటంటే, నలుణ్ని దమయంతి చూడలేదు. దమయంతిని నలుడు చూడలేదు. కాని యిద్దరికీ పరస్పరాకర్షణ అతిశయించింది. అది ఎట్లాగంటే, పేపరులో ఉన్న ప్రకటన చూచి వధూవరులకు ప్రేమలు కలుగవచ్చు. “వధువు కావలెను” అనే ప్రకటనలో వరుని యొక్క వర్ణన ఉంటుంది. “వరుడు కావలెను” అనే ప్రకటనలో వధువుయొక్క వర్ణనఉంటుంది. ఒకరి వర్ణన ఇంకొకరు చదువుకొంటారు. “తగిన వరుడు వీడె నాకూ—తలిరుబోణిరో” అనేకీర్తన వధువు తగులుకుంటుంది. “ఎందరి జూడ మీ ధరణి నిందునిభాస్యల? వారి యందు నీయందము చందముంగలదె?” అని వరుడు దరువు ప్రారంభిస్తాడు.

ఆఖరుకు దమయంతికి స్వయంవరం చాటించాడు దమయంతి తండ్రి. దేవేంద్రుడు సహా అందరూ, పబ్లికు సర్వీసు పరిక్షకూ, ఇంటర్వ్యూకూ హాజరైనట్లుగా హాజరైనారు. దేవతలందరూ నలమహారాజులాగుననే అదే రూపం ధరించారు. అంటే ఏమిటి? ఆ స్వయంవరం అనే పరీక్షకు వచ్చిన వాళ్లందరూ నలమహారాజును చూచి కాపీ చేశారు. నిజంగా యిదే ఏ బోర్డుహైస్కూలులోనైనా, ఏ స్కూలు ఫైనలు లెక్కల పరీక్షలోనైనా జరిగితే, ఆ సంగతి పరీక్షసూపరువైజరుకు తెలిస్తే, ఆసంగతిని అతడు

సూటిఅయిన మాట

మా అవిడ కరక్టు అయిన మనిషి. ఏపని చేసినా, ఏపని చేయించినా అంతా సూటిగానే జరగాలని అంటూ వుంటుంది.

దాసీది ఏదైనా ఒక వస్తువు అవతల యివతలగా పడేసిందనుకోండి. అప్పుడు ఆవిడ దాంతో ఏమంటుందంటే—

“ఒసే! దాన్ని అక్కడ వాటితో పెట్టవద్దని ఎన్నిమార్లు చెప్పాను? దాన్ని ఎప్పుడు దాచిపెట్టినా యిక్కడ వీటి మీద పెట్టాలన్న యిది నీకు ఎప్పటి కొస్తుందే!” అంటుంది.

నాతో మాట్లాడే టప్పుడు కూడా యిలాగే. ఏది ఏదో ముందుగా చెప్పకుండా అదీ, యిదీ, యిక్కడా, అక్కడా, అంటుంది. మాటవరసకి ‘ఆరోజు మనం అక్కడికి వెళ్ళినప్పుడు వాళ్లు కనిపించారే ...” అటుంది ఆరోజు ఏదో, ఎక్కడికి వెళ్లామో, ఎవరు కనిపించారో తెలుసుకొనే టప్పటికి నాతల ప్రాణం తోకకి వస్తుంది

కానీ—ఒకరోజు నేను ఆఫీసులో తెగ అలసిపోయి యీదురోమంటూ యింటి కొచ్చాను. నన్ను చూసీ చూడటంతోనే ఆవిడ యిలా అంది-

“ఇందాక వాళ్లు వచ్చారు”

ఎవరు వాళ్లు అని అడగకుండానే ‘ఏమన్నారు’ అని అడిగాను.

“ఊ! అలాగే కానివ్వమన్నాను.” అన్నది. నాకప్పుడు అర్థమైంది—ఈవిడ నా సంపాదనలో సగానికి పైగా హతమై పోయ్యే నగఏదో చేయించు కొంటోందనీ, ఆ వచ్చిన వాళ్లు నగలు చేసే వాళ్లనీ, వాళ్లు అడిగిన ధరకే యీావిడ ఒప్పేసు కొన్నదనీ!

★ కాలక్షేపం ★

హెడ్మాష్టరుకు తెలియచేస్తే, అతడు ధైర్యం చేసి ఆ మోతుబరీ ఆసాముల పిల్లలమీద స్కూలు ఫైనలు పరీక్షాబోర్డువారికి రిపోర్టు వ్రాస్తే గీస్తే, అప్పుడు ఆ పరీక్షాకేంద్రానికి తిరిగి పరీక్ష జరిపించడం అవసరమవుతుంది. కాని, అటువంటి పునఃపరీక్ష ఆ స్కూలులో తిరిగి జరుపకుండా తగిన సన్నాహాలు చేయడం ఆ విద్యార్థుల విషయంలో శ్రద్ధగల ఆ ఊళ్ళో పలుకుబడిగల ఆ మోతుబరీ ఘరానా ఆసాములకు అవసరం అవుతుంది. నిజంగా దమయంతి స్వయంవరమును తిరిగి పరీక్ష జరిపినట్లుగా జరిపించవలసినంత అగత్యం కలిగింది కాని, అసలు నలుడెవరో నకలు నలుడెవరో దమయంతి కనిపెట్టగల్గింది, రాజులమాయలు తెలిసిన రాజుకూతురు కావడంచేత - కాని, యీ స్వయంవరంలో ఫెయిలయిన యింద్రాది దేవతలకు రోషం పుట్టింది. ఆఖరుకు, యీ నల దమయంతులకు వారు చేతబడిచేసి (ప్రయోగాలు చేసి) అడవుల పాలు చేసి అనేక కష్టాలు అనుభవించేటట్లు చేశారు. "సలిపిరి దీర్ఘ వాసరనిశల్", - అది పెళ్లి కాక పూర్వం అనుభవించిన అవస్థ - అనేక రాత్రిళ్లు పగళ్లు నిద్రలేకుండా, గడిపారు. నిద్రాహారాలు లేకుండా పెళ్లి అయిన తర్వాతకూడా అడవులపాలై అనేక అవస్థలు అనుభవించారు. దీనికంతటికీ మూల కారణం ఏమిటి? ఆ పెళ్లికూతురుకు స్వయంవరం పద్ధతి ఏర్పాటు చేయడమే. ఆపిల్లకు ఎవరు యిష్టమో ఆపిల్లనే కోరుకో నివ్వవలెనన్నారు. ఈ స్వయంవరం పద్ధతి సీతా అమ్మవారి పెళ్లికికూడా అనుసరించారు. ఆమె స్వయంవరానికి రావణాసురుడు కూడా వచ్చాడు. అప్పుడే ఆ రావణాసురునకు పరాభవం అయింది. అప్పటినుంచీ సీతను అపహరించాలని నిశ్చయించాడు. ఈ మన్మథాగ్నితోనే వానికి లంకాదహనం అయింది. స్వయంవరంలోనే రామరావణ యుద్ధానికీ రావణ సంహారానికి ముగ్గులు వేయబడినట్లయింది. అందుకనే స్వయంవరం పద్ధతికి స్వస్తి చెప్పవలసి వచ్చింది. పెద్దవాళ్ళు వధూవరులకు తగిన సంబంధం నిశ్చయించడం మంచిదన్నారు. వీరి నిర్ణయములు మాత్రం నిర్దుష్టంగా, నిరపాయంగా ఉంటాయా? అంటే, అందుకు ఒక్కటే సమాధానం - పిల్లల మేలుకోరిన పెద్దవాళ్లు తమ మేలు కోరకుండా పిల్లల మేలు కోరి తగిన వివాహసంబంధములు చేయడం అవసరం. పెద్దవాళ్లు పెడత్రోవలను తొక్కితే, పెద్దవాళ్ళను ముందుగా సంస్కరించాలి. కుటుంబయజమాని అంటే రథసారథిగా ఉండాలి. సారథి సరిగ్గా ప్రవర్తించలేదని యెంచి, గుర్రమును దాని యిష్టానుసారమే పోనివ్వవలెనని సిద్ధాంతీకరించడం అవివేకం—

కాలేజీలలో చదువుకునే మొగపిల్లలూ ఆడపిల్లలూ నలదమయంతులవలె కాకుండా శకుంతలా దుష్యంతులవలె గాంధర్వంగా వివాహాలు చేసికొనడానికి స్వతంత్రిస్తున్నారు. శకుంతలకు యీ గాంధర్వ వివాహంవల్ల గర్భమై భరతుడు అనే కుమారుడు కూడా కలిగాడు. ఆ పిల్లవానిని ఆమె యెత్తుకొని దుష్యంతమహారాజు దర్బారుకు వెళ్లి "ఇదుగో నీ బిడ్డ!" అని చూపిస్తే, "నీకూ నాకు సంబంధం లేదు. ఆ బిడ్డ నాకు ఔరసపుత్రుడు కాడు" అన్నాడు. వీడు రాజుగారి ఔరసపుత్రుడగునా, కాడా? అనేటటువంటి వివాదం హైకోర్టువరకు వెళ్ళవలసినంత అగత్యం కలిగింది. శకుంతల తల్లి మేనక కూడా యిదేవిధంగా "ఇదుగో నీ బిడ్డ!" అని విశ్వామిత్ర మహర్షికి చూపిస్తే, "ఆ బిడ్డను చూడను" అని కళ్లకు చెయ్యి అడ్డం పెట్టుకున్నాడు. రవివర్మ ఆ విషయమును మన కళ్లకు కట్టినట్లుగా చిత్రించాడు. తల్లిపోలిక అవస్థలే శకుంతల జాతకంలో కూడా కన్పించాయి. ఈ గాంధర్వ వివాహంవల్ల ఆడది గాడిద అవుతుంది అని లోకం గ్రహించింది. స్వయంవరంకంటె, గాంధర్వం మరింత అగాధంగా పరిణమించింది. ఆ కారణంచేతనే అదీ వద్దు, ఇదీ వద్దు; హాయిగా అగ్నిహోత్ర సాక్షిగా వివాహం చేసికొనడం మంచిదన్నారు. వేదమంత్రాలలో వర్ణించిన అగ్నిహోత్రసాక్షి మాకు అక్కరలేదన్నారు వేడి రక్తంగల నవీన యువతీ యువకులు. "మాలోనే మన్మథాగ్ని ఉన్నది కదా - ఈ మన్మథాగ్ని సాక్షిగానూ, అవసరమైతే సబురిజిస్ట్రారు సాక్షిగానూ వివాహం చేసుకుంటే చాలదా?" అన్నారు.

కాని యీ మన్మథాగ్ని నిలిచి కాలేది కాదు. కొత్తలో బాగానే ప్రజ్వలిస్తుంది. కొన్నాళ్ళయిన తర్వాత చల్లబడుతుంది. సెగపోయి పొగ ఆవరిస్తుంది. ప్రేమ పొగ చూరినట్లుగా ఉంటుంది. ఉండమనలేక ఊదర పెట్టి, పొమ్మనలేక పొగ పెట్టినట్లుగా, మాటమీద మాటవచ్చి, మూటాముల్లె సర్దుకొని, "కామమ్మ మొగుడంటే కాబోలు ననుకున్నాను; కాకపోతే నా కర్రా బుర్రా యివతల పారవెయ్యి. నేను పోతాను" అని లేచిపోవడం సంభవిస్తుంది,

లేచివచ్చినవాళ్ళలాగున కలిస్తే లేచి పోయినవాళ్ళ లాగున విడిపోవడం సులభం అవుతుంది. సరసం విరసం కావడానికి ఎంతోసేపు పట్టదు. "తమలపాకుతో తా నొకటంటే, తలుపు చెక్కతో నే రెండంటి. కాపులుకరణాల్ నా పట్టయితే చేసేదేమిటో చెయ్యవోయి మగడా!" అని విడిపోవడం సంభవిస్తుంది. తమలపాకుల సరసం విడాకుల సరసంలోకి గడియలోకి మారుతుంది. సబ్ రిజిస్ట్రారుకు కావలసింది స్టాంపుగాని సంసారం నిలబెట్టవలెననే వ్యవహారం అతని పనికాదు. మన్మధాగ్ని మూలంగా ఏర్పడింది దాంపత్య ధర్మం. ఈ దాంపత్య ధర్మ మంగళసూత్రము గట్టిదిగా ఉండి, యీ మన్మధాగ్ని మూలంగా ఆ సూత్రము విడిపోకుండా పాడికాకుండా గట్టిగా ఉండేటట్లు కట్టుదిట్టము చెయ్యకపోతే, మన్మధాగ్ని తాపంకూడా ఒక రోగంగానే సంఘంలో వ్యాపించవచ్చు. స్త్రీపురుషుల సాహచర్య సంయోగము రోగ శాంతికర కృత్యమే అవుతుంది. అట్టి జీవితానుభవమును "భోగమనంగ జెల్లనే?" అను మాట నిశ్చయం.

పూర్వము తెనుగు ప్రబంధాలు ప్రబలమైన కాలములో పెండ్లికాని ఆడపిల్లలకు, అందులోనూ ముఖ్యముగా రాజకుమార్తెలకు విరహవేదనలు విపరీతంగా అంటువ్యాధులవలె వ్యాపించియుండినట్లుగా పండితప్రోక్తమైన గ్రంథ ప్రమాణాలు కన్పిస్తున్నాయి. చల్లని వెన్నెలలో చల్ల గాలిలో విహరిస్తే ఆ తాపం హరించేది కాదు. ఇంకా ఎక్కువయ్యేది. చలిగాలిలో తిరుగుతూకూడా విరహతాపం ఎక్కువైంది అనేవారు. "చలిగాలి వేడన్న జన విరుద్ధము సుమ్మ". తామరతూండ్లు గాని, చిగురుటాకులుగాని తెచ్చి పరుండబెట్టేవారు. ఈకాలప్పు మనబోటివాళ్లకయితే ఆ తామరకాడలమీద పరున్నప్పుడు ఒళ్ళంతా తప్పకుండా దురదబెట్టి ఒంటికి తామరపట్టినట్లవుతుంది. కాని, ఆకాలపు ప్రభువులకుమార్తెలకు దురదపెట్టకుండా సుఖంగా ఉండేదికాబోలు. లేదా తామరాకులమీదను కాడలమీదను పరుండగా ఆ దురదపెట్టినప్పుడే, విరాళిగొన్న మరాళగామినులకు మరింత హాయిగా ఉండేదేమో తెలియదు.

"దురదయుం సరదా యగునా
పరదారుల బిడ్డలకును - జగతిని సుమతీ."

అని ప్రశ్నిస్తే నవాబులు కూడా జవాబులు చెప్పలేరు — మదనుని మదమడంచిన సర్వజ్ఞుడు సాంబసదాశివుడే సమాధానమివ్వాలి. అన్యులకది అగమ్యగోచరమైన విషయప్రసక్తి.

అప్పటికీ, ఆ తాపంతీరక కోపంవచ్చి చల్లగాలినితిట్టేవారు. చంద్రుణ్ని దూషించేవారు. ఆఖరుకు పిచ్చి ఎత్తినంతస్థితిలోకి వచ్చేవారు. ఆ పిచ్చిలో ప్రాణత్యాగం చేసుకోవాలని ప్రయత్నించేవారు. వాలుజడను మెడకు చుట్టుకొనిఉరి పెట్టుకోవడానికి ప్రయత్నించేవారు. తోటలో అల్లుకొనియున్న ఒకతీగెను మెడకు చుటుకోవలెనని ప్రయత్నిస్తే ఆ తీగెల చాటున నే తాను వరించిన రాజకుమారుడు దాగియుండేవాడు. ఆడబోయిన తీర్థ మెదురాయె నన్నట్లుగా, వెతుకబోయిన తీగ కాలికి దగిలెనట్లుగా, ప్రాణత్యాగానికి పోతే, ప్రాణకాంతుడే ప్రత్యక్షమయ్యేవాడు. నిప్పులో దూకి మరణించా

తారకి కోపంవచ్చిన కనకవర్షమే!

ఒక ప్రఖ్యాత సినిమా తార ప్రతిరోజూ తన తోటలోని పూల మొక్కలన్నీ, ఆ ప్రక్క వీధి మునలయ్య గారి తాలూకు మేకలు మేసి పోతూవుంటే మండి పడిపోయి, ఆ మేకలను గనుక ఆయన సరిగా హద్దులో పెట్టుకోక పోతే 'అది చేసేస్తాను' 'ఇది చేసేస్తాను' అంటూ వుత్తరం వ్రాసి ప్యూన్ చేత పంపించింది.

ఉత్తరం వెళ్లిన మర్నాడు కూడా ఆ సినిమా తార స్టూడియో నుంచి యింటికి తిరిగివచ్చి చూసుకొంటే, తోటలో పూల మొక్కలన్నీ పాడుపాడు అయి వున్నాయి. ఇంకా ఘాటుగా మరొక ఉత్తరం వ్రాసి ఆమునలయ్యకు పంపించింది.

ఆయినా సరే-మర్నాడు కూడా మేకలు దొడ్డిన పడటం ఆగలేదు. సినిమాతారకు పట్టరానంత కోపం వచ్చేసింది. కారు దిగిన మనిషి దిగినట్లే, సరాసరి మునలయ్య యింటి ముందుకు పోయి నిల్చొని కేక వేసింది.

మునలయ్య యింట్లో నుంచీ వూడి పడ్డాడు.

"ఏమయ్యా! ఎన్ని వుత్తరాలు వ్రాసినా నీమేకలు నా దొడ్డినపడకుండా చూడవేం?" అని అడిగింది.

"అమ్మగారు! ఈ మాట కూడా తమరు ఒక కాయితం ముక్కమీద వ్రాసి సంతకం పెట్టి పంపించి వుంటే, నాకు యింకో పది రూపాయలు ముట్టేవిగదా! అనవసరంగా తమ రెందుకు వచ్చారు, శ్రమపడి" అని నసగటం ఆరంభించాడు మునలయ్య.


"అదేమిటి - పది రూపాయలు ఎలా వస్తాయంటావ్!"

"తమరి సంతకం వున్న కాయితం ముక్క కోసం తపించి పోయేవారికి, తమరు నాకు వ్రాసిన ఆ రెండు వుత్తరాలు వెంటనే అమ్మేశాను. ఏదో మీ దయవల్ల రెంటికీ రెండు పదులు ముట్టాయి. ఇలాగే తమరు నాకు రోజుకో వుత్తరం వ్రాసియిస్తే, నేనూ, నాపిల్లలు చల్లగా వుంటాం తల్లీ" అని బ్రతిమాలాడు మునలయ్య.

కాలక్షేపం

లని కొందరు యత్నించేవారు. తోటలోని చెట్ల పూలనుంచి విశేషంగా రాలిన ఎర్రని పుప్పొడి కుప్పలు తిప్పలుగా పడిఉంటే, ఆ ఎర్రని పుప్పొడి కుప్పను చూచి అగ్నిజ్వాల యని భ్రమించి దానిలో దూకి, ఆ పుప్పొడికండ్లనిండా పడి కండ్లు మంటలెక్కి, కండ్లు మూసికొన్న సమయంలో ఆమె వరించిన రాజకుమారుడే వెనుకనుంచి వచ్చి కండ్లు మరింత మూసేవాడు. "గరళంబున్ కరవయ్యెనే యకట ఖడ్గంబైనచేజిక్కదే?" అని ఆ వేదనపడి ఆత్మహత్యాప్రయత్నాలు అనేకం ఆ విరహతాపంమూలంగా చేసినట్లు కన్పిస్తుంది. ఇది నిజంగా పీనలుకోడ్డు ప్రకారంగా చాలా పెద్ద నేరం. అయితే, ఆత్మహత్య చేసుకుంటానని చెప్పి ప్రాయోపవేశం చేసే వారిమీద ఇండియను పీనలు కోడ్డు 309 సెక్షను ప్రకారంగా ఆత్మహత్యాప్రయత్న నేరారోపణ (*Charge of attempt at Suicide*) చేయవచ్చు. ఆ నేరానికి 1 సం॥ ఖైదుశిక్ష, జరిమానా విధించవచ్చు. యీరోజున రాజకీయ రంగంలో మనమట్టి నేరారోపణలు చేయడంలేదు. ఆనాడు విరహిణుల విషయంలో కూడా రాజులు వినోదంగా చూస్తూ ఉండేవారు గాని, వారిని ఆ నేరానికి పట్టుకొని ప్రాసిక్యూషను చెయ్యలేదు. అయినా ఆడవాళ్లు అబలలు, సుకుమార శరీరులు కావడంచేత, వారికి విరహవేదన వచ్చినా ప్రసవవేదన వచ్చినట్లుగా పట్టశక్యంకాకుండా ఉండేది. అయినా పంజరంలోని పక్షులు లాగున అంతఃపురంలో పెరిగి పెద్దమనిషియై పెండ్లిపేరంటం లేకుండా ఉన్న రాజకుమార్తెకు యీనాటి కాలేజీ విద్యార్థినులకున్న విశాల స్వేచ్ఛావకాశంలో పీసమంతయినా లేకపోవడంచేత, వారి విరహతాపాలన్నీ ప్రబంధాలలోకి ఎక్కి వాళ్ళ బ్రతుకు ఆంధ్రసాహిత్య వీధిలోపడి అల్లరిపాలు కావడం తటస్థించింది. అదంతా ప్రబంధయుగ ప్రణయం. ఆ విరహిణుల కాకిగోల కోయిలగోల పోయినతర్వాత, నాయుడుబావ వెంకి కలిసి సరసాలాడుకున్నారు. వెంకిపాటలలో చెప్పబడిన వెంకికి బాగా చదువు రాకపోయినా, వాళ్లిద్దరి సరసం చూడ సొంపుగా వినుటకింపుగా ఉన్నదని చదువుకొన్న వాళ్లు కూడా కని విని ఆనందించారు. అటుతర్వాత సినిమా ప్రదర్శనయుగం వచ్చి "ప్రేమమయమూ జగమూ, ప్రేమమయమే జీవనమూ" అనే తిరుమంత్రం ప్రతిసినిమా హాలులోనూ మారుమ్రోగేటట్లు చేసింది. దీనివల్ల యువతీయువకులకు ప్రేమఅంటే మొగము మొత్తినట్లు కావచ్చుననిన్నీ, ప్రేమలో ఉండే తీపిపోయి చేదెక్కి ప్రేమఅంటే వెగటు పుట్టవచ్చుననియూ, కొందరు భయపడుతున్నారు. కాని సినిమా తారలమీది మోజూ, మతిభ్రమా చూస్తే, ప్రబంధయుగానికి మించిన పరిభ్రమణయుగం ఇది అని తోస్తోంది.

ఏమైనప్పటికీ, రోగలక్షణమైన ఆకలి ఏదో అనుభవజ్ఞులైన వైద్యులు నిర్ణయించి నిర్మూలించాలి. కాని, లోకానికి శాంతికరకృత్యమేదో, అశాంతికరకృత్యమేదో గ్రహించలేక ప్రవర్తించే నాగరికత ప్రస్తుతం ప్రబలమౌతోంది. ★



విశాఖ బీచ్‌లో పలవల తాటిచెట్లు.

ఫోటో — కె. యస్. కుమందన్, రాయగడ.

అతకని బతుకులు

— పెద్దకథ —

"నడింపల్లి"

24

మెల్లిగా శకుంతల కోలుకుంది. రోజూ నేను వెళ్లివస్తూనే ఉన్నాను; భర్తని పరించి రోజూ విచారిస్తూనే ఉందిట. అయితే, నీళ్లు పోసేదాకా ఎవళ్లమూ నిజం వెల్లడించ దల్చుకోలేదు.

"కాని, గుండె పగిలి చావదట్రా?" అన్నాడు మామయ్య, ఆరోజు; రేపు శకుంతలచేత స్నానం చేయించటానికి డాక్టరు ఒప్పుకున్నాడు.

నేను మాట్లాడ్లేదు; కాసేపుండి, 'అయినా, ఎంతకాలం దాచగలం?" అన్నాను, వీధిలోకి చూస్తూ. మామయ్య అరుగుమీద కూర్చుని చుట్టలు చుడుతున్నాడు; మాట్లాడ్లేదు.

"ఇంతకూ నారాత; చిన్నతనంలోనే దాని కింతపాటు కలగటం దాని పూర్వజన్మ ఖర్మ" అన్నాడు మామయ్య, వేదాంతంలో తనకున్న నమ్మకమంతా ఉపయోగించి. నేనే మనటానికి పాలుపోలేదు. సిగరెట్టు వెలిగించి దీర్ఘంగా ఆలోచిస్తున్నాను.

"రేపు నీళ్లుకాగానే గుంటూరు బైలుదేరమంటుంది: అసలు ఏరోజు కారోజు, 'నాకేమమ్మ—కులాసాగానే ఉందిగా, నీళ్లుపోయరాదూ?' అని వేధిస్తూనే ఉంది" అన్నాడు మామయ్య, వాలిపోతున్న సూర్యుడివంక చూస్తూ. నా ఆలోచన తెగటం లేదు.

"ఇక చూడు— రేపుంటుంది తమాషా" అన్నాడు మామయ్య; నేను సన్నగా నవ్వి ఊరుకున్నాను.

మామయ్య చుట్టినచుట్టలు చేతులో పట్టుకుని, ఇంట్లోకి బైలుదేరాడు. నేను వెనకనే వెళ్ళి శకుంతలగదిదగ్గర నిలబడ్డాను. శకుంతల మంచంమీద కూర్చుని దీర్ఘంగా ఆలోచిస్తున్నది.

"ఎట్లాఉన్నది, శకూ?" అన్నాను, మామూలు ప్రకారం.

"నాకేమ్మంది—ఎంతమంది ప్రాణాలు పోసుకుని ఏన్నేళ్లు బతుకుతానో?" అన్నది, నా వేపు చూడకుండానే. రోజూ, "నాకేముంది బావా, కులాసాగానే ఉంది" అనేది. నాకు కొంచెం కష్టం వేసింది. ఇక—పోయినబిడ్డతోపాటి భర్త మరణవార్త గూడ తెలిసింతర్వాత (అందులో ఇంత కాలం మా అందరిచేత మోసపోయి) ఏమౌతుందో, ఏంచేస్తుందో ఊహించటానికి నా వల్ల కాలేదు.

"నీకేం, పిచ్చా యేం?" అన్నాను, కొద్దిగా కోపంతో, శకుంతల మాట్లాడ్లేదు.

"బిడ్డపోయింతర్వాత ఏంలాభం, ఎంత విచారిస్తేమాత్రం, మనస్సు కుదుటపర్చుకోవాలిగాని" అన్నాను మళ్లీ; శకుంతల ఒక్కక్షణం నావంక చూసి దృష్టి మరల్చుకుంది.

కాని, శకుంతల విషవ; కడుపులోని పాపాయి ఒడిలో ఆడుకునే ఆనందం దానికి లభించదు. లేకపోతే, మరోవిధంగా సముదాయించటానికి వీలుండేది.

"నాకు బిడ్డపోయినందుకుగూడా అంత విచారం లేదు" అన్నది, కాసేపటికి— నేను కళ్లెత్తి చూశాను.

"వారు ఆసుపత్రిలో ఎంత అగచాట్లు పడ్తున్నారో?" అన్నది, తల వంచుకుని. నాకు ప్రపంచమంతా గిర్రున తిరిగినట్లైపోయింది. ఏమని ఓదార్చేది? రహస్యం బైటపడేక్షణం సమీపంలో తొంగి చూస్తున్నది.

శకుంతల దిండులో ముఖం దాచుకొని వెక్కి వెక్కి ఏడవటం మొదలుపెట్టింది. "నేనాయింట్లో అడుగుపెట్టింది మొదలు వారి ప్రాణానికేమీ సుఖంలేదు" అన్నది, ఇంకొస్త ఎక్కువచేసి. ఇంట్లోంచి మామయ్య, అత్తయ్య పరుగెత్తుకొచ్చారు.

"నీకేం, చాదస్తం లాగుందే--?" అన్నాను; అత్తయ్య శకుంతల్ని కౌగిలించుకుని ఓదారుస్తున్నది.

మామయ్య రెండుక్షణాలు నిశ్చలంగా నిలబడి, వాకిట్లోకి వెళ్లి, అరుగుమీద కూర్చున్నాడు, చుట్టఅంటించుకుని. నేను వెనకనే వెళ్లి, పక్కనే కూర్చున్నాను.

"ఇది బతికిందాకా నాకేమీ నమ్మకం లేదురా" అన్నాడు, గద్గదంగా; నేను

అది ఒక పెద్ద గడియారాల షాపు. నాటి ఉదయం షాపు తెరిచీ తెరవక ముందే ఒక వ్యక్తి గబగబా పరుగెత్తుకొంటూ లోపలికి వచ్చాడు. అక్కడవున్న గుమాస్తాఒకడు 'ఏం కావాలి' అని అడిగాడు.

"ఏంకావాలా! మొన్నను -అంటే మొన్న మీ ముఖాన మూడు వందలు పోసి కొన్నానో లేదో - యీ గడియారం అప్పుడేఆగిపోయింది. గడియారాలు బాగుచేసే వాడికి దీన్ని చూపిస్తే, దీనంత పనికిమాలిన గడియారం యిదే కాని యింకొకటి లేదని చెప్పాడు. పైగా దీని ఖరీదు ముప్ఫైయికి మించదట కూడాను. నన్ను నిలువునా దోచేశారు, యీ షాపువాళ్లు. చూడు ఏంచేస్తానో!" అంటూ బుసలు కొట్టుతున్నాడు.

ఆ గుమాస్తా ఆయనను అక్కడే ఒకకుర్చీలో కూర్చోబెట్టి తానుపోయి పోలీసులకు టెలిఫోన్ చేశాడు. వాళ్లు వచ్చి ఆ వ్యక్తిని అరెస్టుచేశారు.

సంగతేమిటేమని విచారిస్తే, మొన్న ఆయన ఆ గడియారం కొన్నప్పుడు యిచ్చిన చెక్కు సరిఅయినది కాదట. అందులో ఫోర్జరీ సంతకంచేసి యిచ్చాడట.

బట్టబయలొనర్చు బట్టహాయిలు

థారన్‌టన్ అనే ఆంగ్లేయ చరిత్రకారుడు "భారతదేశములోని బ్రిటిష్ యితిహాస అధ్యాయములు" అనే గ్రంథంలో యిలా వ్రాశారు.

"గంగర్దామె" అను నామె పూర్తిగా మజిలిను వస్త్రమును ధరించియుండగా గౌతమబుద్ధుడామెను చూచెను. ఆమె ఒళ్ళంతయును ఆ వస్త్రములో నుంచి కన్పించుచుండెను. అందువల్ల ఆమె వస్త్రవిహీనంగా దిసమొలతో ఉన్నదని గౌతమబుద్ధుడు భ్రమించెను. నాటి నుండియు ధర్మనిష్ఠగల ఆడువారెవ్వరును సన్నని మజిలిను బట్టలను ధరించరాదని బుద్ధుడు నిషేధించెను.

అటువంటి పలుచని మజిను బట్టలు ఎంత విలువ చేయునో తెలిసికొనవలెననే కుతూహలం కలుగవచ్చును. క్రీ॥ శ॥ 1776 సం॥లో అన్నింటికంటె సున్నితమైన మజిలిను తాను వెల ఒకటికి 56 సవరనులు ఉండెనని వాట్సు అనే విద్వాంసుడు *Textile Manu-Factures* టెక్సుటయిలు-మాన్యుఫాక్చర్సు ("నేత పరిశ్రమలు") అనే గ్రంథంలో వ్రాసియున్నాడు.

తాను అంటే సుమారు 20 గజములు ఉండవచ్చును. 20 గజములకు 56 సవరనుల చొప్పున గజము 1 కి 2-4/5 సవరనులు లేదా సుమారు 3 సవరనులు వెల అనగా గజము 1 కి ఇంచుమించు అప్పటి మారకపు రేటు ప్రకారముగా రూ 40 లు గాని రూ 50 లు గాని ఉండవచ్చు.

ఇటువంటి సొగసైన భారతదేశపు బట్టహాయిలు బుద్ధుని కాలములోనే అనగా 2 వేల సంవత్సరాల క్రిందటనే స్త్రీల సౌందర్యమును బట్టబయలు చేసెను. మన పురాతన విగ్రహములలో కూడా సన్నని పుట్టములు కట్టినట్లుగా చెక్కబడెను.

అతకని బతుకులు

కళ్ళెత్తి చూశాను. మామయ్య కళ్ళల్లోంచి నీళ్లు కారినై. నేను మాట్లాళ్ళేదు.

"ఏమో--ఎట్లాఉందో, దానిరాత, మా రాత?" అన్నాడు తిరిగి. నేను శకుంతల గదివేపు చూస్తున్నాను. లోపల్నుంచి వెక్కి వెక్కి ఏడవటం తగ్గుతున్నది. లోకాన్ని చీకట్లావరిస్తున్నై. నేను కాసేపు కూర్చుని ఇంటికి బైలుదేరి వచ్చేశాను.

"శకుంతలకి రేపు నీళ్లు పోస్తారా?" అన్నది అమ్మ, ఇంటికి రాగానే; నేను తలూపాను.

అమ్మ మాట్లాళ్ళేదు; తృప్తిగా ఇంట్లోకి వెళ్లిపోయింది. నేను డాబాఎక్కి సిగరెట్టు కాలుస్తూ పచార్లుచేస్తున్నాను. ఆకాశంలో నక్షత్రాలు మిణుమిణుకుమంటున్నై.

ఆ నిశ్శబ్ద వాతావరణం నాలో అర్థంలేని ఆవేదన రేకెత్తించింది; కారణంలేకుండా నే భయపడ్డాను. చీకట్లో దూరంగా గుబురుగా పెరిగిన పొదలు స్వామి ఆశ్రమ ప్రాంతంలోని కఠిన పాషాణఖండాల్లాగా వెక్కిరించినై. తాయి నా మనస్సులో నిలబడి అమాయికంగా నవ్వింది, ఒక్కక్షణం; నా బుజంమీద తలవాల్చి గోముగా పాడింది, ఒక్కనిముషం. తాయి రక్తం తాగి నృత్యంచేసిన శిలలు నా నెత్తిన పడ్డట్లనిపించింది.

నా హృదయం రాధకోసం పలవరించింది. జీవితమంతా ఒక్క వ్యక్తికోసం వెదికాను. శకుంతల తానే ననిపించింది; తాయి తనే ననుకుంది. కాని నే వెదికిన వ్యక్తి రాధ; జన్మజన్మాలుగా నాతో కలిసి ప్రయాణంచేస్తున్న ప్రణయమూర్తి రాధ. చంద్రికను చుంబించిన సముద్రపుటలలాగా నా హృదయతరంగం ఉవ్వెత్తుగా లేచింది. సిగరెట్టు విసిరేసి, కిందికి పరుగెత్తుకుంటూ వచ్చాను. అమ్మ వంటింట్లో పచ్చడి నూరుతున్నది.

"రేపు సాయంత్రం మామగారింటికి వెళ్తున్నా" అన్నాను.

"వెళ్లు--నన్నడగటం దేనికి?" అన్నది అమ్మ, తృప్తిగా నవ్వి.

నేను అక్కడే కూర్చున్నాను. "అయినా, నీ అంతట నీవె వెళ్తే, వాళ్ళేమన్నా అనుకోరట్రా?" అన్నది అమ్మ, నూరిన పచ్చడి రాచ్చిప్పలో పెడుతూ.

"పిలిస్తేనేగా -" అన్నాను, వాకిట్లోకి చూస్తూ.

"నాకు తెలుసులే - మూడు ముళ్లూ పడేదాకానే బడాయిలు; అవతల మేమంతా గుర్తుంటామా?" అన్నది, సంతోషమంతా ఒలికిపోయేట్టు నవ్వి.

నా హృదయమంతా పూలు పూచింది. రాధ నా కళ్ళముందు నాట్యంచేసింది.

25

గడుస్తున్న ప్రతిక్షణమూ ఒకయుగంలా తోచింది. రాధకోసం నా ప్రతి నరమూ పరితపించింది. ఆ రాత్రి నిద్రగూడ సరిగా పట్టలేదు. రాధ నా ముందు ముసిముసి నవ్వులునవ్వుతూ చక్కలిగింతలు పెట్టింది.

"దానికి కనకాంబరాలంటే చాల ఇష్టం; వెళ్లేటప్పుడు తోటలోవి పట్టుకుపో" అన్నది అమ్మ, పొద్దున్నే.

"ఆఁ - అక్కడ దొరకవటే" అన్నాను - లోపల తీసుకుపోవాలనే ఉంది.

"ఏడిశినట్టుంది" అన్నది అమ్మ, ఇంట్లోకి పోతూ.

రాధకోసం ఒక అపురూపమైన బహుమానం తీసుకుపొమ్మని నా మనస్సు ఖలఖంతం పెట్టింది. ఏం తీసుకుపోవాలో తోచలేదు. కాఫీ తాగి మామయ్య ఇంటివేపు వెళ్ళాను. కాని పోవాలనిపించలేదు. ఆ పరిసరాల్లోనే ఇంకో వీథిలోబడి మునిసిపల్ లైబ్రరీకి వెళ్లాను. చివరికి బజార్లన్నీ తిరిగి, పదకొండింటికల్లా ఇంటికి వచ్చాను.

లోకాన్నంతా కొనేసి రాధ కర్పించాలనిపించింది; కాని శక్తిలేక ఊరుకున్నాను. భోజనాలైం తర్వాత తడిగుడ్డలో పూలు కట్టిస్తూ, "మరిచిపోయేవు, జాగ్రత్త; నేను శకుంతల్ని చూసి వస్తాను" అని అమ్మ వెళ్లిపోయింది. నేను ప్రయాణానికి బట్టలు సర్దుకోవటం మొదలు పెట్టాను.

మూడు గంటలైనా, అమ్మ తిరిగి రాలేదు. వెంకటీ, రఘూ, పాపం, వాళ్ళే అన్నం పెట్టుకుని తిని వెళ్లిపోయినారు. నాన్న ఇంకా మధ్యాహ్నపు నిద్రలోంచి లేవలేదు. నే నుండబట్టలేక శకుంతల్ని చూడటానికి బైలుదేరాను. రాధ నా హృదయాన్ని మురిపిస్తున్నది; నే వెళ్ళగానే, బహుశా, చాటున నక్కొని కనబడదు.

నేను వెళ్ళేసరికి మామయ్య సాలోచనగా చుట్టకాలుస్తూ వరాండాలో కుర్చీలో పడుకొనున్నాడు. అమ్మ లోపల అత్తయ్యతో మాట్లాడుతున్నది. శకుంతల కనబళ్ళేదు.

మామయ్య నన్ను చూసి గూడ చూడనట్టే ఊరుకున్నాడు. "శకుంతల ఏమంటోంది, మామయ్యా" అన్నాను, పక్కనే కుర్చీమీద కూర్చొని. మామయ్య మాట్లాళ్ళేదు: విననట్టే ఊరుకున్నాడు. నేను చుట్టూ కలయచూశాను. అంతా మామూలుగానే ఉంది; బాధగా సిగరెట్టు వెలిగించాను.

"శకుంతల పిచ్చిదైపోతుందిరా" అన్నాడు మామయ్య, తరువాత కాసేపటికి. నా హృదయంలో మంటలు వేసినట్లైంది; ఏమన్నట్టు చూశాను.

మామయ్య ఉన్నట్టుండి ఒక్కపెట్టున నవ్వటం మొదలుపెట్టాడు - నాకు భయం వేసింది. మళ్ళీ మెదలకుండా చుట్ట కాల్చటం మొదలు పెట్టాడు.

"ఏమైంది మామయ్యా?" అన్నాను, ఆదుర్దాగా. మామయ్య నా వేపు తేరిపార చూడటం మొదలుపెట్టాడు. నాకు ఏమీ అర్థంగాలేదు.

"ఇంతకూ, దాని రాత, మా రాత అట్లా ఉంది" అన్నాడు, కళ్లు మూసుకుని; కనురెప్పల్లోంచి రెండశ్రుకణాలు జారినై.

"ఊరుకో - దాన్ని గురించి అనుకోని ఏం ప్రయోజనం?" అన్నాను, మెల్లిగా.

"దేన్నిగురించి అనుకోనిగూడ ఏమిటి ప్రయోజనం?" అన్నాడు మామయ్య, విషాదంగా నవ్వి. నాకేమీ పాలుపోలేదు. కడముట్టిన సిగరెట్టు విసిరేశాను; మాట్లాళ్ళేదు.

"నిన్ను వెక్కిరించాను గాని, జీవితంలో సుఖమనేది లేదురా" అన్నాడు మామయ్య, రెండో వేపు చూస్తూ. నా కంఠంలో దుఃఖం కొట్టుకులాడింది; ఏమీ అనలేకపోయినాను.

"ముందు ముందు జీవితాన్ని గురించి ఎన్ని కలలు కంటామో, చివరికి జీవితం అంత దుఃఖభాజన మవుతుంది" అన్నాడు, అటువేపు తిరిగే.

"ఏమిటి మామయ్యా?" అన్నాను, గద్గదంగా. మామయ్య నా వేపు తిరిగి చూశాడు.

"శకుంతలకి మళ్లీ తిరగబెట్టిందా ?" అన్నాను, ఆదుర్దాగా.

మామయ్య మాట్లాడకుండా, నవ్వి ఊరుకున్నాడు. నేను దీక్షగా చూస్తున్నాను.

"ఇంతకీ ఇట్లా రాసిఉంది" అన్నాడు, కాసేపటికి. నే నేదో అర్థం చేసుకుంటున్నట్టు ఫీలైనాను.

"నిన్నూ, శకుంతల్నీ ఒక యింటివాళ్లని చేసి, మా కళ్ళముందు, మా చేతులమీదిగా దాటిపోదా మనుకున్నాను" అన్నాడు పైవేపు చూస్తూ; నాకు శరీరమంతా జెర్రులు పాకినట్లైంది. కంఠంలోని దుఃఖం తోసుకువస్తున్నది.

"నీవు చేసుకోనన్న రోజున, శకుంతల వెక్కి వెక్కి ఏడ్చింది" అన్నాడుమామయ్య. నేను తలకాయ తిప్పుకున్నాను. మాసిపోయిన శకుంతల ప్రతిరూపం నా మనఃఫలకంలో ఒక్కక్షణం నవ్వింది, తియ్యగా; మరుక్షణం నా హృదయంలో నిలబడి గాఢ మనోజ్ఞంగా నును సిగ్గుతో క్రీగంట చూసింది.

"కాని - అవన్నీ ఇప్పు డనుకోని ఏం లాభం?" అన్నాడు మామయ్య, జాలిగా. నేను మెల్లిగా కళ్లెత్తిచూశాను. మామయది. కనుకొలుకుల్లో నిలిచిన నీరెండిపోతున్నై. ఇంకా పైకి చూశాను; ఎదురుకుండా గదిలోంచి శకుంతల ఫొటో నవ్వింది. కళ్లు తిప్పేసుకున్నాను; నాకు తెలీకుండానే కళ్లు చెమ్మగిలినై.

"ఇంటి కొస్తావట్రా?" అన్నది అమ్మ, వాకిట్లోకి వచ్చి. నేను తలకాయ వంచుకునే "వస్తున్నాను, పద" అన్నాను - అమ్మ వెళ్లిపోయింది.

ఒక్క పది నిముషాలు నిశ్శబ్దం చుట్టూ ఉన్న వాతావరణాన్ని స్తంభీభూతం చేసింది: మామయ్య చుట్ట కాలుస్తూ పైకి చూస్తున్నాడు.

అతకని బతుకులు

శకుంతల లోపల ఏడుస్తూ కూర్చొని ఉంటుంది: తన జీవితంలోని నిరాశకు నా మీద నేరం ఆపాదించి తీర్తుంది. తోటలో కాలిబాటలవెంట పరుగెత్తుతూ ఇద్దరం ఆడుకున్న రోజులు గుర్తుకు తెచ్చుకున్నాను. శకుంతల లేని జీవితం నిరర్థకమని వెర్రెత్తిపోయినకాలం స్మరణకొచ్చింది: లోపల పెనుగులాడుతున్న కాంక్షని అరికట్టి, శకుంతల్ని తోసివేసిన క్షణం వెక్కిరించింది. శకుంతల శాశ్వతంగా పరాయిదై పోయిందని నిరాశతోటి ప్రాణాలు తెగించదల్చుకున్న అర్ధరాత్రులు భయపెట్టినై.

శకుంతల నాతోపాటి పెరిగింది; నా కోసమే పుట్టిందనుకున్నాను. నాకుగాకుండా వెళ్లిపోయింది. నా కోసం రాధ ఎక్కడో పుట్టి, పెరిగింది; చివరికి తన జీవితాన్ని, నా జీవితంతో ముడివేసుకుంది. నేను శకుంతలకోసం లాగానే, రాధకోసం ఏ అభాగ్యుడో వెర్రెత్తిపోతుంటాడు. (ఆక్షణం నా హృదయం విషాదంగా నవ్వింది; రాధ నా హృదయంలో కిలకిల పాడింది.) చివరికి రాధ తనకోసం ఉదయించలేదనుకుని నా లాగానే నిరాశతో కృంగి, తనకి వ్రాసి పెట్టినపడతి పరుగెత్తుకొచ్చేదాకా విలపిస్తాడు.

రాధమీది అనురాగంతో నా హృదయమంతా నిండిపోయింది: రాధ దర్శనంకోసం నా కళ్లు తహతహలాడినై. కళ్లెత్తి మామయ్యవంక చూశాను; అట్లాగే ఆలోచిస్తున్నాడు. ఎదురుగుండా చూశాను; శకుంతలఫోటో విషాదంగా నవ్వింది. కళ్లు తిప్పేసుకుని వీధిలోకి చూశాను; ఎండ కాలిపోతున్నది.

"వస్తా, మామయ్యా" అన్నాను, లేచి నిలబడి; మామయ్య నా వేపుచూసి పెదలకుండా ఊరుకున్నాడు. కాని శకుంతల్ని చూడకుండా పోవటానికి మనస్సు దెబ్బలాడింది.

"శకుంతల ఏంచేస్తుంది?" అన్నాను; మామయ్య మాట్లాడకుండా లోపలివేపు చూశాడు. నేను ఇంట్లోకి వెళ్లాను. అత్తయ్య దొడ్లో గిన్నెలు తోలుచుకుంటున్నది. శకుంతల కనబళ్ళేదు.

"శకుంతల ఏంచేస్తుంది, అత్తయ్యా?" అన్నాను. అత్తయ్య మాట్లాడకుండా ఒక్కక్షణం నా వేపుచూసి, మళ్లీ పనిలో నిమగ్నురాలై పోయింది: హృదయంలోని దుఃఖం అడ్డుకట్టలు తెంచుకవస్తున్నట్టు, నిశ్శబ్దంగా వెక్కి వెక్కి ఏడుస్తున్నది.

"అత్తయ్యా, శకుంతల ఎక్కడుంది?" అన్నాను, మళ్లీ.

"ఆ గదిలో ఉందేమో, చూడు" అన్నది, తనపని చేసుకుంటూనే. నేను శకుంతల్ని వెదుక్కుంటూ వెళ్లాను. శకుంతల ఒంటరిగా తలవంచుకుని కూర్చున్నది. నిశ్శబ్దంగా వెళ్లి, వెనకనే నిలబడ్డాను. శకుంతల నన్ను గమనించలేదు.

"శకూ" అన్నాను, చిన్నగా; శకుంతల కదల్లేదు: అట్లాగే బొమ్మలాగా కూర్చున్నది.

"అయిపోయిందాన్ని గురించి అనుకోని ఏంలాభం, చెప్పు" అన్నాను, ఓదారుస్తూ. శకుంతల కొద్దిగా వెక్కి వెక్కి ఏడ్చింది, నీరసంగా.

"ఇక దాన్ని మనస్సులో పెట్టుకుని ఎంత కాలం కుళ్లిపోతావు, చెప్పు" అన్నాను; శకుంతల ఊరుకున్నది. నాకేమీ తోచలేదు. అత్తయ్యా, మామయ్యా ఎక్కడో ఉన్నారు.

"నా మాట వినవూ ?" అన్నాను, గోముగా బుజంమీద చెయ్యేసి. శకుంతల నా చెయ్యి తీసేసి, ఇంకొంచెం ఎక్కువ చేసింది. నేను నిశ్చేష్టుణ్ని నిలబడ్డాను.

"చివరికి, నీవుగూడ నాతో అబద్ధం ఆడావు" అన్నది శకుంతల, కాసేపటికి ఏడుస్తూనే. నాకు ఏం మాట్లాడటానికీ తోచలేదు.

"మీరంతా కలిసి ఆయన్ని మింగేశారు" అన్నది, ముందరికివంగి, ముఖం చేతుల్లో దాచుకుని, వెక్కి వెక్కి ఏడుస్తూ. ఇందులో నాదోషమేమిటో నాకేమీ అర్థంగాలేదు.

"మొగుణ్నీ, బిడ్డనీ పొట్టన బెట్టుకుని, నే బతక్కపోతే నేం ?" అన్నది, బోర్లపడి ఏడుస్తూ.

"ఊరుకో, శకుంతలా" అన్నాను బతిమాలుతూ; 'శకు' నామాట విన్లేదు.

"నీకేం, పిచ్చా యేం ?" అన్నాను, గదమాయిస్తూ.

"పిచ్చే—లేకపోతే ఏంచూసుకుని బతికేది ?" అన్నది, నా వేపు దీనంగా చూసి; నా హృదయం కలిసి ఏడ్చింది. ఏమీ అన్లేక పోయినాను.

"ఈవిధంగా బతికేకంటె, కిందపెట్టగానే కాల్చిపారేసినా, పోయేదాన్ని వాళ్లతో పాటే" అన్నది, ఏడుపు తగ్గించి; నా కడుపు తరుక్కుపోయింది. అట్లాగే నిలబడిపోయినాను.

"పాపిష్టిదాన్ని, నామూలంగా ఆయన్ని మీ రెవరూ పట్టించుకోకుండా పొట్టన బెట్టుకున్నారు" అన్నది, మా అందర్నీ కలిపితిట్టి. నాకేమీ తోచలేదు.

శకుంతల ఏడుస్తునే ఉంది; కాసేపు నిలబడి తిరిగివచ్చేశాను. మామయ్య వాకిట్లో అరుగుమీద కూర్చుని, చుట్ట కాలుస్తూ పైకి చూస్తున్నాడు. నేను వెళ్లి పక్కనే కూర్చున్నాను.

"నాకు తెలుసు—యీ మనోవ్యాధితో, మళ్లీ మంచమెక్కుతుంది" అన్నాడు మామయ్య, తానువిడిచిన పొగవేపు నిశ్చలంగా చూస్తూ. నా కళ్లు చెమ్మగిల్లినై.

26

రాధ నా హృదయాన్ని సూదంటురాయిలాగా లాగుతున్నది; శకుంతల తాడుతో కట్టేసినట్టు యీడుస్తున్నది. అప్పుడే చీకట్లోకి పోతున్న ప్రపంచం వంక చూసి నిట్టూర్పు విడిచాను.

"మమ్మల్ని నోరు మెదపనీయకుండా, ఆ వరసన తిట్టి ఏడుస్తుంటే, అది ఇక బతుకుతుందట్రా ?" అన్నాడు మామయ్య నీరసంగా.

"ఫరవాలేదులే మామయ్యా; నాలుగు రోజులుంటే అదే తగ్గుతుంది" అన్నాను, ముదాయించటానికి. ఈ పాటుకంతా, నేనే కారణమన్నట్టు బాధపడ్డాను మామయ్య మాట్లాడ్లేదు.

కాసేపుండి, ఇంటికి తిరిగివచ్చాను.

"అదేమిట్రా— మామగారింటికి వెళ్తావని, అక్కడే కూర్చున్నావ్ ?" అన్నది అమ్మ, ఇంటికిరాగానే. ఏదో సమాధానం చెప్పాను.

"అమ్మా! అన్నయ్యతో పాటి నేనూ వెళ్తానే ?" అన్నాడు రఘు, అమ్మని పట్టుకుని వేళ్లాడ్తూ. వెంకటి కిటికీ దగ్గర కూర్చుని పద్యం చదువుకుంటున్నాడు, రేపు బళ్లో అప్పచెప్పటానికి.

నీ వెందుకురా ? వాడు వాళ్ళ మామగారింటికెళ్తుంటే—నీ పెళ్ళైతే, నీవు నీ మామగారింటికి కెళ్దువుగాని" అన్నది అమ్మ, నవ్వి; రఘుకేమీ తోచలేదు. గారాబంగా చూశాడు నా వేపు, రమ్మంటానేమోనని. నేను మెదలకుండా, అరుబైట కుర్చీ వేసుకుని కూర్చున్నాను, సిగరెట్టంటించుకుని. రాధని చూడకుండా ఒకరోజు వృథా చేసినట్టు బాధపడ్డాను.

తియ్యటి ఊహల్తో ఆకాశంలోకి చూశాను. దూరంగా ఒక తార రాలిపోయింది. ఏదో అపశకునం భయపెట్టింది.

శకుంతల ఏకాంతంగా గదిలో కూర్చుని కుళ్లిపోవటం గుర్తుకొచ్చింది: ఒక్కక్షణం నా హృదయంమీద వాలి వెక్కి వెక్కి ఏడ్చింది. నా కళ్లు చెమ్మగిల్లినై.

మరుక్షణం రాధ నా గుండెల్లో ముఖం దాచుకుని ముసిముసిగా నవ్వింది; రెండు బాష్పబిందువులు రాలినై.

తుదిక్షణం తోయి నా కళ్ళల్లోకి అమా

(64-వ పేజీ చూడండి)

సోదర మానవుడు

"అమ్మా! గుప్పెడు బియ్యం పెట్టించండి అమ్మగారూ! దిక్కులేని వాణ్ణండి మారాజా!" అంటూ వీధి గుమ్మందగ్గిర గోనెగాడు అరుస్తున్నాడు.

వసారాలో కుర్చీలమీద కూర్చుని రామప్రభు, అతని స్నేహితుడు సులోచనమూర్తి బాతాఖానీ కొడుతున్నారు.

రామప్రభు ఇంటి యజమాని, అతను గోనెగాడు వేస్తూన్న కేకలు విన్నాడు. తమ సంభాషణకి అంతరాయం కలుగుతుందని, పైగా ముష్టివాడు అలన పాలన లేకుండా మొత్తుకొంటూంటే అది మర్యాద అని తన మిత్రుడు భావించడని, అభిప్రాయపడి "పొద్దున్న ఆరు మొదలు రాత్రి పదింటిదాక వీళ్ళగోలే కదా! ఈ ముష్టివాళ్ల పోరు ఇదైపోను. ఎంతకని ఆలోచించడం! అటు గవర్నమెంటువారికే అక్కర లేకపోయె?" అన్నాడు.

మిత్రుడు "ఈ బాధ అన్నిచోట్లా ఉన్నదే! ఇచ్! ఇచ్" అని విచారించేడు.

గోనెగాడు మొర్ర వదలలేదు.

రామప్రభు వాడివైపు చూసేడు. గోనెగాడు వల్లగా సిద్దిలాగున్నాడు. వాడు నమ్రతగా నిలబడగా అంత ఒళ్ళుదాచుకొంటూన్నవాడిలాగు కనబడ్డాడు. వాడి ఒంటిమీద ఒక చిరుగులచొక్కా, ఒక గోచీ ఉన్నాయి. చేతినుంచి జోలె వేలాడుతూంది.

రామప్రభు తనవైపు చూస్తూండడం చూసి గోనెగాడు "ఇంత వేయించండి ధర్మరాజులు!" అన్నాడు.

రామప్రభు లేచి వాడిదగ్గరకి వెళ్లేడు. "ఇక్కడ పెద్దమనుష్యులం మాట్లాడుకొంటూంటే అట్లాగు గాడిదలాగు అరుస్తావేమి? నీకు బుద్ధిలేదుట్రా" అని చీవాట్లు వేశాడు.

గోనెగాడు "మీపాదాలకు దండమండి బాబయ్యా!" అన్నాడు.

"ఒరే! నీకు సిగ్గులేదుట్రా! కారుదున్నపోతులాగున్నావే! కోస్తే పదితలువు చెక్కలవుతావు! కూలినాలి చేసుకొని బతకరాదుట్రా!"

గోనెగాడు ఏదో జవాబు చెప్పబోయేడు.

"పోరా! పో" అంటూ రామప్రభు మరి ఆవైపు చూడకుండా వచ్చి కుర్చీమీదకూర్చున్నాడు. మిత్రుడైన సులోచనమూర్తితో "ఈ ముష్టి వెధవలు ఉటి టక్కరి వెధవలోయ్! ఇంగ్లాండులో ముష్టెత్తుకో కూడదని ఒకరూలు ఉంది. అప్పటికీ పోలీసు వాళ్లని ఏమార్చి ముష్టెత్తుకొంటూనే ఉంటారు. కాని చాల కొద్దిమంది. ఒక ముష్టివాడు దిక్కులేనిచావుచావగా వాడున్న గూభ్యాన్ని వెతికేరుట! కొన్ని లక్షల పౌండ్లధనం కనబడిందట! అప్పుడప్పుడు మనదేశం పత్రికలలోకూడ రాస్తూంటారు. ఒక్కొక్కడి దగ్గిర వెతకబోతే బోలెడంత ధనం దొరికిందని. ఆ మధ్య నాగపూరులో ముష్టివాళ్ల ఆదాయాన్నిగురించి పరిశోధించి లెక్కలు బైటపెట్టేరు. వీళ్లలో కొందరు మోతుబరులున్నారట! ఇక్కడ కొందరు ముష్టివాళ్లు తాము దండుకొన్న బియ్యం నల్లబజారు రేట్లకి అమ్ముకొని డబ్బు చేసుకొంటుంటారు. మనమిచ్చిన గుడ్డముక్కలూ అమ్ముకొంటారు. భిక్షాటన ఒక లాభసాటి వృత్తి" అని భాషించేడు.

"ఔను ఔను!" అంటూ తల ఊపేడు సులోచనమూర్తి.

శ్రీ టేకుమళ్ల కామేశ్వరరావు

గోనెగాడికి ఒక ముక్కైనా అర్థం కాలేదు. కాని "ఇక్కడ ఏమీ పింగదు" అనుకుంటూ ముందడుగు వేశాడు.

వాడు మరొక గుమ్మం ఎక్కేడు. ఇంటి కటకటాలలోంచి కుక్క బొంయి మంది. దానికంటె వాడు గట్టిగా అరవడం మొదలు పెట్టేడు.

అలంకరించుకొని, బుట్టబొమ్మలాగు ఊపుకుంటూ ఒక యిల్లాలు ఇవతలకి వచ్చినది. "పో! కూలీనాలి చేసుకో! కన్నులేని వాడికి, కాలు చెయ్యిలేని వాడికీ ముష్టే, నీకూ ముష్టే? ఇహ మాబోటివాళ్ళం బతకక్కరలేదు! కూలినాలి చేసుకో, పో!" అంటూ కసిరివేసి ఒళ్ళు ఊపుకొంటూ ఇంటిలోకి వెళ్ళింది.

గోనెగాడు పక్క ఇంటి గడపదగ్గిరికి వెళ్ళేడు. ఇంటిలోపల ఎక్కడో పనిచేసుకొంటూన్నట్లుగా కనబడింది. వాళ్ళకి తన కేక అందాలి కదా అని పొలికేకలు పెట్టేడు.

జ్ఞానమూర్తి ఇవతలకి వచ్చేడు. ముష్టివాణ్ణి చూసి విచారించేడు. "ఒరేయి నీబతుకులో కొత్తేమీ లేదు. ఇతర దేశాలలో లక్షలకొద్ది నిరుద్యోగులుంటే, మన దేశంలో కోట్లకొద్ది ఉన్నారు.' ఆరుకోట్లమంది ఉన్నారని ఒకప్పటి అంచనా! ఇది ఒక్క దేశ సమస్యే కాదు. అంతర్జాతీయసమస్యగా పరిణమించింది. పాశ్చాత్యులు మూడు వందలేళ్ళపాటూ, అమెరికన్లు స్పానిష్ యుద్ధకాలంనుంచీ, ఇతరదేశాల ధనం కొల్లగొట్టడంవల్ల ఈ సమస్య బయలుదేరిందని కొందరు బుద్ధిమంతులంటారు. అది కర్ణకఠోరంగా ఉందని మరికొందరిఅభిప్రాయం. ఇదంతా నీకు చెప్తే మట్టుకేమి తెలుస్తుంది! ఏదైనా ఇది ఇంతటిలో తేలే సమస్య కాదని మాత్రం తెలుసుకో! దీని కెవ్వడూ ఏమీ చెయ్యలేడు. నాబోటివాడు అసలు చెయ్యలేడు. దయచెయ్యి మరి!" అంటూ ఇంటిలోకి చక్కాపోయేడు.

గోనెగాడికి ఏదీ అర్థంకాలేదు కాని ఇక్కడ పలకదని మాత్రం గ్రహించి ముందడుగు వేసేడు.

వాడు ముందు వాకిలి దాటి లోపలి గుమ్మందగ్గరకి వచ్చేడు.

తములపాకులు నములుతూన్న శాయాజీ విసవిస ఇవతలకి వచ్చేడు.

"వెధవా! లోపలికే వస్తావుట్రా! వీధిలో పడి చావు! ఎవరేనా కనబడితే 'ముష్టి ముష్టి' అని పొట్టచూపిస్తావ్రా, లేకపోతే చేతికేదో లంకించుకొని ఉడాయిస్తావ్రా! అక్కడికి చావు మొదట!" అన్నాడు.

గోనెగాడు "ఇన్ని గింజలు వేయించండి మారాజా!" అని బతిమాలేడు.

"మొదట వీధిలోకి తగలపడరా అంటూంటే!"

గోనెగాడు వీధి గుమ్మంచేరి "ఒక పాతచొక్కా ధర్మం చేయించండి ధర్మ పెబువులు!" అన్నాడు.

"ఒరేయి నేను నీకు ఒక్క గింజ వెయ్యను? ఒక్కదమ్మిడీ ఇయ్యను! ఒక్క గుడ్డ ముక్క పడెయ్యను! నీకు కావలిస్తే పని పాట్లు చూపిస్తాను. ఒళ్లువంచి పనిచేసుకో! నలుగురికీ ఇచ్చినట్లే కూలి డబ్బులు నీ మొహాన్నీ కొడతాను. ఏమి, రేపటినుంచి పనిలోకి వస్తావా?" అని అడిగేడు.

గోనెగాడు బిత్తరపోయేడు.

"అలాగు చూస్తావేమిటిరా దేభ్యం!"

'రెండుగింజలు వేయించండి మారాజా!'

"ససేమిరా వెయ్యనని నీకు మొదటే చెప్పేను కాదుట్రా! కావలిస్తే పనిచూపిస్తాను చెయ్యి!"

ఎన్నికల ప్రచారాలు వుమ్మరంగా జరుగుతున్న రోజులవి. వివిధ పార్టీలవారు ఒకరికంటె ఒకరు తామే ఎక్కువగా ప్రజల బాగులు కోరే పక్షంవారమని ఋజువు చేసుకోవాలని నానా యాతనలు పడుతున్నారు.

అలాంటి సందర్భంలో ఒకానొక వూళ్ళో ఒక పార్టీకి చెందిన ప్రముఖుడొకడు వేదికనెక్కి వుద్రేకపూరితంగా వుపన్యాసం యిచ్చాడు. ఉపన్యాసం ముగియవస్తున్నప్పుడు ఎందుకైనా మంచిదని "ఇంత సేపూ మీ అందరి కాలాన్నీ పనిపాటలను పాడుచేసిన యీ దీనుణ్ణి మన్నించండి." అన్నాడు–ఎంతో వినయవిధేయతలు వుట్టిపడేటట్లు.

ముందువరసల్లో కూర్చొన్న యువకుడొకడు చివాలున లేచి "దానికేం ఫరవాలేదులెండి. పనీ పాటా వున్న బుద్ధిమంతులందరూ వూళ్ళోనే వుండిపోయారు. ఎటు వచ్చీ ఏ పనీ లేని నాబోటి సోమరిపోతులే మీ వుపన్యాసం వినటానికి యిక్కడ పోగయ్యాం" అని సముదాయించాడు.

ఇక్కడ తన పాచిక పారదనుకొంటూ, గోనెగాడు ముందడుగు వేశాడు. రోడ్డు మీద నడుస్తూండగా వాడి మనస్సులో ఏదో ఆలోచన మెరిసింది "ఎందుకీ తిరగడం? కాళ్ళు నొప్పులు, కంఠశోష! ఆ ఖరయ్య ఏదో కూలిపని చూపిస్తానన్నాడు. అది సేసుకోక ఎందుకొచ్చిన తిరుగుడు! రేపెల్లి ఆ అయ్యనే బతిమాలుకొంటాను." అని తలుచుకొని ఉత్సాహపడ్డాడు.

వాడు మన్నాడు శాయాజీ ఇంటికి వెళ్ళేడు "అయ్యగారూ!" అంటూ పిలిచేడు.

"ఎవడురా వాడు!" అనుకుంటూ శాయాజీ ఇవతలకి వచ్చేడు.

"నేనండి అయ్యగారూ! నిన్న ముష్టికొత్తే తమరు కూలి ఇప్పిత్తానన్నారు కాదంటండి అయ్యగారు!"

"నువ్వట్రా! బుద్ధిమంతుడవే? చెప్పిన మాట కొస్త తలకి పట్టించుకొన్నావే! అయినా అంత అరాత్తుగా ఏమి కుదురుతుందిరా, నీమొహం! అయినా ఉండు కనుక్కొని వస్తాను. నువ్వ ఇక్కడే గుమ్మం దగ్గిర కూర్చో!" అంటూ శాయాజీ ఇంటిలోకి వెళ్ళి తువ్వాలు పైమీద వేసుకొని బయలుదేరాడు.

అతనికొక కర్రల అడితె ఉంది. బొగ్గుల బస్తాల వ్యాపారం కూడ ఉంది. కట్టెలు కొట్టేవాళ్ళు, కూలికి మోసుకుపోయే వాళ్లు అంతా అయిదారుగురున్నారు.

అడితికి వెళ్ళి తక్కిన వాళ్ళతో సంప్రతించేడు. వాళ్ళు "మావాళ్ళే పని పాట్లు లేక అల్లాడుతూ ఏదో ఒక పనికోసమని ఎదురుచూస్తున్నారు. ఇక్కడ వేరేవాళ్ళకి పనెక్కడ కుదురుతుందండి" అని అతని ఆలోచనలను త్రోసిరాజన్నారు.

శాయాజీ ఇంటికి వచ్చేడు. జరిగినదంతా గోనెగాడితో చెప్పి లాభమేమిటని 'ఒరేయి ఇప్పుడు పనేమీ లేదు పోరా!" అని ఒక్క ముక్కలో తేల్చాడు.

గోనెగాడునిర్ఘాంతపోయాడు. కొండంత ఆశా కుంగిపోయింది. కాని ధైర్యం పుంజుకొన్నాడు. మాటాడకుండా బయలుదేరేడు. తలలో ఆలోచనలు రేగేయి. 'కొత్త రోడ్డేత్తున్నారు. అక్కడ పని దొరక్కపోతుందా! సూత్తాను కాదూ!" అనుకొంటూ నడక జోరుచేశాడు.

వాడు కొత్త రోడ్డువేసేచోట కంట్రాక్టరుని కలుసుకొన్నాడు. కాని ప్రయత్నం వృధా అయింది. అయినా పట్టు విడవదలుచుకోలేదు. మార్కెట్టుకి బయలుదేరేడు.

మార్కెట్టులో కూలీలంతా బుట్టలు నెత్తిని బోర్లించుకొని తిరుగుతున్నారు. గోనెగాడు అక్కడికి వెళ్లి వాళ్ళతో తన గోడు చెప్పుకొన్నాడు. వాళ్ళలో ఒక్కడూ సానుభూతి కనబరిచినవాడు కనబడలేదు. పైగా వాళ్ళు "మేమే పని పాట్లు లేక కొట్టాడిపోతూంటే నువ్వొకడివి మధ్యని మాకు పోటీగా బయలుదేరావ్! దయసెయ్! ఎల్లోస్! ఎల్లు! తన్నులు తినగలవు!" అన్నారు.

ఇది కాదనుకొంటూ గోనెగాడు రాయపురం హార్బరుకి బయలుదేరేడు. అక్కడ గేటుదగ్గిర ఒకపోలీసు కాపలా ఉన్నాడు.

గోనెగాడు "అయ్యా! ఏదో ఓడల మీద కూలినాలి సేసుకొని పొట్ట పోసించుకొంటానండి బాబయ్యా!" అన్నాడు.

"పోరా, పో! ఇక్కడ దొంగతనం చెయ్యడానికి వచ్చేవట్రా?" అన్నాడు. పోలీసు.

'కాదండి అయ్యా!" అంటూ వాడు చొరవగా లోపలకి అడుగు వేసేడు.

పోలీసు గోనెగాడి మెడపట్టి గెంటిన గెంటుకి వాడు వెళ్లి రోడ్డుమధ్యని పడ్డాడు.

'ఇది లాభంలే'దనుకొంటూవాడు రైలు స్టేషన్‌కి బయలుదేరేడు.

రైలుస్టేషన్ చేరుకొని ఎట్లాగో ప్లాట్‌ఫారమ్‌మీదికి చొరబడ్డాడు.

ఎవరో ఒకాయన పెద్దట్రంకు పెట్టె పక్కని నిల్చుండగా, గోనెగాడు "బాబయ్యా! కూలి సెప్తారా అండి" అన్నాడు.

"ఈ పెట్టెను గేటవతలకి తీసుకువెళ్లాలి!"

"సిత్తం బాబయ్యగోరు! ఒక అణా దయచేయించండి!"

ఆ పెద్దమనిషి సాయం చెయ్యగా గోనెగాడు పెట్టెని తలమీదికి ఎక్కించేడు.

ఇంతటిలో లైసెన్సు కూలి ఒకడు వచ్చి గోనెగాడితో 'ఎవరు నువ్వు?' అన్నాడు.

"నేను కూలీని!"

(56-వ పేజీ చూడండి)

తెమ్మెసరి

1 వ రంగము.

[చెట్లు, చేమలు...చిన్న, పెద్ద పొదలు.. చుట్టుపట్లు, కీచురాళ్ళధ్వని. చిన్న అడవిలా వుంటుంది. చక్కని పూలచెట్లు. పిచ్చినాడులా విశ్వం ఏవో ఎవరికీ అర్థంకాని మాటలు, పాటలు గొణుగుతుంటాడు. ఉత్సాహము, నిరుత్సాహము వెంటవెంటనే అతన్ని ఆవరించి మరుక్షణంలో మాయమౌతుంటాయి. కొంతసేపటికి చేతుల్తో తల పట్టుకుని]

విశ్వం: (నిరాశతో) ఎంత కాలమని ఇట్లా ఒంటరిగా తిరగాలి నేను? ఏవో అర్థంకాని ఆశయాలు, ఆవేశాలు... ఇంకా ఏమేమిటో.. ఎంతకాలం ఇట్లా నాలో అణగిమణగి ఉంటాయి?? వీటిని పైకితీసి, ఉద్ధరించి లోకకల్యాణం చేసేదాతే లేడా? నిక్షిప్తమైన ఇవి నా ఈ లోకానికి నిరుపయోగమైపోతాయా?

[విజ్ఞానం ప్రవేశిస్తాడు]

విజ్ఞానం: ఎందుకు పిల్చావు?

విశ్వం: ఎవరు నువ్వు?...ఎవరు పిల్చారు నిన్ను??

విజ్ఞానం: (నవ్వి) నువ్వే పిల్చావు... ఇప్పుడే పిల్చావు.. నేను విజ్ఞానాన్ని.

విశ్వం: అయితే ఏమంటావు?

విజ్ఞానం: ఎందుకు పిల్చావో చెప్పు. నీకు ఏం సహాయం కావాలో చెప్పు.. నీ ఈ పరిస్థితికి కారణమేమిటో చెప్పు...

విశ్వం: (విసుగ్గా) ఇదంతా ఎందుకు నీకు? నువ్వు నాకేం చెయ్యగలవు?

విజ్ఞానం: అదే నేనడిగేది.. నీకేం సహాయం కావాలి?.. ఏది కావాలన్నా చేస్తాను. ఈ ప్రకృతిలో విజ్ఞానానికసాధ్యమే లేదు.. చెప్పు, ఏం చెయ్యాలో చెప్పు, చేస్తాను.

విశ్వం: విజ్ఞానం...పేరు బాగుంది. సరే, నే చెప్పింది చెయ్యలేకపోతే?

విజ్ఞానం: హుం.. పరీక్షించు ... చేతకాకపోతే నాదార్ని నేపోతా..ఎప్పటిలా నీ పిచ్చిలో నువ్వుపడి కొట్టుకోవచ్చు.

విశ్వం: సరే...చూడు విజ్ఞానం! ఎన్నో తరాలనుంచి ఇలా ఒంటరిజీవితాన్ని గడుపుతున్నా. చూచినవే చూచి, తిన్నవే తిని, ఆడినదే ఆడి, పాడిందే పాడి నా ప్రాణం విసుగెత్తిపోతూంది. అప్పుడప్పుడు నాలో ఏదో క్రొత్తదనం కన్పిస్తూంటుంది. అదేదో నాకే అర్థంకాదు. రకరకాల ఆదర్శాలు, రకరకాల ఆవేశాలు నన్నాక్రమిస్తుంటాయి. ఒక్కటికూడ నాకు ఉపకరించటం లేదు.

విజ్ఞానం: బాగుంది. నా ప్రతిభనంతా వినియోగించి నిన్ను పూర్తిగా మారుస్తాను. నిన్ను ఎంతో ముందుకు నడిపిస్తాను...నీకు వినోదాన్ని, హాయిని, సంతోషాన్ని కలిగిస్తాను.. అందుకు నీకొక స్నేహితుణ్ని పరిచయం చేస్తాను అతను, నువ్వు విసుగుపుట్టేట్టు విహరించండి. (నెమ్మదిగా చప్పట్లు కొడతాడు. వినోదం ప్రవేశిస్తాడు.)

వినోదం: (విజ్ఞానాన్ని, విశ్వాన్ని చూచి) నమస్తే.. (విశ్వం పకపక నవ్వుతాడు) ..ఎందుకు అట్లా నవ్వుతావు?...

[illegible]

విజ్ఞానం: చూడు విశ్వం, ఇతనే వినోదం. నిన్ను సంతోషపెట్టటానికి నీకు ఆనందం కల్గించటానికి ఏదన్నా చేస్తాడు. అతనికి చేతకాకపోతే నాదగ్గరకు రా. అప్పుడు నీ కోర్కె నే తీరుస్తా. హాయిగా కాలం వెళ్ళబుచ్చండి.. (వెళ్ళిపోతాడు)

వినోదం: ఏయ్, విశ్వం! ఇందాక ఎందుకు నవ్వావ్?

విశ్వం: అహః......ఏం లేదు. నిన్ను చూస్తేనే నవ్వొచ్చింది. అందులో అదేదో చేతులు రెండూ ఎత్తిపెట్టావు. అది మరీ నవ్వు పుట్టించింది...సరేగాని, వినోదం! ప్రతిరోజు చూచిందే చూచి, పాడిందే పాడి, ఆడిందే ఆడి నాకు అసహ్యం కలుగుతోంది.

వినోదం: అయితే ఉండు. (పోయి సారా, సీసా, గ్లాసు తెస్తాడు).. చూడు విశ్వం! ఇది ద్రాక్షసారా. సరిక్రొత్త సారా.. ఇది తాగితే ఎంత మధురంగా ఉంటుందనుకున్నావ్. స్వర్గసౌఖ్యాలనుభవించినట్లుంటుంది. (వరుసగా రెండు గ్లాసులు తాగి) చూడు.. నా...పాట . చూడు...నా.. ఆట...చూడు......దీని ముందు.. ఏది...పని.....కొ...స్తుంది... మధురం.. మధురం.. నిన్ని...స్వ...ప్న.. లో..కం...చే .ర్చ.. టా..ని..కే.. నీ.. కు ..ఈ...ఆ..నం..దం.. ఇ వ్వ..టా..ని . కే .విజ్ఞానం. నన్ను పుట్టించాడు.. తాగు..నువ్వూ తాగు (విశ్వం నోట్లో పోస్తాడు) ఇంకా తాగు...రా.. నాతో

రాజకీయాలలో మొన్న మొన్ననే కాలుపెట్టిన యువకుడొకడు పార్లమెంటుకి ఎన్నికైనాడు అందరూ ఆశ్చర్యపోయారు–అవతల అంత పేరు మోసిన రాజకీయ నాయకులు నిలబడివుంటే, అల్లాటివారందరికీ, నిన్నగాక మొన్న కన్ను తెరిచిన యీ కుర్రాడు ఎలా కొట్టేశాడా అని!

ఎవరో ఒకాయన యీ యువకుణ్ణి అడిగాడు – "నిన్నగాక మొన్న కళ్లు తెరిచిన కుర్రాడివి నువ్వు అంత పెద్ద నాయకుణ్ణి ఎల్లా ఓడించగలిగావని."

"ఆ–దానికేముందీ? నన్ను ఎరుగున్న ప్రతి వొక్కడూ ఆయనకే వోటు వేశాడు

ఆ పెద్దమనిషిని ఎరిగివున్న ప్రతి వ్యక్తీ, నాకే వోటు వేశాడు. ఆయనను ఎరిగినవున్న వాళ్లు చాలా ఎక్కువమందే!" అన్నాడు ఆ యువకుడు.

రా......రావేం...(విశ్వం చెయ్యి పుచ్చుకుని బలవంతంగా లాక్కుపోతాడు.)

* * *

[రెండవ రంగము]

[సమయం : రాత్రి 12 గంటలు. విజ్ఞానం ఈ గదిలో కూర్చొని తీవ్రంగా ఆలోచిస్తూ ఉంటాడు. మధ్య మధ్య లో 'అవును. చెయ్యాల్సిందే... నా జ్ఞానం అంతా వినియోగించి వినోదానికి జీవంపొయ్యాల్సిందే... ...చేస్తాను. చేసి తీరుతాను.' అంటూ ఉంటాడు. మళ్ళీ కొంతసేపు ఆలోచించి "బాగుంది...అంతే...విత్తం, విత్తం కావల్సిందే...విశ్వానికి ఆనందం చేకూర్చటానికి విత్తం కావల్సిందే" అంటూ ఉండగా దిగాలుగా వినోదం ప్రవేశిస్తాడు.]

వినోదం : నమస్తే!

విజ్ఞానం : (కోపంగా) ఏమిటిది? విశ్వాన్ని ఒంటరిగా వదలి ఎందుకొచ్చావు ఇక్కడికి ??

వినోదం: పగలంతా ఆయన్నే సంతోష పెడుతున్నాను. రాత్రి పదిగంటలదాకా ఆయన పాదాల దగ్గరే కనిపెట్టుకూర్చుంటాను. నాకు తెలియకుండా నే 11 గంటలైతే చాలు, కళ్ళు మూస్తాడు, విశ్రాంతి విశ్రాంతి అంటూ...అప్పటి నుండి నాకు పిచ్చెత్తినట్లుంటుంది.

విజ్ఞానం (బిగ్గరగా నవ్వి) విశ్రాంతి... విజ్ఞానానికి విశ్రాంతి అక్కర్లేదు. విశ్వానికూడ విశ్రాంతి లేకుండ చేస్తాను...అదే ఆలోచిస్తున్నా...

వినోదం : విశ్వాన్ని సంతోష పెట్టటానికి నాకు నేనే యమయాతన్లు పడుతున్నా. ఒంటరిగా...మరో సహాయం లేకుండా...ఎంత కాలం ఈ విశ్వానికి సేవ చెయ్యాలీ ..?

విజ్ఞానం : ఒద్దు. నువ్వేమాత్రం కష్ట పడద్దు. (చప్పట్లుకొట్టి విత్తం అని పిలుస్తాడు. 'విత్తం' ప్రవేశిస్తాడు.) చూడు విత్తం! ఎంతో కాలంనుండి నాకు బానిసగా ఉంటున్న నీకు స్వేచ్ఛనిస్తున్నాను. విశ్వానికి ఆనందం కూర్చటానికి నిన్ను విడుదల చేస్తున్నాను...వెళ్లు...నీ ఇష్టప్రకారం విహరించు...వెళ్లు...

విత్తం : హాఁ హాఁ హాఁ ... స్వేచ్ఛ. అవును, విత్తానికి స్వేచ్ఛ. హాఁ హాఁ హాఁ... ఎన్ని తరాలనుండి నీకు సేవచేశాను! ఎంత నిర్దాక్షిణ్యంగా వాడుకున్నావు నన్ను... చెప్పుక్రింద తేలులా అణగి మణగి పడి ఉన్నా. హాఁ హాఁ హాఁ...ఇప్పుడు నీకు నాకు సంబంధం లేదు. చూడు, నన్నెంత కష్టపెట్టావో నిన్నంత దుఃఖపెడతాను... ఏయ్, వినోదం! ఇకనుంచి నువ్వు నాకు బానిసవి. రాఁ...నావెంట రా...రావేఁ (చెయ్యిపట్టుకు లాక్కుపోతుంటే విజ్ఞానం తలవంచుకు ఆలోచిస్తూ ఉంటాడు కొంతసేపు ఉండి వెళ్ళిపోతాడు. ప్రక్కనుండి విశ్వం, వినోదం, విత్తం కలసివస్తారు. విత్తం చేతిలో డబ్బునోట్లు, వినోదం చేతిలో *Playing, Cards* సారాసీసాలు, గ్లాసులు ఉంటాయి. ముగ్గురి నోళ్ళలోను సిగరెట్లు ఉంటాయి.)

వినోదం : (సారా త్రాగుతూ) భలే విత్తం. ఈ ప్రపంచంలో నీకు సాటి లేరనిపించావు. నాకు ఎంతో గొప్పసహాయం చేశావు. ఈ విశ్వానికి రాత్రనక పగలనక ఆనందం కలిగించటానికి ఎంతో తోడ్పడ్డావు. నీ మహిమ నీకే తెలియాలి...నాకు తెలుసు...ఏదీ ఒక్క గ్లాసు. పొయ్యి, ఇంకా పొయ్యి...(పోసుకుని త్రాగుతాడు.)

విశ్వం : (త్రాగుతూ) అబ్బ! ఎంత మధురంగా వుంది. చూడు విత్తం! నువ్వు నా దగ్గరుంటే చాలు...స్వర్గతుల్యంగా వుంటుంది. నువ్వు లేందే విశ్వమే లేదు. వినోదం అసలే లేడు... పొయ్యి......సారా అంతా పొయ్యి. (త్రాగుతూ) నిండా పొయ్యి...ఇంకా పొయ్యి... తే, పేక తే. ఏయ్,వినోదం... రా... ఆడదాం. రా, పాడదాం.

[అంటూ వెళ్లిపోతారు.]

విత్తం : హాహాహాఁ...హాహాహాఁ...... విశ్వం, వినోదం, విజ్ఞానం. హాఁహాఁహాఁ... ఎవరు వీళ్ళంతా?...నాకు బానిసలు. నే లేందే ఈ విశ్వమే లేదు...వినోదం అంత కన్నా లేడు. ఎవరికన్నా, దేనికన్నా నేనే ముందుగా కావాలి. నే చెయ్యలేని పనే లేదు. చెప్పండి! ఎవరికక్కావాలి ఈ విత్తం. విశ్వానికా, వినోదానికా, విజ్ఞానానికా...అన్నిటికీ నేనే కావాలి.. లేదు. విజ్ఞానికి విత్తం లేదు. విజ్ఞానం నాకోసం తపించి తపించి కృశించిపోవాల్సిందే...అబ్బ...ఎంత కష్టపెట్టాడునన్ను ...తన ఇష్టప్రకారం వాడుకొన్నాడు ...చేస్తాను. విజ్ఞానాన్ని అష్టకష్టాలపాలు చేసి నష్టానికి గురిచేస్తాను. హాఁహాఁహాఁ... హాహాఁ...!...హాహాహాఁ...

(విత్తం వెళ్లిపోతాడు.)

—: తెర :—

[మూడవ రంగము]

[విజ్ఞానం చినిగిపోయిన ఒట్టలతో మాసినగడ్డంతో పిచ్చివాడులా వుంటాడు. గదిలో టేబిలుమీద పరిశోధనా సామగ్రి ఉంటుంది. మండుతున్న కొవ్వు వత్తులు, సామీద మరుగుతున్న నీళ్ళు, పెద్ద పెద్దగాజు సీసాలు, *Acide* టేబుల్ మీద ఉంటాయి. విజ్ఞానం వీటన్నిటిని చూస్తూంగా ఆలో దీర్ఘ



"మీరు నడుపుతున్న పత్రిక మా పిల్లల మీద బాగా పని చేస్తున్నదండీ"

"ఓహో! అలాగా!... అంత బాగా వుపయోగ పడుతున్నదన్న మాట."

"మరే నండి. నిన్న మా కుర్ర వెధవలు యిద్దరూ కీచులాడుకొంటూ వుండగా నా కంటపడింది. ఆ పాళంగా మీ పత్రికనే చుట్టగా చుట్టి యిద్దరి వీపులూ మోగించేశాను. ఇక మళ్లా వాళ్లు నోరెత్తితే ఒట్టు!"

చిస్తూ ఉంటాడు. ప్రక్కనుండి విత్తం ప్రవేశిస్తాడు.]

విత్తం : (ప్రవేశించి దర్పంగా) ఏమిటి విజ్ఞానం దీర్ఘంగా ఆలోచిస్తున్నావు?... ఇదంతా ఏమిటి?...అదేమిటి, మనిషి వలా మారిపోయావు?...ఆ చిరిగిన బట్టలు, శుభ్రం లేని మురికి శరీరం; సంస్కారం లేక జడలు కడుతున్న వెంట్రుకలు, దిగాలుపడిన నీ ముఖం ఏదో వెలితిని ప్రదర్శిస్తున్నాయి...

విజ్ఞానం : ఏమీ లేదు. లోకకల్యాణానికి తోడ్పడితే ముట్టిన ప్రతిఫలం ఇదంతా. విశ్రాంతి పొందుతున్న విశ్వానికి కొత్త రుచుల్ని కలుగజేసినందుకు ఏర్పడిన దుస్థితి ఇదంతా...అంతే.

విత్తం : ఏదో వేదాంతం మాట్లాడుతున్నారు విజ్ఞానం!

నిజానికి నిజం తెలుసుకోవటం అన్నది ఏమంత కష్టమైన విషయం కాకపోవచ్చుకానీ, తీరా నిజం తెలుసుకొన్నాక, దాన్ని దాచటానికే ఎక్కువ కష్టపడవలసి వస్తుంటుందేమో!

విజ్ఞానం : ఇది వేదాంతం కాదు; నీ రాద్ధాంతం. చూడు, విత్తం! నిన్ను లోక కల్యాణానికి విముక్తి చేశాను. నీకు స్వేచ్ఛనిచ్చాను. సర్వస్వాతంత్ర్యం ఇచ్చినందుకేనా నన్ను ఇట్లా పీడిస్తున్నావు? గర్వం దరిద్రుణ్ణి చేశావు... ఇంకా నువ్వేం చెయ్యగలవు?...ఇంతకన్న నువ్వేం చేస్తావో చెప్పు...

విత్తం : హాహాహాఁ...పాపం. నేను నీ దగ్గర బానిసగా ఉన్నప్పుడు ఏమేమి మాట్లాడేవాడివో గుర్తుకు తెచ్చుకో. ఎన్నిసార్లో, ఎందరిముందో ఈ ప్రపంచంలో నువ్వు చెయ్యలేనిదే లేదని, నీకు సాటి మరెవ్వరూ లేరని పల్కిన ప్రగల్భాలు జ్ఞాపకం చేసుకో. చూడు. ఇప్పుడు నే లేనిదే, ఈ విత్తమే లేనిదే, విశ్వమే లేదు.. వినోదం అసలే లేదు. ఆనందం అంతకుముందే లేదు...ఎవరిక్కావాలి నీ విజ్ఞానం? జ్ఞానరహితమైనా నేనే విశ్వాన్ని పోషిస్తాను. విశ్వానికి కావలసిన తిండి, బట్ట ఇస్తాను...అసలు విశ్వానికి నువ్వు అక్కరే లేదు. తెలుసుకో...ఇప్పటికన్నా ఈ విత్తం నీకన్న గొప్పవాడని తెలుసుకో... హాఁ హాఁ హాఁ...

విజ్ఞానం : (కోపంతో) కాదు. ముమ్మాటికీ కాదు. లోకం దారిద్ర్యమన్నా అనుభవిస్తుందికాని నీతి, న్యాయం, నిలకడలేని విత్తాన్ని, అందులో విశ్వానికి సహాయంగా విజ్ఞానం సృష్టించిన విత్తాన్ని, విజ్ఞానం కంటె ఉత్తమంగా అంగీకరించదు...

విత్తం : విజ్ఞానం...అంటే ఏమిటి? తినటానికి తిండి, కట్టటానికి గుడ్డ, అనుభవించటానికి ఆనందం ఇవ్వలేని నీ విజ్ఞానం ఎవరికి కావాలి? అడుగు...విశ్వాన్ని అడుగు. నువ్వు తనకి కావాలో నేను కావాలో కనుక్కో...

విజ్ఞానం : విత్తం...విశ్వానికి దినావసరాల్ని కలుగచేస్తూ, ఆనందం, వినోదం కూర్చటానికి వినియోగపడే విత్తం, నిరంకుశంగా, నిరర్థకంగా లోకాన్ని కబళిస్తోంది. వీల్లేదు, అట్లా జరగటానికి వీల్లేదు. జరగనివ్వను.

విత్తం : నువ్వెవరు జరగనివ్వటానికి. విశ్వమే నన్ను ఎన్నుకుంది. మరో క్షణంలో నీకు ఈ విశ్వంలోనే స్థానం లేదు. నువ్వుకూడ నామీదే ఆధారపడి ఉండాలి. లేకపోతే నా బంగారు సంకెళ్లతో నిన్ను సన్మానించాల్సి ఉంటుంది.

విజ్ఞానం : (కోపంతో) ఏమిటి, బెదరిస్తున్నావా? నీ బెదరింపులకు అదురుతాననుకుంటున్నావా? నిన్ను, నీ సహచరుల్ని తల్చుకుంటే ఒక్క క్షణంలో మృత్యువుకు బలిచేస్తాను...

విత్తం : తినబోతూ రుచులడగటమెందుకు...కొద్దిసేపటిలోనే ఎవరు బలౌతారో తెలుస్తుంది. నువ్వే విశ్వానికుపకరిస్తావో, లేక అధోగతి పాలౌతావో తెలుస్తుంది.

విజ్ఞానం : అధోగతి! ఇచ్చిన అధికారాన్ని దుర్వినియోగం చేస్తే ఎవరికైనా అధోగతే...గుర్తుంచుకో...నువ్వు వాళ్లను కల్సుకునే లోపలే నీకు అధోగతి తప్పదు...ఫోఁ...ముందు ఇక్కడనుండి బయటికి ఫో...

విత్తం : హాఁహాఁహాఁ...హాఁహాఁహాఁ... కొద్దిసేపట్లోనే తెలుస్తుంది, ఎవరు అధోగతి పాలౌతారో...జాగ్రత...హాహాహాఁ.

[విత్తం వెళ్ళిపోతాడు.]

విజ్ఞానం : అంతా ఒక్కసారిగ ముంచుకొచ్చింది. ఈ విశ్వాన్ని సంతోషపెట్టటానికి వినోదాన్ని సృష్టించాను. వినోదానికి చేదోడు వాదోడుగా ఉండటానికి విత్తాన్ని బానిస విముక్తి చేశాను. తమతోడిదే లోకమంటూ ఇచ్చిన అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. వీళ్లను క్షమించటమా?... క్షమిస్తే ఏమౌతుంది?......లోకంలో విజ్ఞానమే నశిస్తుంది. మానవులకు పశువులకు భేదమే ఉండదు...తప్పదు. ఈ విత్తాన్ని శిక్షించి తీరాల్సిందే...(బిగ్గరగా కేక వేస్తాడు "పిశాచం" అంటూ. పిశాచం ప్రవేశించి ఒక ప్రక్క నిలబడతాడు) ఏయ్, పిశాచం! ఒక పెద్ద ప్రళయం కల్పించు. ఈలోకంలో స్వార్థమనే విత్తం లేకుండా చెయ్యి ...ఇంకా ఉన్న దుష్టశక్తుల్ని కూడ శిక్షించు...

పిశాచం : మరిమీరు...?

విజ్ఞానం : నాకేం భయం లేదు.

పిశాచం : చిత్తం (*Acid* ను మరుగుతున్న నీళ్లలో పోస్తాడు......దాంట్లో కొన్ని లోహాలుకూడ వేస్తాడు, దుర్వాసన, పెద్దమోత వచ్చేటట్టు చేస్తాడు. సీసాలు క్రిందకుతోసి పగలకొడతాడు. అంతా ప్రళయంలాగా సృష్టిస్తాడు. విజ్ఞానం ముక్కుకు రంగు గుడ్డ పెట్టుకు వెళ్లిపోతాడు. పిశాచం వెళ్లిపోతాడు. స్టేజి మీదకు విశ్వం, వినోదం, విత్తం ఒకరిచేతులొకరు గట్టిగా పట్టుకుని వస్తారు. విత్తం జరిగింది తెల్సుకుంటాడు. తూలుతూ ఒకళ్ళమీద ఒకళ్ళు పడిపోతారు. కోలాహలం]

విత్తం : దుర్మార్గం చేశాడు. చచ్చు తెలివితేటల్తో ప్రళయం కల్పించాడు.

వినోదం : దీనికంతా కారణం నువ్వే. లేనిపోని గొప్పతనం ఆపాదించుకుందామని విజ్ఞానాన్ని అనరాని మాట అన్నావు. అతన్ని చులకనగా చూచావు. నిన్ను బానిస విముక్తుణ్ణి చేశాడన్న మేలన్నా జ్ఞాపకం ఉంచుకోలేకపోయావు...కృతఘ్నుడవు...

విశ్వం : ఇప్పుడు మనగతేమిటి?

వినోదం : అధోగతి, దుర్మరణం...

విత్తం : మరి విజ్ఞానం సంగతి...?

వినోదం : చిరస్థాయిగా నిల్చి ఉంటాడు..

విత్తం : అసంభవం (అంటూ వుండగా పెద్ద ఆకు మండుతూ మీదపడుతుంది. చప్పుడు. చిన్న చిన్న మంట గోళాలు మీదపడి పెద్ద శబ్దంతో ప్రేలుతాయి. భయంతో ఎవరికివారు చేతులువదలి తలో వైపు పడిపోతారు. ప్రతివాడి వంటినిండ రక్తం, మసి అవుతుంది. అదేస్థితిలో తూలుతూ విజ్ఞానం ప్రవేశిస్తాడు. ప్రళయం ఆగిపోతుంది. తూలుతునే స్టేజిఅంతా వెతుకుతాడు.)

విజ్ఞానం : జరిగింది, సర్వనాశనం జరిగింది. ఇడుగో మత్తెక్కిన విత్తం. నోరు తెరుచుకొని, కళ్లుపోయి సర్వనాశనమయాడు. ఇదెవరు? వినోదమా? పాపం వినోదం. నువ్వుకూడ బలి అయావు..తప్పనిసరైంది. (విశ్వాన్ని చూచి) అయ్యో... విశ్వం! నువ్వుకూడ ఉన్నావా? దెబ్బలు బలంగా తగిలాయే...పాపం...(సేద తీరుస్తాడు. విశ్వం తేరుకుని.)

విశ్వం : (నీరసంగా) ఎవరు. విజ్ఞానమా! ఇదంతా ఏమిటి.

విజ్ఞానం : ఇది విత్తం మత్తుప్రభావం. ఒళ్ళెరుగక తనే గొప్పనని ప్రవర్తించాడు. ఇచ్చిన స్వేచ్ఛని సద్వినియోగం చేసుకోలేక పోయాడు. అందుకు అధోగతిపాలయ్యాడు. అడుగో...అటు చూడు.

విశ్వం : అయితే నేనుకూడ ఇందుకు బాధ్యుడినా?

విజ్ఞానం : నువ్వేమిటి, ప్రతిఒక్కరూ బాధ్యులే. చెడిన అవయవం బాగుపరచే

శస్త్ర చికిత్సకు సర్వావయవాలకు నొప్పి కలుగుతుంది... పాపం ఏమీ ఎరుగని వినోదంకూడ నశించాడు. నన్ను చూడు. నేను కూడ మీతోపాటు పాలు పంచుకున్నాను. ఈ స్థితిలో నీకు విశ్రాంతి కావాలి. నీకు పరిచర్యలు చెయ్యటానికి విశ్రాంతిని పిలుస్తాను. ఎవరక్కడ! (విశ్రాంతి ప్రవేశిస్తాడు) విశ్వానికి సంపూర్ణారోగ్యం కలిగేదాకా పరిచర్యలు చెయ్యి... జాగ్రత... విశ్వం! విశ్రాంతి తీసుకో... నే వస్తా...

[విశ్వం, విశ్రాంతి నమస్కరిస్తుంటే విజ్ఞానం నెమ్మదిగా వెళ్లిపోతాడు.]

—: తెర :—

★

సీరియల్ నవల

రెండు మహానగరాలు

చార్లెస్ డికెన్స్

44

సిడ్నీ కార్టన్, ఆ జైలుగొర్రెను వెంటబెట్టుకుని ప్రక్కనున్న చీకటికొట్లోకి తీసుకువెళ్ళాడు. ఆ చీకటికొట్లో కూర్చోబెట్టి ఏదో అతి రహస్యంగా మాట్లాడుతున్నాడు. ఆ మాట్లాడుతున్న దేవిటో యివతలిగదిలో కూర్చునున్న లారీగారికి ఒక్కముక్కైనా వినిపించటంలేదు. ఆయన కట్టెదుటనే గోడకు ఆనుకుని జర్రీ, క్రంచర్, ఏదో దొంగపని చేసినవాడిలాగు గోళ్ళు కొరుక్కుంటూ గిజాటుగా నిల్చునున్నాడు. అతని మనసు మనసులో లేదు. లారీ అతని ముఖంలోకి అదో అనుమానంగా చూస్తున్నాడు. ఆయన అలా చూస్తున్నకొద్దీ, క్రంచర్ మరింత గాబరాగా కాళ్లు తొక్కుకుంటున్నాడు. మధ్యమధ్య, మనస్సులో వున్నదాన్ని దేన్నో బయటికి వెలిగక్కటానికి తాపత్రయపడుతున్న వాడిలాగు పొడిదగ్గు దగ్గుతున్నాడు.

‘జర్రీ!—ఇలా దగ్గిరికిరా!’ అని పిల్చాడు లారీ.

క్రంచర్ జంకుజంకుగా దగ్గిరికి వచ్చాడు.

‘బ్యాంకు ఉద్యోగంగాక ఇంకేం వృత్తి చేస్తూవుండేవాడివేఁవిటి?’

క్రంచర్ యజమాని ముఖంలోకి భయం భయంగా చూస్తూ, ఏ సమాధానం చెప్పటానికీ తోచక కొంచెంసేపు నీళ్లు నవిఁలాడు—అనంతరం అతనికి ఒక ఉజ్వలమైన ఊహ తట్టింది:

‘వ్యవసాయం మోస్తారు పనేదో చేస్తూవుండేవాణ్ణి’ అన్నాడు.

‘ఆఁ!—ఇదేదో చాలా అనుమానంగానే వుంది. టెల్‌సన్సు బ్యాంకు గౌరవమర్యాదలు అడ్డంబెట్టుకుని నువ్వేదో తప్పుడుపన్లు చేస్తూ వుండేవాడివల్లేవుంది. నిజంగా అలాంటి దేదైనావుంటే నిన్ను నేను సహించుతాననుకోకు. ఇంగ్లండుకు తిరిగి వెళ్ళగానే ఆ సంగతేదో తేల్చేస్తాను. టెల్‌సన్సు సంస్థపట్ల మోసం జరగటంమాత్రం నేను ఎన్నడూ సహించను’ అన్నాడు లారీ, కోపంగా.

‘ఏలినోరు చిత్తగించాలి!—ఒకేళ నేనేదన్నా యెదవపని చేశానే అనుకోండి, చేస్తేమాత్రం తమంటి పెద్దమనుసులు ఒకటికి రెండుసార్లు ఆలోచించకుండా నాబోటోళ్ళ పొట్టమీన గొట్టెయ్యడమేనా బాబూ?—యెదవపని చేశానని గాదు నేననేది; ఒకేళ చేశానే అనుకోండి మరిపొట్టమీన కొట్టెయ్యడమేనా అని? అయినా ఒకటి చెబుతా యినండి బాబూ! నే చెడ్డపనేనా ఒక్కడే జేసేడిసే దేవుంది—చేయించే వోరు వోరుంటేగందా చేసేవోడుండేది? మీరెరగందే వుండది బాబూ! డాక్టర్లుండారనుకోండి—ఆల్లు దోసిళ్లకు దోసిళ్లు డబ్బు దిమ్మరించుకుంటావుండారు—పుట్టిపుణ్యానికి; నాబోటి మర్యాదస్తుడైన యాపారస్తులు దమ్మిడీ సంపాయించాలంటే చావు తెంపుకొద్దిమరి—దమ్మిడీ యేటుండీ, టోలీపుట్టడం గగనం. అట్టాంటి వోళ్లంతా బల్లగట్టుకుని బ్యాంకుకువస్తా పోతావుండేదీ, ఆడ నాబోటి, నిజాయితీగల యాపారస్తుడెవుడేసావుంటే కన్నుగొట్టి బండిదగ్గిరికి బిల్చి గుసగుసలాడేదీ—అట్టాంటి వోళ్ళందర్నీ వొగ్గేసి నాబోటోళ్ళని నలిపెయ్యడం అదేమంత దర్మంబాబూ? బ్యాంకుపనిమీద వొచ్చినట్టు నటించి అట్టాపనులు జెయ్యటం అదిమాత్రం బ్యాంకుని మోసం జెయ్యటంగాక మరేంది. నా ఆడది వుండదనుకోండి, వొట్టిసన్నాసి—అసలు యేదో పూర్వపు అగ్గెన కాలంలో బుట్టాల్సిన మడిసిగాని ఈరోజుల్లో బుట్టాల్సిందిగాదనుకోండి; నాశనమైపోయే పాడుపనులన్నీ జేత్తావుంటది. డాక్టర్ల ఆడోళ్లూ పాడుపనులు జేత్తారనుకోండి—యేపాడుపనులు జేసినా, ఆళ్ళమొగాళ్ళకి పదిమంది రోగులు దొరికి పదిడబ్బురాలే పనులు జేత్తారు; ఈళ్లేననుకుండారా యేంటి?—ఇంకా యెంతమందుండారు. ఈ యాపారంలో దిరిగే దళారీలూ, చర్చి గుమాస్తాలూ, చర్చి కాపలావోళ్లూ ఎంతమంది—ఇంతమంది నోళ్లూ గొట్టాల్చివొచ్చేతలికి—నిజాయితీగల నాబోటి అసలు యాపారస్తుడికి మిగిలే దేంది అని?—లేదు సామీఁ అట్టాంటి యాపారంలో దిరిగే వోడికి మిగిలిచచ్చేదీ వుండదు—ఆడుబాగుపడి చచ్చేదీ వుండదు. లేకపోతే ఆ యాపారంలోనుంచి బయటపడలేక, తన్నుకు చావటంగాని—

‘చచ్చా! ఆరి దుర్మార్గుడా—నువ్వు ఎదట కనుపిస్తుంటే నాకు యెంతకంపరంగా వుందీ?’ అన్నాడు లారీ.

‘ఇంతకీ నేను మనవిజేసుకుంటా వుండేదేవిటంటే—నేను జేసింది యెదవపనే అవుతదనుకోండి—అది యెదవపని అనిగాదు నే ననేది—’

‘పూసి పెట్టాలని చూడకు’

‘పూసిపెట్టడం దేనికి లేండి బాబూ!— ఇంతకీనా మనికోటి చిత్తగించాల బాబూ!—యెదవ పనిగాదూ అంటా వుండానూ—తవుర్లాటోరు యెదవపనేనంటా రనుకోండి—నా వుద్దేగం ఊడ దీకించుతారే అనుకోండి—నన్ను దీసేస్తే దీసేసేరుగాక—ఆ వుద్దేగం మళ్లా నాకుర్రోడికిప్పించండి—కుర్రోడనుకునేరు; పెద్దోడయ్యాడు. ఏ పనిజెపితే ఆ పని చటకాలమీనజేసి పారనూకేలా, తరిబీతు జేసిన్ను బాబూ—ఆ ఉద్దోగం మాత్రం ఆడికిప్పించండి—తండ్రి ఉద్దోగం కొడుక్కిచ్చినట్టౌద్ది. ఆడైనా ఆడితల్లి కింత కూడుబెడేత్తుడు. నా దోవేదో నే జూసుకుని ఆ తొవ్వాటం యాపారంలోనే దిరుగుతాను—అదీ నేను యేలినోరికి మనివిజేసుకుంటా వుండది’—

అనువాదం: తెన్నేటి సూరి

'సరేలే—తరవాత ఆలోచిద్దాం — ఇప్పటికి ఆపెయ్' అన్నాడు లారీ.

ఈలోగా కార్టన్ గూఢచారిని వెంటబెట్టుకుని చీకటి గదిలోనుంచి బయటికొచ్చాడు:

'వ్యవహారం అంతా పరిష్కారం చేసుకున్నాం గనుక, ఇక నన్నుగురించి నీవు భయపడాల్సింది యేమీ లేదు—వెళ్ళిరా బర్సాడ్!' అన్నాడు కార్టన్.

వాడిని బయటికి పంపేసి, కార్టన్ కుర్చీ లారీగారికి దగ్గరగా లాక్కుని సెగడుముందు కూర్చున్నాడు. క్రంచర్ కూడా బయటికి తప్పుకున్నాడు.

'ఇంతకీ యేమీ యేర్పాటు చేసినట్టు?' అని ప్రశ్నించాడు, లారీ.

'ఏం చెయ్యగలం—డార్నే వ్యవహారం ప్రమాదకరంగా పరిణమించే పక్షంలో, అతనితో కలసి మాట్లాడటానికి అవకాశం మాత్రం సంపాదించాను—అంతే'—

లారీ ముఖ కవళికలన్నీ నిరాశతో మూడిపోయినై.

'అంతే—అంతకంటే యేమీ సాధించలేకపోయాను. మరీ వొత్తిడిచేస్తే అసలు మొదటికే చెడుతుంది. పీక తెగుతుందని వాడే అంటున్నాడు గదా—మనం వీడి సంగతి బయటపెట్టినా పీక తెగటంకంటె వాడికివొచ్చే పెద్దప్రమాదం యేం వుంటుంది? అందుచేత అంతకంటే వాణ్ణి త్యాగం చెయ్యమని వత్తిడిచేసే అవకాశం లేకపోయింది. ఇంతకీ ఉన్న పరిస్థితి అల్లాంటి గడ్డు వ్యవహారం—ఇంతకంటే చేయగలిగిందేమీ కనుపించలేదు.'

'లారీ దిగులు దిగులుగా దించుకుపోయిన కళ్ళతో నిస్పృహగా నిప్పులోకి చూస్తున్నాడు. లూసీమీద ఆయనకు మితిలేని అనురాగం వుంది. ఆ బిడ్డకు సంభవించిన ఆపదలు తలుచుకుంటే, ఆయన నరాలన్నీ కుదబడి పోతున్నయ్. డార్నేను మళ్లా అరెస్టు చెయ్యటంతో ఆయన మరింత నిరాశగా దిగజారిపోయాడు. ఆయనలో దాగివున్న ముసలితనమంతా ఆ వాతాశలో బయటబడిపోయింది. హృదయంలో రేగుతున్న ఆందోళనను కమ్ముకోవటానికి శరీరమంతా ముడుచుకుని చుట్టులుజుట్టుకుపోయి కుర్చీలో కుదబడి కూర్చున్నాడు. ఆయన కనుకొలకుల వెంట కన్నీరు దిగజారుతోంది.

'లారీగారూ! మీరు ఉదారహృదయులు—మీరు మనసులో పడుతున్న బాధంతా నాకు తెలుసు. తండ్రికన్న కారుస్తుంటే, నాకేమీ పట్టనట్టు, నిర్లక్ష్యంగా ప్రక్కను కూర్చునుండగల తాహతు నాలో లేదు—నావంటి దుస్సంతానాన్నికనే దౌర్భాగ్యం మీకు పట్టలేదనుకోండి—అయినా మీరు నాతండ్రిలాంటివారు—మీరు కన్నీరు విడుస్తుంటే నేను చూళ్లేను'

కార్టన్‌కు అలాంటి మెత్తని మనస్సు ఉన్నట్టు లారీగారు అతఃపూర్వం యెన్నడూ అర్థంచేసుకోలేక పోయాడు. కొనగోట కన్నీరు తుడుచుకుంటూ, అతనికి చెయ్యి అందించాడు.

'ఇలాంటి యేర్పాటు జరిగినట్టు లూసీతో అనబోకండి' అన్నాడు కార్టన్. 'ఇందువల్ల పాపం లూసీ డార్నేను చూసే సావకాశం లేదు సరేగదా, యిందువల్ల రానున్న ప్రమాదాన్ని ముందుగా అతనికి తెలియపరిచి మరింత వ్యథను కల్పించటం మినహా, దానివల్ల మరో ప్రయోజనమేమీ లేదని ఆవిడ మరింత పరివేదన పడవచ్చు—అంతేగాదు యింకా పరిపరివిధాల యోజించి మరింత బాధపడొచ్చు. వట్టినే మనస్సులో చిచ్చుపెట్టినవాళ్ళ మవుతాం. ఆవిడ యెదటబడటం నాకు యిష్టంలేదు. ఆ సంగతి నేను వచ్చినవెంటనే తమతో మనవిచేశాను. చాటున వుండే, నేను చేయగలిగిన సహాయ మేదైనావుంటే ప్రయత్నించుతాను—ఈ సంగతిమాత్రం లూసీతో అనకండి—బహుశా మీ రిప్పుడు లూసీని చూడ్డానికి వెడుతున్నారనుకుంటాను. పాపం ఈ రాత్రంతా చాలా ఆందోళన పడుతూవుంటుంది'—

'అవును—ఇప్పుడే బయలుదేరి వెడుతున్నాను.'

'సంతోషం—మీరు దగ్గిరుంటే ఆవిడకు పంచప్రాణాలూ లేచివస్తయ్. ఇప్పుడు ఎలా వుందో.'

'దుఃఖంలో మునిగివుంది—కాని ఎంత దుఃఖంలో వున్నా ఆ తల్లి సౌందర్యం యెక్కడ దాగుతుంది' అన్నాడు లారీ.

'హూఁ—' బాధగా ఒక పెద్ద నిట్టూర్పు విడిచాడు కార్టన్.

లారీ అతని ముఖంలోకి తెల్లపోయి చూశాడు. ఆ నుదురు మీద యేదో ఒక భావరేఖ, జిగేల్‌మని మెరుపులా మెరిసి మళ్ళీ యిట్టే అదృశ్యమైపోవటం లారీ గమనించాడు. కార్టన్ నెమ్మదిగా కుర్చీలోనుంచి లేచి: 'బయలుదేరతారా మరి' అన్నాడు.

'నీవుకూడా బయటికి బయలుదేరబోతున్నావా యేమిటి?'—

(55-వ పేజీ చూడండి)



విజ్ఞానవీధులు

"డాక్టర్"



67. విజ్ఞానమూ-మహర్షుల శ్లోకాలూ

"మీరు మీ విజ్ఞానముచే శ్లోకాలు వ్రాసిన గొప్ప మహర్షులను కొలదన్నుచున్నారు." అని రాజమండ్రినుండి మల్లిడి సూరిరెడ్డిగారు మందలిస్తున్నారు.

మహర్షులు వ్రాసిన వైజ్ఞానికవిషయాలు నిజము కాకపోయినా వారి శ్లోకాలను ఒప్పుకోమంటారా? రాత్రి నాలుగు ఝాములలోనూ వచ్చిన కలలు వితావాతా సంవత్సరకాలానికేనా ఫలించితీరాలికదా. నా కెన్నిసారులో వియత్పథములో ఎగురుతూన్నట్లు కలలు వచ్చాయి. ఒకటీ ఫలించలేదు. రూపాయలసంచులు మోసుకుపోయే రెండెడ్లబండివెనక నడిచి కిందపడిపోయే రూపాయల్ని జేబుల్లో నింపుకున్నట్లు కలలువచ్చాయి. ఏ ఝాములో వచ్చాయో జ్ఞాపకములేదుగాని ఎప్పుడువచ్చినా ఏడాదిలోగా ఫలించాలికదా? ఫలించనే లేదు! మహర్షుల శ్లోకము ఏమయిందంటారూ? మీరు డైరీవ్రాసి పరీక్షచేసిచూడండి. నిజమౌతాయేమో? నిజముకాకపోయినా పై శ్లోకాల్ని గౌరవించమంటారా? అలాగే లెండి.

ప్రాచీనులకు విజ్ఞానసంపాదనకు ఈనాటి సాధనసంపత్తిగాని, ఒకరితో నొకరు సంప్రతించుకుని దిద్దుకోడానికి ఈనాడున్న వాహనసౌకర్యముగాని, దూరదేశానికి వెళ్లి సురక్షితంగా తిరిగి రాగలగడానికి సౌకర్యాలుగాని లేవు. మరి వారి విజ్ఞానసాధనము కూలంకషము కాగలదా? ఎవరికి వారు తాము చూచినవిషయాలు రాసేశారు. "వేత్తి గానరసం ఫణిః" అన్నారు. పాముకి గాలిలోనుంచి వచ్చే నాదము— డబ్బాకొట్టినాసరే— వినబడదు. "భ్రమరకీటన్యాయమ"న్నారు. కీటము భ్రమరమవదు. స్వాతివానకి ముత్యపుచిప్ప తెరుచుకుంటుందన్నారు. వానచినుకుపడితే కాదు ముత్యమవడము, ముత్యపుగుల్ల చేపకి దురద పుట్టించేకణము ఏదేనా పడాలి. భూమిచుట్టూ సూర్యుడూ, గురుడూ మొదలైన 'గ్రహాలు'అన్నీ తిరుగుతున్నాయన్నారు. "కుక్క తోకని ఆడించడము లేదూ, తోకే కుక్కనీ అదివున్న భూమినీ ఆడిస్తోంది" అనడము లాంటిదే ఇది. "సప్తద్వీపావసుంధరాః"అన్నారు. వేలూరి శివరామశాస్త్రులుగారి వంటి పండితులు నానా తంటాలూ పడినా నిస్సందేహంగా తెలియలేదీ ద్వీపాలు. ఇక సప్తసముద్రాలూ ఏవి? సప్త కులపర్వతాలూ ఏవి? పధ్నాలుగు లోకాలూ ఏవి?

'ప్రాచీనులు అన్నీ కనిపెట్టేశారు'అనే తత్వం స్వరాజ్యం లేదన్న నామర్దా కప్పిపుచ్చుకోడానికి బానిసతత్వం అల్లుకున్న మణికిరీటం. వర్తమానంలోనూ భవిష్యత్తులోనూ ఆశలు లేని జాతికి భూతకాలపు గొప్పలోనే సంతుష్టి!

మహర్షులు చేసిన జిజ్ఞాస ముఖ్యంగా ఆత్మకి సంబంధించినది. అందులో వారు హిమవత్పర్వత శిఖరాల నధిష్ఠించారు. ఆ సుజ్ఞానంలో వారికి కైమోడ్పులూ పాదాభివందనాలూ చేదాము. 'ఇంద్రియాలవల్ల సమకూడే జ్ఞానమంతా రెండో రకమన్నాడు—కణాదుడు. ఈ రెండో రకపుజ్ఞానము ప్రాచీనులకు ఈనాటివారికి తెలిసినంతగా తెలియదు. ఎట్లు తెలియగలదూ? క్రమంగా - మెషీనూ, అచ్చుయంత్రమూ, ఎరోప్లేనూ, రేడియో, పెనిసిలీనువంటి అమోఘౌషధాలూ, సినీమా,— ఇన్ని వింతలు పాపము వారి కాలానికి తెలియవు. ఇవన్నీ వున్న మన ఆధునికుల భౌతికజ్ఞానముతో ప్రాచీనుల భౌతికజ్ఞానము ఎట్లు సరితూగగలదు?

సస్యశ్యామలమైన మనదేశంలోని విజ్ఞానులకు జీవితము అతిసులువైపోయింది. భుక్తికోసము ఎక్కువ కష్టము పడనక్కరలేకపోయింది. కనక వేదాంత చర్చచేశారు. దానిలోని లోతులు కనుక్కున్నారు. పాశ్చాత్యులకు జీవితముకోసము కష్టించవలసిన అవసరము ఏర్పడింది. వారు ఆ దారిలో సుదూరము సాగిపోయినారు. వారు కనుక్కున్న సాధనాలూ, దారులూ, మనకెలా తెలుస్తాయి? అలాగే మన వేదాంతమూ వారికి తెలియలేదు. వడ్రంగికి నేతపని తెలియదూ, సాలెకు కర్రపని తెలియదూ? ఇందులో నామర్దా ఏమిటి? "అలాకాదూ, మన ఋషులకు-వారు 'మన'ఋషులు కాబట్టి దివ్య దృష్టివుంటేదీ, వారన్నీ గ్రహించి పారేశారూ, పాశ్చాత్యులు-వారు మనవారు కారుగా - లాభం లేదు!" అనేవారిలో చేరతారా మీరు? ఒక్క నమస్కారము. మారాతలు మరొకరికి.

68. సంకరజాతి మొక్కలు

"రెండు రకాల పాదులు ఒకేచోట పెట్టినా మనుకోండి. అప్పుడు ఒక రకపు పూవు పొడి రెండవపాదు పూవులలో చేరడానికి అవకాశమున్నది కదా మరి సంకర ఫలము ఉద్భవించదేమండీ" అని విజయవాడనుండి నెప్పల్లి మోహనకుటుంబరావుగారి ప్రశ్న.

అందమైన ప్రశ్న. "రెండు పాదులు" అని ప్రత్యేకముగా మనము పెట్టనక్కరలేదు. సృష్టిలో ఎన్నిరకాలచెట్లు అరణ్యాలలో వృద్ధికావడములేదు? సంకర జాతి ఫలము లేలరావు? అంటున్నారు వారు. దీనికి జవాబుకోసము పూలతోటలో నిలబడి పూవుపూవునకూ పోయే సీతాకోకచిలకను గమనించండి. మీరు రెండు పాదులికాదు, పదిపాదుల్ని కలిపిపెట్టండి, ఆ సీతాకోకచిలక ఒక రకపు పూవులన్నిటినీ వెతికి పూర్తిచేసుకునిగాని ఇంకో రకపు పూవుల్లో దూరదు. ఇది దాని నైజగుణము. పరాగసంపర్కము చేయించే కీటకాలన్నిటికీ ఇది నైజమే.

ఇక బీరపూవుల్నన్నిటినీ ప్రవేశించి మకరందము పీల్చిన కీటకము పొట్లపూవుని ప్రవేశించవచ్చు. అందువల్ల జరిగే మిశ్రమమువల్ల ఏదో పిచ్చి పిందె పుట్టిన పుట్టవచ్చును కాని మంచిపిందె పుట్టదు. ఎమంటారా? ఈ రెండూ వేర్వేరుజాతులు. బీర, పొట్ల కాకుండా చంద్రకాంతపు పువ్వులను గమనించండి. ఎర్రపూవులూ.

పచ్చపూవులూ పూస్తాయి. కొన్నిచోట్ల సగము ఎరుపూ సగము పసుపూ గల పువ్వులు కనబడతాయి. ఇవి సంకరజాతి విత్తనాలవల్ల పుట్టినవి. జాతి ఒకటే అయితే మిశ్రమము సాధ్యము. ఎర్ర పూపొడి పచ్చపూవునకు అందితే, తయారయే విత్తనము ఈ రెండు రంగులూగల పూవులకు కారణమౌతుంది.

జంతువులలో కూడ నైజగుణమే కారణము సంకరజాతులు, విరివిగా బయల్దేరక పోడానికి. మేకకి గొర్రె పుట్టునా? ఒక వేళ అది వచ్చి - గుర్రానికీ గాడిదకీ కంచరగాడిద పుట్టినట్లు - సాంకర్యము జరిగినా, కొత్తజాతికి వంశోత్పాదన శక్తి నశించిపోతోంది భూమిమీద ప్రాణి అన్నది పుట్టినప్పుడు సాంకర్యము అసలు లేకుండపోలేదు సంకరమువల్లనే ఇన్ని జాతుల చెట్లూ మృగాలూ పుట్టినవి. అయితే సంకరమువల్ల పుట్టిన ప్రాణి పరిస్థితుల తాకిడికి తట్టుకుని నిలవగలిగితే అది మరియొక జాతికి మూలము కాగలదు. లేకపోతే అది నశించిపోతుంది. పిల్లులకూ కుక్కలకూ సాంకర్యము చేశారు కొందరు వాటిని ఒకే చోట బందీచేసి. కాని వాటి పిల్లలు చిన్నప్పుడే చచ్చిపోయాయి అంటే జీర్ణము, మొదలైన ప్రాణివ్యాపారాలు సవ్యంగా జరగడానికనువైన నిర్మాణమీ సంకర ప్రాణిలో లేదన్నమాట. సింహానికీ పులికీ హైబేరియన్ పుట్టి కొంతకాలానికి చచ్చిపోయింది. అయితే, ఒకే జాతిలో కూడా సాంకర్యము అంతటా ఉన్నదు మైసూరు అబోతునీ సింహాళీయ గోవునీ కలిపినప్పటి దూడకి తల్లి సుగుణాలూ, తండ్రి సుగుణాలూ అబ్బలేదు కాని ఒంగోలు ఆబోతునీ సింహాళీయ గోవునీ కలిపిన దూడలకు రెండింటి సుగుణాలూ పట్టినవి.

జంతువులకంటె చెట్లు తక్కువరకపు ప్రాణులు. వాటిలో సాంకర్యము సులువు.

చెల్లుకీ చెఱకుకీ కలిపేనాగు కోయంబత్తూరులో వెంకటరామన్ గారు చెల్లువలె మెట్టభూములలో పండగల చెఱకు తయారైనది. వెదురుకీ చెఱకుకీ కలిపితే వెదురంత బలంగా పల్లపు భూములలో పండించగల చెఱకు వచ్చినది. నేలములగా వంగా, రేగూ గంగరేగూ, కలిసినవి. బంగాళదుంపా, టొమాటో చేరిన మొక్క వేళ్ళకు దుంపలూ, కొమ్మలకు కాయలూ కాచింది. కలయిక శాఖా మాత్రమే నన్నమాట నిమ్మ, నారింజా, బత్తాయీ, పంపరమాసీ, ఈడా, గజనిమ్మ కలుస్తాయీ, నిలుస్తాయి కూడాను.

మిశ్రమ ఫలితముగా బయల్దేరిన ప్రాణిలో తల్లితండ్రుల గుణసాంకర్యము వల్ల ప్రాణినిర్మాణము అడుగు తప్పనూ వచ్చును, సరిపోనూ వచ్చును. అలాగు సరిపోయిన ప్రాణులవృద్ధివల్లనే సృష్టిలో ఇన్నిరకాల ప్రాణులున్నాయని జంతుశాస్త్రజ్ఞుల మతము.

చిట్టిప్రశ్నల జవాబులు

—అరుణోదయానికి ముందు కదలిక వల్ల గాలి బాగా చల్లబడుతుంది. నీరు తనలో వేడిని అంత సులువుగా ప్రసరించనియ్యదు. అందువల్ల తెల్లవారుఝామున నీరు వెచ్చగా వుంటుంది.

—పాముకి పైకి కనపడే చెవులు లేవు. కాని లోచెవులున్నాయి. వీటిమీద పొర కప్పిఉండడమువల్ల గాలిలోనుంచి వచ్చేశబ్దాల్ని —నాగస్వరపు నాదమూ, డబ్బావాయించిన చప్పుడూవంటి శబ్దాల్ని —పామువినలేదు. ఇవి పరీక్షచేసి నిర్ణయించిన సంగతులు. బుట్టలోనిపాము కదలికనే చూస్తుంది. నాగస్వరము నాగములకు అక్కరలేదు. చుట్టూవూగే పున్నాగుల కోసమే దానినాదం.

—మైదానప్రదేశంలోనే కాదు ఒక కొండమీద ఎక్కిచూసినా భూమ్యాకాశ సంధిరేఖ గుండ్రంగానే కనబడుతుంది. ఇది భూమిగుండ్రంగా ఉండడమువల్లనే. రాకెట్టులో ఇమిడ్చిన కెమేరా సుమారు నూరుమైళ్ళ ఎత్తునించి తీసిన ఫోటోలో భూమి అంచు గుండ్రంగానే కనబడింది— చిరంజీవిరావుగారూ!

—కలలు మానసిక, భౌతిక, భవిష్యలని మూడురకాలు. అక్కరలేని ఆలోచనలు చెయ్యక, అందరాని కోరికలు పెంచుకోకపోతే మానసిక స్వప్నాలు తగ్గుతాయి. నిద్రపోయే వేళకి కడుపుకాలీ అయితే భౌతికస్వప్నాలు తగ్గుతాయి. భవిష్యస్వప్నాలు చాలా అరుదుగా వస్తాయి. వీటిని రాకుండాచెయ్యడానికి నాకు ఉపాయము తెలియదు; సుబ్బారావుగారూ.

—ప్రాణులు నీటిలోగాని గాలిలోగాని తేలగలగడానికి అవి తమయంత పరిమాణముగల గాలీ, నీరూకంటె తేలికేనా అవాలీ, లేదా నీటినీ గాలినీ వెనక్కినెట్టి. మీదకి లేపగల రెక్కలేనా వుండాలి. మానవులకిగల రెక్కలు నీటిని నెట్టి వారిని జరపగలవుగాని గాలినినెట్టి పైకి ఎత్తడానికి చాలవు తొలిరోజుల 'వైమానికులు' చేతులకు చేటలు కట్టుకుని ఎగరడానికి యత్నించారట.

—ఆకాశమంటే వట్టి, అవకాశమే. 'భూమికీ దానికీ దూరమంటే' మీ ఉద్దేశమేమిటి కొల్లూరివారూ?

—మట్టికూజాలోని నీరు కూజా గోడకి ఉండే చిన్నరంధ్రములద్వారా పైకివచ్చి ఇగిరిపోతుంది. ఇలా ఇగరడానికి కావలసిన వేడిమిని ఆ నీరు కూజాలోని నీటినుంచి తీసుకుంటుంది. అందువల్ల కూజాలోని నీరు పోసిన కొంతసేపటికి చల్లబడుతుంది.


—శరీరముయొక్క ఉష్ణత హెచ్చినప్పుడు చెమటపట్టి, ఆ చెమట ఇగిరిపోయినప్పుడు పై రీతిగనే శరీరము చల్లబడుతుంది.

—నీటిమీద రబ్బరు పొరవలె సాగే గుణముగల సన్నని పొర వుంటుంది. నీటిమీద బ్లాటింగుపేపరు వేసినప్పుడు ఆకులాగ అది తేలివుంటుంది కాని నీటిని పీల్చుకుంటూనే వుంటుంది. క్రమముగా బ్లాటింగుపేపరు బరువై మునిగిపోతుంది. అప్పుడు ఇదివరకు ఈ పేపరుమీద ఉంచిన గుండుసూది నీటిమీది సన్నని పొరమీదికి పదిలముగా దిగి ఆ పొరమీదే నిలిచి వుంటుంది. బ్లాటింగు కాగితము వాడక, గుండుసూదినే నీటిలో వేస్తే ఈ గుండుసూది పతనమువల్ల నీటిమీది పొర దారి ఇచ్చేస్తుంది. నీటిమీద పసుపుపొడీ, బొగ్గుపొడీ నిలిచి ఉండడానికి కూడా ఈ పొరయే కారణము పిచ్చయ్యగారూ. ★




వేషాలీ జానపద నృత్యం

చిత్రకారిణి స్టెల్లా బ్రౌన్ రచించిన యీ చిత్రం ఢిల్లీపార్లమెంటు భవనంలో వున్నది.



★ బదరినాథ్ యాత్రికులు ★



—శ్రీ ఇరుకుల కుమారిలస్వామిగారు రచించిన చిత్రం

బొమ్మరిల్లు

పిసినిగొట్టు

"రవి"

పిసినారి పేరిశాస్త్రి
పెన్ను పోయె నెప్పటనో
ఇల్లంతా గాలించి
కళ్లు తుడుచుకొన్నాడు

క్రొత్తది కొందామంటే
మనసు వొప్పలే దతసికి
వెదకి వెదకి వేసారి
తుదకిట్లనుకొన్నాడు

ఆరుమాసముల దాకా
క్షురకర్మను చేయింపక
మిగిలిన డబ్బులతోటి
కలము కొనదలచాడు

ఈ ఉపాయ మెంతైనా
భేషుగ్గా వున్నదనుచు
గడ్డము, మీసాల్ దుబ్బుగ
నాటినుండి పెంచసాగె

పేరిశాస్త్రి కొకనాడు
సిక్కు సరదా రెవరో
ఎదురుపడగ అతని జూచి
యిట్లని తలచెను శాస్త్రి

నా గడ్డముకంటె యితని
గడ్డము బారుగ నున్నది
ఇతని కలముతో పాటె
పట్టుగూడ పోయెనేమొ

అనుకొనుటే తడవుగ
శాస్త్రి అతని సమీపించి
పట్టుజాడ యేమైనా
తెలిసినదా అని అడిగెను

పట్టు' యేమిటని సర్దార్
తెల్లబోయి చూచాడు



అతనికంటె ఘనుడు

శ్రీ వారణాసి సత్యనారాయణమూర్తి

రాముడికి వారం రోజుల నుంచి మంచికేసేమీ రాలేదు. ఈ రోజుల్లో పోలీసుల ఆర్భాటం వల్ల జాగ్రత్తపడో, మరెందువల్లో ఎవరూ జేబుల్లో పెద్ద మొత్తాలు ఉంచుకోవడం లేదు. అందువల్ల రైళ్ల లోనూ, బస్సులలోనూ జేబులు తడిమినా ఆపూట కాపూట గడుస్తోంది కాని. కొన్నాళ్లు హాయిగా కాలుమీద కాలువేసుకొని కూర్చోడానికి వీలులేకుండా పోతోంది. ఈసారి పెద్దకేసు పట్టి తీరాలనుకొన్నాడు.

ఈపాటికి రాముడు జేబుదొంగ అని మీరు గ్రహించే ఉంటారు. కాని వాడు మామూలుదొంగలలా ఉండడు. వాడిని చూస్తే వాడు దొంగతనంచేస్తాడని ఎవరూ అనుమానించ లేరు. నీటుగా ఇస్త్రీ చేసిన పాయ్‌జామా, సిల్కుచొక్కా తొడుక్కొని జుట్టు వెనుకకు దువ్వి కళ్లకు నల్లద్దాల జోడు పెట్టుకొని సిగరెట్టు కాలుస్తూ, ఇంగ్లీషు మాగజైను ఒకటి చేతిలో పుచ్చుకొని ఉంటాడు. ఇంగ్లీషు చదవటం రాకపోయినా, కొన్ని ఇంగ్లీషు మాటలు నేర్చుకున్నాడు. వాటిని తరుచు వాడుతూ, ఏపెద్ద చదువో చదివినవాడిలా మీకు కనిపిస్తాడు. 'ఏం చదివార'ని ప్రశ్నిస్తే సమయాన్ని బట్టీ 'బి.ఏ' అనో 'బి.కాం' అనో జంకూ గొంకూ లేకుండా చెప్పేస్తాడు. వాడిమీద ఎవరికైనా అనుమానం కలిగినా 'వీడు దొంగ అంటే ఏం చిక్కువస్తుందో' అని భయపడి తామే పొరపాటు పడి ఉండవచ్చునని మాట్లాకుండా ఊరుకొంటారు.

ఈసారి పెద్దకేసు పట్టాలని పట్టుదలగా వున్నాడని చెప్పాగా! అంటే - ఏయింటికేనా కన్నం వేస్తాడా? ఛ - అలాంటి పని వాడి హోదాకు తక్కువ! ఏపని చేసినా పెద్దమనిషి తరహాగానే చేయాలి. బోర్డింగ్ అండ్ లాడ్జింగ్ ఉన్న ఒక హోటలుకు పోయాడు-అక్కడ కావలసిన సమాచారం లభిస్తుందని. ఆహోటల్లోనే ఒక గదిలో ఉన్న ఒకాయన, మర్నాడు రాత్రి పాసింజరుకు బెజవాడ తిరిగి పోతున్నాడని తెలిసింది. ఇంకా వివరాలు తెలుసుకోడానికి ప్రయత్నించాడు. కాని ఆమనిషి ఎందుకు వచ్చాడో, ఏం చేస్తున్నాడో ఎవరికీ తెలియదు. దగ్గర ఏమైనా డబ్బు వుందో, ఏమో - ఆయన గదిలోకి ఎవరినీ రానీయడం లేదు. గదిలోకి ఎవరైనా చూస్తే కూడా, వాళ్లను గదమాయిస్తున్నాడు. రాముడు ఇంకెవరికోసమో వచ్చినట్లు వరండాలో పోతూ, నల్లకళ్ల జోడులోనుంచి ఆయన వున్న గదిలోకి చూశాడు. ఆగదిలో సామానల్లా ఒక పెద్ద ఆకుపచ్చ ట్రంకూ బెడ్డింగు మాత్రమే! సరే-తను వచ్చేశాడు.

మర్నాడు రాత్రి పాసింజరుకు ఒక పెద్ద ఆకుపచ్చ ట్రంకుతో రాముడు స్టేషనులో తయారయ్యాడు. నెల్లూరుకు టిక్కెట్టు తీసుకొని ప్లాట్‌ఫారం మీదకు పోయి ఒక పక్క నిల్చుని చూస్తున్నాడు. ఆమనిషి పెద్ద ట్రంకూ, బెడ్డింగుతో వచ్చి ఒక కంపార్టుమెంటులోకి ఎక్కాడు. ఇంజను కూత వేసినతర్వాత రాముడు అప్పుడే ప్లాట్‌ఫారం మీదికి వచ్చినట్లు, హడావుడిగా తనూ ఆపెట్టెలోకే ఎక్కాడు. వెళ్ళి ఆమనిషికి ఎదురుగా యింకో సీటుమీద కూర్చున్నాడు. తన సీటుకింద బాగా లేదన్నట్లు తన పచ్చరంగు ట్రంకు పెట్టె కూడా ఆమనిషి పెట్టె పక్కనే పెట్టాడు. ఆపని పూర్తిచేసి మళ్లీ తన సీటులో

అతనికంటె ఘనుడు

వచ్చి కూర్చుని ఇంగ్లీషుపత్రిక తిరగ వేస్తున్నాడు.

బండి బయలు దేరింది. గాలి జోరుగా వీస్తోంది. ఆమనిషి వాడితో 'కిటికీతలుపు దించితే బాగుంటుందేమో' నన్నాడు. 'ఓ యస్!' దానికేం' అంటూ కిటికీ తలుపు దించాడు. ఇదే సమయమను కొని మెల్లగా ఆమనిషిని సంభాషణ లోకి దించాడు - రాముడు.

"తమ రెందాక ప్రయాణం?"

"బెజవాడండీ"

"అక్కడ ఏం జేస్తారు?"

"ఏముంది?-ఏదో భూమిమీద వచ్చింది తింటూండడమే."

"ఆస్తి ఏమాత్రం వుందేమి టండీ?" ఆమనిషి చెప్పడానికి ఇష్టం లేనట్లు కొంతసేపు ఆగి అన్నాడు: "ఆ! ఎంత! నూటపాతిక ఎకరా లేనండి." రాముడి గుండె వేగంగా కొట్టుకొంటోంది. మంచి కేసు దొరికిందనుకున్నాడు.

"మద్రాసు ఊరికే చూడ్డానికి వచ్చారా, లేక ఏదైన వ్యాపారం కోసం వచ్చారా"

ఊరికే కూర్చోడం ఎందుకని ఇక్కడ బిజినెస్ చేద్దామని వచ్చాను. కాని బిజినెస్‌కి ఇక్కడ బాగుండలేదండీ. ఏ కలకత్తా లోనో, బొంబాయిలోనో వ్యాపారం ప్రారంభిద్దామనుకొంటు న్నాను."

'మంచి పిట్టే చిక్కింది, చేయి జారనీయకూడదనుకున్నాడు రాముడు మనస్సులో. పైకి- "ఏమోనండీ, ఈరోజుల్లో వ్యాపారం చాలా మందంగా ఉంటోంది. అన్నట్లు మరిచాను-తమపేరు?"

"కోటయ్య అంటారు-తమపేరు సెలవిచ్చారు కాదు."

"వెంకట్రావండీ" అన్నాడు రాముడు తడుముకోకుండా.

"తమ రేం చేస్తున్నారు?"

"ఈమధ్యనే నెల్లూరులో ఒక కంపెనీకి 'ఛీఫ్ అకౌంటంటు'గా రమ్మన్నారు. అక్కడికి పోతు న్నాను."

ఆ మనిషి కళ్లలో మెరుపు వచ్చింది.

"తమ రెంతవరకు చదువు కున్నారండీ?"

"బి. కాం"

"ఆ వుద్యోగంలో ఎంతిస్తారు?"

"రెండు వందలు ఇస్తామన్నారు. ఇంకో ఏభై ఇస్తేగాని వీల్లేదన్నాను. వాళ్లు దానికి క్రింద పెట్టి, మీద పెట్టి చివరికి ఒప్పుకొన్నారు. నౌక రిలో చేరడానికే వెళ్తున్నాను."

"వెనకాల ఏమైనా ఆస్తి వుందా?"

"ఉంది కాబట్టే అడిగినంత జీతం వాళ్లు యిస్తామనేదాకా ఒప్పుకోకపోత!"

ఇద్దరికీ దోస్తీజాస్తీ అయింది. లోకాభిరామాయణం నిరాఘ టంగా సాగింది. రాముడు ఆయనకు సిగరెట్లు ఇచ్చాడు; ఆయన ఇద్దరికీ కాఫీ తెప్పించాడు.

రాముడు ఇక పడక వేద్దా మన్నట్లు సీటుమీద వాలి నిద్ర నటించాడు. మధ్య మధ్యని కళ్లు సగం తెరిచి ఆయన పెట్టికేసే చూస్తున్నాడు. కాని రైలు కుదుపు వల్ల వాడికి వుయ్యాలలో వూగు

సంస్కృతం చెప్పే మాస్టారు క్లాసులోకి వచ్చి కూర్చోగానే క్లాసులో కుర్రాడొకడు మాస్టారు చేతికి ఒక కాయితం యిచ్చాడు.

"ఏమిట్రా యిది?"

"శెలవు చీటి అండి"

"ఎవరికి, ఎప్పుడు, ఎందుకు?"

"నాకేనండి. నిన్న సంస్కృతం క్లాసుకు నేను రాలేదు కదండీ; మా నాన్న గారిచేత యీ శెలవు చీటీ వ్రాయించుకు వచ్చాను."

మేష్టారు కాగితం మడతలు విప్పి యిలా చదివారు.

"అయ్యా!

మా కుర్రవానికి నిన్నటి రోజు గొంతు నొప్పి ఎక్కువగా వుండి తెలుగే సరిగా మాట్లాడలేక పోయాడు. అందుచేత వాడు సంస్కృతం క్లాసుకు హాజరు కాలేదు. అందుకు వానిని మన్నించ వేడుతున్నాను.

ఇట్లు"

....

తున్న చంటిపిల్లాడికి వచ్చినట్టు ఎప్పుడో నిద్ర వచ్చేసింది.

మళ్ళీ కంగారుగా లేచే టప్పటికి ఆయన పెట్టె ఇవతలకు జరిపిఉంది. తన పెట్టె ఆయనకు దగ్గరగా ఉంది. ఆశ్చర్యపోయాడు. బహుశా ఆయన రాముడి పెట్టే తనది అనుకొని దగ్గరగా పెట్టుకొని ఉంటాడు! ఇంకేం - రాముడి పని ఇంకా తేలికైంది - నెల్లూరు రాగానే గప్ చుప్‌గా ఆ పెట్టెతో బండి దిగిపోయాడు.

స్టేషనులో త్వరగా టికెట్టు ఇచ్చివేసి కాళ్లకూ, చేతులకు అడ్డం వచ్చిన ప్రతి కూలీ నీతోసేసి తనే పెట్టె చేతితో పట్టుకొని చక చకా నడిచిపోతున్నాడు. తస్సాదియ్యా - పెట్టె చాలా బరువుగా ఉంది! లోపల ఏముందో ఎంత వుందో! చేయి లాగుతోంది. అయినా సరే తనే మోసుకు పోతున్నాడు.


పెద్ద రస్తాలు విడిచి చిన్న చిన్న వీధుల వెంబడి పడి పోతున్నాడు. ఇంతలో దూరంగా ఇద్దరు పోలీసులు వస్తున్నారు! వాళ్లను చూడగానే రాముడి గుండె ఒక 'బీటు' తప్పింది. పెట్టె సంగతి అప్పుడే తెలిసిపోయింది కాబోలు! కంగారుగా ముందుకు నడిచి పక్క సందులోకి దూరి అదే పరుగు! చాలా దూరం పోయాక కానీ వెనక్కి అయినా తిరిగి చూడలేదు. తీరాచూస్తే పోలీసులు లేరు. "బతికాంరా బాబూ" అనుకున్నాడు.

తిన్నగా ఊరిబయటకు దారి తీశాడు. దూరంగా పెద్దబీడు ఉంది అక్కడ అంతా పెద్ద పొదలూ, ముళ్లకంచెలూ ఉన్నాయి. పొదల మధ్యకు చేరి, నేల బాగు చేసుకొని చతికిలబడ్డాడు. చిన్న బాటరీ లైటు వెలిగించి ఒక సాధనంతో తాళం తీసి పెట్టె తెరిచాడు.

పైన తెల్లని ఇస్త్రీ పంచె ఉంది. ఉత్సాహంతో అది పైకి తీశాడు. దానికింద చీకిపోయిన పాతగుడ్డ పీలిక ఉంది. అప్పటికే వాడి గుడ్లు బయటకు వచ్చాయి. ఆగుడ్డ పీలిక పైకి లాగాడు. ఒక కంకర రాయి ఎగిరి పడింది. పెట్టె అంతా తిరగ దీశాడు. అన్నీ పాతగుడ్డలే! అన్నీ కంకరరాళ్లే!!

"ఆరి వీణ్ణి తగలెయ్యా! వీడెవడో నాకంటె ఘనుడిలా వున్నాడే!" అనుకొన్నాడు; రెండు చేతులూ నెత్తిమీద పెట్టుకొని ఆకాశంవంక చూస్తూ!

★



చిక్కుదారులు.

—శ్రీ కోనేటి కృష్ణారెడ్డి.

తామర పువ్వులోని తేనీయలు రుచి చూచుటకు ఆడ తుమ్మెద తన పిల్లలతోటి చిక్కుదారులు కనిపెట్టి ముందుగా వెళ్లింది. కాసేపు తాళి మగతుమ్మెద ఆడ తుమ్మెదను వెతుక్కొంటూ బయలుదేరింది. కాని చిక్కుదారులలో పడి దారులు తెలియక అవస్థలు పడుతున్న మగతుమ్మెదకు మీరైనా దారులు చూపండి చూద్దాం!!!

చిట్టికి తోచిన సందేహం

ఆ రోజు అమ్మ లేపితే నిద్ర లేచాను.

బయిటికి వచ్చి చూచేసరికి—పెద్ద పెద్ద వాళ్లంతా చీపురు కట్టలు పుచ్చుకొని వీధులు వూడుస్తున్నారు. రోజూ మా అమ్మ వూడ్చే చోట కూడ వూడుస్తున్నారు. వాళ్లు పెద్ద వాళ్లని నాకేలా తెలుసు నంటారేమో—రోజూ మా నాన్న దగ్గరకు వాళ్లు వస్తూ వుండటమూ, వాళ్లు రాగానే మా నాన్న కుర్చీలో నుంచి లేచి, వారికి నమస్కారాలు చేసి, వాళ్లను కూర్చోబెట్టి, తను కూర్చుండటం చూస్తూనే వున్నాగా! నాచేతకూడా అందరికీ నమస్కారాలు చేయించేవారు మానాన్న. నేను రోజూ చూచేవారిలో కొందరున్నారు. అందుకని వారితో వున్నవారంతా కూడా పెద్ద మనుష్యులనుకొన్నా.

లాగులు తొడుక్కొని కొందరు, లాల్చీలు తొడుక్కొని కొందరు, రకరకాల టోపీలతో కొందరు వూడుస్తున్నారు. కొందరు 'అక్కడ' 'యిక్కడ' అని అరుస్తూ పెత్తనం చేస్తున్నారు. అదంతా చూస్తూంటే వారలా ఎందుకు చేస్తున్నారో నాకు అర్థం కాలేదు.

ఇదివరకు ఒకసారి పట్నంలో మామూలుగా వీధులు పాకీదొడ్లు వూడ్చే పాకీవాళ్లు ఆపని చేయటం మానివేస్తే పెద్దవారంతా ఆపని చేశారని మా నాన్న చెప్పిన మాటలు జ్ఞాపకమొచ్చినై. ఈవూరిలో కూడ ఆలానే జరిగిందేమో అనుకున్నాను ఇంకో ఆలోచన తట్టింది. వీళ్లంతా యీలానే మన యిండ్లు దొడ్లు వూడుస్తుంటే, మరి వీళ్ల యిండ్లు దొడ్లు ఎప్పుడు వూడ్చుకొంటారు? ఎవరివీధి వారు, ఎవరి దొడ్డి వారు వూడ్చుకొంటే సరిపోతుందే-ఈగుంపు, యీగలభా ఎందుకు? మేం చేస్తున్నామని నలుగురికీ చూపించటానికా? అని అనుకొంటూ లోపలికి వెళ్లాను.

"వరం; తొందరగా స్నానం చేసిరా-కాఫీ యిస్తా"నంది - అమ్మ.

శ్రీమతి కె. వరలక్ష్మి

కాఫీ త్రాగి నాన్న గదిలోకెళ్లా. పెద్ద బల్లా, దానిమీద కాగితాల కట్టలు, మూతదీసి మంగలి సామానులతో నిండివున్న పెట్టె, చల్లారిపోతున్న కాఫీగ్లాసు దానిని చూడకుండా మిషను ముందు కూర్చొని నాన్న షైపు చేస్తున్నాడు. తిన్నగా ఆయన దగ్గరకు వెళ్లి-"నాన్నా" అని పిలిచాను.

"ఏం, చిట్టీ?" అని అడిగారు నాన్న.

(నేనంటే మాయింటిలో అందరికీ యిష్టమే. చిన్న చిన్న పనులు చేసిపెట్టుతుంటాను కనుక మా అమ్మకు యిష్టం. సినిమా పాటలు పాడుతాను; బొమ్మలు వేస్తున్నప్పుడు కుంచెలు, రంగుల చిప్పలు వగైరా సామానులు అందిస్తాను - అందుకని నాన్నకు యిష్టం. అసలు నాపేరు వరలక్ష్మి. నన్ను 'వరం' అని 'చిట్టి' అని పిలుస్తారు.)

"పెద్ద పెద్ద వాళ్లంతా వీధులు వూడుస్తున్నారు ఎందుకు నాన్నా" అని అడిగా.

"ఇవ్వాళ బాపూజీ పుట్టిన రోజమ్మా! అందుకని వూడుస్తున్నారు."

"పుట్టిన రోజు అయితే బొమ్మలు పెట్టుతారు; పండ్లు పోసుకొంటారు కానీ, యీ వూడుపులెందుకు నాన్నా?"

"అల్లా చేయమని ఆయన చెప్పాడమ్మా"

"ఓస్ - ఇంతేనా - గాంధీ తాతంటే!"

"అదేమిటి చిట్టీ?"

"ఏమి టేమిటి నాన్నా! గాంధీ తాతంటే దేముడనీ, ఏమేమోననీ చెప్పావే. ఉత్త తెలివిలేనివాడన్న మాట!"

"తప్పు చిట్టి...అయనను అల్లా అనకూడదు"

"ఎందుకనకూడదు నాన్నా? ఆయన పుట్టినరోజుమాత్రం - వూడ్చుకొని శుభ్రంగా వుండాలేం? మిగిలిన రోజుల్లో వూడ్చుకోకుండా మన్నా, దుమ్ముతో వుండాలేం? ఇంతేనా, నాన్నా, ఆయన చెప్పింది?"

"అది కాదమ్మా! ఆయన ప్రతి



రోజూ గ్రామ పారిశుధ్యం అవసరమని చెప్పాడు".

"ప్రతిరోజూ మంది యిండ్లు; వీధులు వూడవమని చెప్పాడా?"

"అవునమ్మా"

"ఇల్లా మంది యిళ్లు వూడుస్తూ కూర్చుంటే మరి తిండి ఎట్లా నాన్నా?"

"అదే వస్తుంది!"...

"అయితే నాన్నా - రాత్రింబగళ్లు - అన్నం నిద్రా మానేసి మాకొరకే - మాతిండి కొరకే - యీ వుద్యోగంలో ఎన్నో కష్టాలు పడుతున్నానంటావు గదా మరి! చీపురుకట్ట పట్టుకొని అమ్మలాగ రోజు వూడవరాదూ? అన్నం అదే వస్తుందిగా!"

"చిట్టీ! నీతో వేగటం కష్టంగా వుందే. చెపుతే అర్థం చేసుకోవు; తోచిన దల్లా అనేస్తావు."

"మనస్సులో మాట దాచుకో కూడదు; నిజం చెప్పటానికి భయపడ కూడదని మీరే చెప్పారుగా. మరి నేను అలా మాట్లాడుతే చిరాకెందుకు నాన్నా?—నా కర్ణమయ్యేటట్టు నిజం చెప్పరాదూ?"

"అది కాదే చిట్టీ; బాపూజీ తన నిర్మాణ కార్యక్రమ సూత్రాలలో గ్రామ పారిశుధ్యం ముఖ్యావసరమన్నాడు. శుభ్రత తెలియని వాండ్లకు తెలిసినవాళ్లు, వాండ్లకు తెలిసేవరకు, తాము చేసి చూపించాలి. ఇండ్లు అలుక్కోటం తెలియని వాళ్లుంటారనుకో! తెలిసిన వారు వారి యిండ్లకు పోయి అలికి చూపాలి. ఒకసారికి రెండుసార్లు అలాచూపితే, వాళ్లకూ తెలుస్తుంది. వాళ్లు తమ యిండ్లను శుభ్రముగా వుంచుకొంటారు. అల్లాగే ఆరోగ్యానికి సంబంధించిన ప్రతి విషయము కూడ తెలియనివాండ్లకు తెలిసిన వాండ్లు - వాండ్లకు తెలిసేవరకూ చేసి చూపాలి...యిదీ బాపూజీ వుద్దేశ్యం."

"మరి...అయితే ... యీ పెద్దవాళ్లు రోజూ ఆ తెలియనివాళ్ల యిళ్లకు పోయి అలాగే చేస్తుంటారా నాన్నా?"

"అబ్బ! నీతో గట్టి చిక్కే వచ్చిందే చిట్టీ. నీవు లోపలికి పో- నాకు చాలా పనివుంది. తరవాత చెప్పతాను" అని చిరాకుగా అన్నాడు నాన్న.

ఇంతలో - అమ్మ వచ్చింది- "ఏమిటే వరం పెద్దవాళ్ల సంగతులు నీ కెందుకు? పద లోపలికంటూ" నన్ను లాక్కెళ్లింది.

ఊడవట మెందుకో తెలిసింది కానీ, మళ్లీ ఒకఅనుమానంతట్టింది. పెంట వున్న చోట వూడవాలి గానీ, రోజూ వూడ్చే వీధులే వూడవటం దేనికా అని! మళ్ళీ వెళ్లి నాన్న నడుగుదామా అంటే, కోపపడుతారు...అమ్మనడుగుదామా అంటే, వీపు పగల కొట్టుతోంది. ఏం చేయాలో తోచలేదు!

★

సీరియల్

విచిత్రవ్యక్తి



మూలం:- మార్క్‌ట్వేన్

జరిగినకథ:— ఆస్ట్రియాలోని ఈ జెల్ డార్ఫ్ మా స్వగ్రామం. నా యీడువాళ్లైఅయిన సెప్పీ, నికొలాస్ అనే మరి ఇద్దరు బాలురతో కలిసి ఎప్పుడూ అడవుల్లో, కొండల్లో తిరిగేవాణ్ణి. ఒక రోజున మేము ఒక కొండమీద మా ఆట స్థలంలో కూర్చుని ఉండగా ఒక కొత్తవ్యక్తివచ్చాడు. తన పేరు సైతాను అనీ, తను దేవతననీ చెప్పాడు. మాకు చాలా వింతలు చేసి చూపించాడు. అతడు మాతో ఉన్నంతసేపూ మానవజాతిని నానాబూతులు తిట్టాడు. మానవులు తామేదో గొప్పవారమని అనుకుంటారుగాని నిజానికి వారిలో ఉన్న నైచ్యం ఇంకెక్కడా ఉండదని అన్నాడు. చివరికి మాయమైపోయాడు.

ఇంతలో ఫాదర్ పీటర్ వెళ్లిన దారినే తిరిగి వస్తూ కనిపించాడు. తలవంచుకుని నేలమీద ఏదో వెదుకుతున్నాడు. మాకు బాగా దగ్గిరసా వచ్చిన తరవాత తలఎత్తి మమ్మల్ని చూసి,

"ఇక్కడ ఎంతసేపటినించీ ఉన్నార్రా?" అని అడిగాడు.

"అట్టేసేపు కాలేదు ఫాదర్!"

"అలాగా. ఈ దోవనే వచ్చార్రా?"

"అవును ఫాదర్!"

"అలాగా. నేను ఈ దోవనే వచ్చాను. నా చేతి సంచీ దోవలో ఎక్కడో పారేసుకున్నాను. దాంట్లో డబ్బుకూడా వుంది. కాస్తే నయంకోండి. అయినా నాకున్నదంతా ఆ కాస్తే మీ కెక్కడన్నా నాసంచీ కనిపించిందా?"

"చూడలేదు ఫాదర్. కాని వెదికితే కనిపిస్తుం దేమో."

"అయితే వెదకండి...అరె. ఇదుగో ఇక్కడే వుంది!"

అంతవరకూ అది అక్కడ ఉండటం మేము చూడనేలేదు. సరిగ్గా సైతాను ఇందాక కూర్చున్న చోటనే (సైతాను రావటం, కూర్చోటం నిజమేఅయిన పక్షంలో) చేతిసంచీ వున్నది. ఫాదర్ పీటర్ సంచీ తీసుకున్నాడు. వెంటనే తెల్లబోతూ చూశాడు.

"ఈ సంచీ నాదే. కాని ఇది చాలా బరువుగా వుంది," అంటూ సంచీ తెరిచిచూశాడు. సంచీనిండా బంగారునాణా లున్నాయి. నాణాలు చూడగానే మేము ముగ్గురం ఒక్కసారిగా నోళ్లు తెరిచి "సైతాను పనే!" అనబోయాము. కాని తెరిచిన నోళ్లు తెరిచినట్లే ఉండిపోయాయి; మాట బైటికి రాలేదు. అది సైతాను మహిమయేనని వెంటనే గ్రహించాము.

"నాసంచీలోకి ఇన్ని నాణాలు ఎలా వచ్చాయి? మీ పనేనా యిది?" అన్నాడు ఫాదర్ పీటర్.

ఈ ప్రశ్న విని పకలబడి నవ్వాము. ఇంత తెలివితక్కువ ప్రశ్న వేసినందుకు ఫాదర్ పీటర్‌కు కూడా నవ్వొచ్చింది.

"ఇక్కడికి ఇంకెవరన్నా వచ్చార్రా?" అని ఆయన అడిగాడు.

మేము సమాధానం ఇవ్వటానికి నోళ్లు తెరిచాము. 'ఎవరూ రాలేదు' అంటే అబద్ధమవుతుంది; 'సైతాను' అందామంటే ఆ మాట పైకి రావటం లేదు.

అనువాదం: శ్రీ నండూరి రామమోహనరావు

చివరికి "మనుష్యమాత్రు డెవడూ రాలేదు," అని సమాధానం ఇచ్చాము.

"కాదు. ఎవరో వచ్చారు. నే నిందాక ఈ దోవనే ఇటు వెళ్లాను. అప్పు డిక్కడ ఎవరూ లేరు. ఆతరవాత ఎవరో వచ్చివుండాలి. బహుశా మీకా మనిషి కనిపించ లేదేమో. నిజంగా చెప్పండి—మీ కెవరూ కనిపించ లేదా ఇక్కడ?"

"మా కే మనిషీ కనిపించలేదు ఫాదర్!" అన్నాము.

"చాలా విచిత్రంగా వుంది," అని గొణుక్కుంటూ ఫాదర్ పీటర్ సంచీలో నాణాలు తీసి లెక్కించసాగాడు. మేము ఆయన లెక్కపెట్టినవాటిని తీసి వరసగా పేరుస్తున్నాము.

"అబ్బ! పదకొండు వందల డకట్లు[1] పై చిల్లర. ఇదంతా నాదైతే, ఎంత బావుంటుంది!" అన్నాడు ఫాదర్ పీటర్.

"అది నీదే ఫాదర్!" అన్నాము.

"కాదు. ఇదంతా నాది కాదు. ఇందులో నాలుగు డకట్లు మాత్రమే నావి. మిగతావి......" అంటూనే ఆ వృద్ధుడు బంగారు నాణాలు గుప్పిళ్ళతో తీసి వదిలిపెడుతూ తియ్యటి ఆలోచనల్లోపడ్డాడు. ఆయన్ని చూస్తుంటే జాలివేసింది. కొంతసేపటికి ఆయన అదిరిపడినట్టు వెనక్కి తొలగి, "కాదు. ఇది నాది కాదు. నాచేత నేరం చేయించటానికి ఎవడో విరోధి ఈ వల పన్నాడు...అవును..." అన్నాడు.

నికొలాస్ అందుకుని "కాదు, ఫాదర్. ఇది నీదే. మన వూళ్లో జ్యోతిష్కుడు తప్ప నీకు నిజంగా విరోధు లెవరూ లేరు. మార్గరెట్‌కి కూడా ఎవరూ శత్రువులు లేరు. నిన్ను మోసం చెయ్యాలని పదకొండు వందల డకట్లు ఇక్కడ పడవేసే విరోధి అసలు లేడు," అన్నాడు.

నికొలాస్ అన్న మాట ఫాదర్ పీటర్ కాదన లేకపోయాడు. ముఖం కొంచెం వికసించింది. "నువ్వు చెప్పింది నిజమే నికొలాస్. కాని ఈ డబ్బు నాది కాదు. ఇంత డబ్బు నాదెల్లా అవుతుంది?" అన్నాడు.

అలాగని ఆయన అన్నాడు కాని "ఇది మీదే" నని మాచేత ఇంకా కాస్సేపు బతిమాలించుకోవాలని అలా అంటున్నట్టు తెలుస్తూనే వుంది.



"ఫాదర్! నువ్వు సందేహించకు. ఈ డబ్బు నిజంగా నీదే, కావలిస్తే మేము సాక్ష్యం ఉంటాం," అన్నాను నేను.

మిగతా ఇద్దరూ నా మాట సమర్థించారు.

"అబ్బాయిలూ! మీరు నన్ను మరీ బలవంతం చేస్తున్నారు. ఈ డబ్బులో ఒక్క నూరు నాణాలు నావైతే ఎంత బావుండును? మా ఇల్లు నూరు డకట్లకు తాకట్టు పెట్టాము. రేపు గనక తాకట్టు విడిపించుకోక పోతే ఇక మాకు నిలవటానికి నీడ ఉండదు. మరి నాకున్నదంతా కలిపి నాలుగు డకట్లేనయ్యె!"

"మళ్ళీ అలా అంటావేమి ఫాదర్! ఇందులో ప్రతిఒక్క డకట్ నీదే. తప్పకుండా తీసుకోవాలి. తప్పదు. నువ్వు అన్యాయంగా సంపాదించింది కాదని

1. డకట్:—పూర్వం యూరపియన్ దేశాల్లో వాడుకలో ఉండే బంగారు నాణెం.

మేము సాక్ష్యంగా ఉంటాము. కదురా సెప్పీ? ఏమంటావ్ థియొడోర్?" అన్నాడు నికొలాస్.

"ఓ" అని మేమిద్దరం తలకాయ లూపాము. నికొలాస్ డబ్బంతా పోగుచేసి మాసిపోయిన సంచీలో పోశాడు. ఫాదర్ పీటర్ తన ఇంటి తాకట్టు ఇవ్వాళే విడిపించివేస్తాననీ, మిగతా డబ్బు వడ్డీకి వేస్తాననీ, ఆ డబ్బు ఎవరిదో ఆ మనిషి కనిపించినప్పుడు అతని డబ్బు అతనికే ఇచ్చివేస్తాననీ అన్నాడు. మమ్మల్ని ఆ డబ్బు తనకెలా వచ్చిందో ఆ వైనమంతా ఒక కాగితంమీద రాసి సాక్షి సంతకాలు పెట్టమన్నాడు.

4

ఫాదర్ పీటర్ ఒక్కసారిగా ధనవంతుడు కావడం ఊళ్ళో పెద్దసంచలనానికి కారణమైంది. సాలమన్ ఐజాక్స్‌కి డబ్బిచ్చి ఇల్లు విడిపించుకున్నాడు; మిగతాది అతనివద్దనే వడ్డీకి వేశాడు. భాగ్యశాలి కావడంతో ఇప్పటిదాకా దూరదూరంగా ఉంటున్న పాత స్నేహితులు, బంధువులు వచ్చి పలకరించారు; ధనవంతుడైనందుకు అభినందించారు. అక్కడితో ఆగక, మార్గరెట్‌ను విందుకు, నృత్యానికి ఆహ్వానించారు.

ఫాదర్ పీటర్ ఏమీ దాచకుండా ఉన్నదున్నట్టు చెప్పేశాడు. ఏ పరిస్థితుల్లో, ఎప్పుడు, ఎక్కడ డబ్బు దొరికిందో వివరంగా, నమ్మకంగా చెప్పాడు. ఆ డబ్బు అక్కడికి ఎలా వచ్చిందో తనకి తెలియదనీ, అదంతా దేవుడి చలవేననీ అన్నాడు.

ఒకళ్లిద్దరు పెదవులు విరిచారు. "దేవుడి చలవ కాదు, సైతాన్ చలవలాగా కనిపిస్తోం" దని చాటుగా అనుకున్నారు. కొందరు మా ముగ్గుర్ని అవతలకు తీసుకుపోయి "నిజం" చెప్పమని ఒత్తిడి చేశారు. ఇంకెవ్వరికీ చెప్పమనీ, తమాషాగా ఉందిగనక అసలు విషయం ఏమిటో తెలుసుకోవాలని అడుగుతున్నామనీ అన్నారు. ఒట్లేసుకున్నారు; వారిలో కొందరు లంచం ఇస్తామనికూడా అన్నారు. ఏదన్నా కల్పించి చెబితే, డబ్బయినా వస్తుందని ఆశపడ్డాం. కాని సమయానికేమీ తోచలేదు. అందుచేత లంచం కొట్టే అవకాశం జారిపోయింది.

డబ్బును గురించిన రహస్యం మా ముగ్గురికీ తప్ప ఎవరికీ తెలియదు. ఈ రహస్యం దాచటంలో మేము అట్టే కష్టపడలేదు. కాని ఆ అసలు రహస్యం, ఇంతకంటే పెద్దది, గొప్పది, అద్భుతమైనది అయిన, అసలు రహస్యంమటుకు మమ్మల్ని నిలువునా దహించసాగింది. చెబుదామనుకున్నప్పటికీ ఆ రహస్యం బైటికి రావటంలేదు. చెప్పటానికి వీల్లేకుండా వాగ్బంధం చేస్తానన్నాడు సైతాను. అతడన్నట్టే ఆ రహస్యం చెబుదామనుకున్నప్పుడల్లా నోళ్లు కట్టుబడిపోతున్నాయి. మేము ప్రతిదినమూ మా ఆటస్థలానికి పోయి ఒంటరిగా సైతాన్నిగూర్చి మాట్లాడుకునేవాళ్ళం. అసలు మాకు సైతాను ప్రసక్తి తప్ప మిగతా ప్రాపంచిక విషయాలన్నీ తుచ్ఛమైనవిగా తోచసాగాయి. సైతాన్ని గూర్చి, అతడు చేసిన పనులను గూర్చి ఎంతసేపు మాట్లాడుకున్నా విసుగు పుట్టేది కాదు. రోజురోజుకీ, రాత్రిరాత్రికీ ఎదురుచూసేవాళ్లం సైతాను వస్తాడేమోనని. ఆటలు, పాటలు అన్నీ మానేసి దుర్భరమైన నిరీక్షలో దిగులుగా కాలం వెళ్లబుచ్చేవాళ్లం. సైతాను చేసిన విచిత్రాలు, అతడు తిరిగిన లోకాలు, అతడు చూపిన ప్రాచీన యుగాల దృశ్యాలు ఇవన్నీ తలుచుకుంటే మా తోడిబాలుర ఆటలు, వినోదాలు క్షుద్రాతిక్షుద్రాలుగా కనిపించాయి.

మొదటిరోజున ఒకవిషయంమాత్రం మమ్మల్ని విపరీతంగా బాధించింది. ఆరోజల్లా ఫాదర్ పీటర్ ఇంటికి తడవతడవకూ వెళ్ళి వాకబుచేసి వచ్చాము. మా భయం మరేమీ లేదు—మాయ వస్తువులు మంత్రం ఉన్నంతవరకే ఉంటాయి; మంత్రం విచ్చిపోగానే వస్తువులుకూడా మాయమైపోతాయి. అలాగే ఫాదర్ పీటర్‌వద్ద ఉన్న బంగారు నాణాలు కూడా మట్టిగానో, బూడిదగానో మారిపోతాయేమో, లేక మాయమైపోతాయోనని ఎంతో భయపడ్డాము. కాని అలాటిదేమీ జరగలేదు. అది నిజమైన బంగారమేనని అప్పుడు మాకు ధైర్యం కలిగి, నిశ్చింతగా నిద్రపోయాము.

ఫాదర్ పీటర్‌ను ఒకవిషయం అడగాలని తహ

తహపడ్డాము. రెండోరోజు సాయంత్రం ఆయనదగ్గిరికి వెళ్లి కాసేపు ఆయన పనుల్లో సాయం చేశాము. జంకుతూ జంకుతూ చివరికి ధైర్యంచేసి నేనే అడిగాను: "ఫాదర్! ధర్మాధర్మ విచక్షణజ్ఞానం అంటే ఏమిటి?"

ఫాదర్ పీటర్ నా ప్రశ్న విని ఆశ్చర్యపడ్డాడు. కళ్ళజోడు ముక్కు చివరికి లాగి నాకేసి చూస్తూ,

"ఇది ధర్మం, ఇది అధర్మం అని తెలుసుకోగల శక్తిని ధర్మాధర్మవిచక్షణం అంటారు" అన్నాడు.

ఆయన సమాధానం నన్నంతగా తృప్తి పరచలేదు. సందేహంగా ఆయనకేసి చూశాను. ఇంకా ఏమడుగుతానో అన్నట్టు ఆయన కూడా నాకేసే చూశాడు. చివరికి గొంతు పెకల్చుకొని అడిగాను: "ఆ విచక్షణజ్ఞానం ఉండటం అవసరమా?"

"అవసరమా? నీకేమన్నా మతిపోయిందా? ఆ జ్ఞానం లేకపోతే మానవుడు పశువుతో సమానం. పశువులు ఆ జ్ఞానం లేకపోవటంవల్లనే శాశ్వతమరణం పొందుతాయి. మానవులకా జ్ఞానం ఉన్నందువల్లనే శాశ్వత జీవితానికి వారసులవుతారు."

ఫాదర్ పీటర్ ఇలా చెప్పిన తరవాత ఇంకే మడగాలో జ్ఞాపకం రాలేదు. ఒక్కొక్కసారి ఏదన్నా తిన్నప్పుడు కడుపు నిండినట్టు ఉంటుంది గాని తృప్తి కలగదు. అలాగే ఫాదర్ పీటర్ సమాధానం విన్నాము గాని మా సందేహం తీర లేదు.

ఫాదర్ పీటర్ దగ్గిర్నుంచి తప్పుకుని ఇంట్లోకి వెళ్లాం. మార్గరెట్ కనిపించింది. ఆమె మేరీ లూగర్ అనే అమ్మాయికి పియానో నేర్పుతోంది. ఫాదర్ పీటర్‌కు అదృష్టం పట్టిన తరవాత మొట్టమొదటగా మార్గరెట్ దగ్గిరికి వచ్చింది ఆ అమ్మాయే. ఆ పిల్ల తండ్రి ఊళ్లో మంచిపలుకుబడిగల ఆసామీ. ఆమెను చూసి మిగతా పిల్లలు కూడా క్రమంగా మార్గరెట్ దగ్గిరికి వస్తారని మాలో మేము అనుకున్నాము.

మార్గరెట్ మమ్మల్ని చూడగానే గబగబ వచ్చి తన్నూ, తన పినతండ్రినీ రక్షించినందుకు కృతజ్ఞత తెలిపింది. ఆమె అలా కృతజ్ఞత తెలపటం అది మూడోసారి. రక్షించింది మేము కాదని ఎన్నిసార్లు చెప్పినా ఆమె వినిపించుకోలేదు.

మేము ఇంట్లోంచి తోటలోకి వచ్చాము. తోట కంచెమీద విల్హెల్మ్ మీడ్లింగ్ కూర్చుని ఉన్నాడు. ఫాదర్ పీటర్ కష్టదినాల్లో ఉన్నప్పుడు ఊళ్ళో అందరూ ఆయన్ని, మార్గరెట్‌నీ వెలివేసినట్టు చూశారు గాని విల్హెల్మ్ మీడ్లింగ్ మాత్రం ఆ కుటుంబాన్ని విడవలేదు. మార్గరెట్‌పై అతనికి గాఢమైన ప్రేమ ఉందనటానికి అదే నిదర్శనం. ప్రతిసాయంత్రం అతడు తోటకంచెమీద కూర్చుని మార్గరెట్ కోసం ఎదురు చూసేవాడు. మార్గరెట్ ఇంటిపనులు త్వరత్వరగా ముగించుకుని వచ్చేది. ఇద్దరూ కలిసి ఊరిబైటికి షికారుగా చేయీచేయీ కలిపి వెళ్ళేవారు. మీడ్లింగ్ కొత్తగా లాయరువృత్తి ప్రారంభించాడు. నెమ్మది నెమ్మదిగా పేరులోకి వస్తున్నాడు. అంతపెద్ద తెలివి తేటలు గల మనిషి అనటానికి వీల్లేదుగాని సుందరమైన ఆకారం, దానికితగ్గ మంచిహృదయం గలవాడవటం చేత, అతనిపని బాగానే ఉంది.

మమ్మల్ని చూసి 'మార్గరెట్ పాఠం ఎంత వరకూ వచ్చిం'దని అడిగాడు. 'అయిపోవచ్చిం' దని సమాధానము ఇచ్చాము, మాకు తెలియకపోయినప్పటికీ. మాకు తెలుసు ఆ జవాబుతో మీడ్లింగ్ సంతోషపడతాడని. మా మాట వినగానే అతని ముఖం చేటంత అయింది.

5

నాలుగో రోజున సాధారణంగా ఇల్లు కదలని జ్యోతిష్కుడు ఊళ్ళోకి వచ్చాడు. ఎవరో అతని చెవిలో ఊదివుంటారు ఫాదర్ పీటర్‌కు ధనం దొరికినట్టు. ముందు మమ్మల్ని వెదికి పట్టుకున్నాడు. చాటుకు పిలిచి అంతా భోగట్టా చేశాడు. మేము చెప్పగలిగినదంతా చెప్పాము. అతనంటే మాకు చచ్చే భయం. అందుచేత వీలైనంతవరకూ అంతా వివరంగా చెప్పాము. జ్యోతిష్కుడు కాసేపు కళ్లు మూసుకుని ఆలోచన చేశాడు. చివరికి కళ్లు తెరిచి అడిగాడు:

"ఎన్ని డకట్లు ఉన్నాయి ఆ సంచిలో?"

"పదకొండువందల ఏడు డకట్లు ఉన్నాయండి."

జ్యోతిష్కుడు తనలో తను గొణుక్కుంటున్నట్టు అన్నాడు: "చిత్రంగా ఉందే! అవును, చాలా చిత్రంగా వుంది. ఎలా జరిగి ఉంటుంది?"

తరవాత మళ్ళీ మొదట్నుంచీ చెప్పమన్నాడు. జరిగినదంతా మళ్ళీ ఏకరువు పెట్టాము. అంతా విని "కాస్తాకూస్తా కాదు. పదకొండువందల ఆరు డకట్లు!" అన్నాడు.

"ఆరు కాదు, ఏడు" అన్నాడు సెప్పీ.

"ఏడా? ఆరు కాదూ? ఇందాక ఆరే అన్నావుగా?"

'ఇందాక ఆరు అనలేదు, ఏడే అన్నాము' అంటే జ్యోతిష్కుడు 'అయితే నేను అబద్ధమాడ నంటారా?' అని విరుచుకుపడతాడు. అతనితో జగడం పెట్టుకోవటం క్షేమం కాదు. అందుకని నికోలాస్ వినయంగా,

"కాదు సార్! ఇందాక ఆరు అనబోయి ఏడు అన్నాము. మాదే పొరబాటు. నిజానికి పదకొండు వందల ఏడు డకట్లు దొరికాయి," అని అన్నాడు.

"ఫరవాలేదులే అబ్బాయ్! ఒకటి ఎక్కువైనా తక్కువైనా ఇబ్బంది లేదులే. పైగా ఇన్నిరోజులైన తరవాత మీకు మాత్రం జ్ఞాపకం ఉంటుందా సరిగా ఎన్ని డకట్లు దొరికాయో?"

"కాదు సార్! మాకు బాగా జ్ఞాపకం ఉంది. జ్ఞాపకం ఉండటానికి కారణంకూడా వుంది," అన్నాడు సెప్పీ.

"ఏమి టది?"

"మొదట ఫాదర్ పీటర్, తరవాత థియొడోర్, తరవాత నికోలాస్ వరసగా మూడు సార్లు లెక్కపెట్టారు. వాళ్లు లెక్కపెట్టటానికి ముందే నేను తమాషా చేద్దామని ఒక డకట్ తీసి దాచాను. పదకొండు వందల ఆరు డకట్లు లెక్కకు వచ్చాయి. అప్పుడు నేను వాళ్లు చూడకుండా దాచిన డకట్ మళ్లీ కలిపాను. 'మీరు తప్పు లెక్కపెట్టారు. మళ్లీ ఈసారి లెక్కపెట్టండి,' అన్నాను. మళ్లీ లెక్కపెట్టేటప్పటికి పదకొండువందలఏడు డకట్లు లెక్క వచ్చింది. అందుచేత మాకు డబ్బు ఎంత దొరికిందో స్పష్టంగా జ్ఞాపకం వుంది."


"నిజమేనా?" అని జ్యోతిష్కుడు మమ్మల్ని అడిగాడు. అవునని మేము తలకాయ లూగించాము.

"ఇప్పుడు తెలిసిపోయింది దొంగ ఎవరో? అబ్బాయిలూ, అది దొంగసొమ్ము. దొంగ కూడా దొరికాడు," అని జ్యోతిష్కుడు వెళ్లిపోయాడు. దొంగసొమ్ము అనటంలో అతని ఉద్దేశ్య మేమిటో అర్థంకాక కొంతసేపు తికమకపడ్డాము. ఒక గంట గడిచిందో లేదో అంతా అర్థమైంది. జ్యోతిష్కుని డబ్బు ఫాదర్ పీటర్ తస్కరించాడనీ, పోలీసులు ఫాదర్‌ను అరెస్టుచేశారని ఊరుఊరంతా గుప్పుమంది. ఎవరికి తోచినట్టు వారు చెప్పుకోసాగారు. ఫాదర్ పీటర్ అలాంటి మనిషి కాదని చాలమంది అన్నారు. కొందరుమాత్రం, తిండికిలేని పరిస్థితిలో ఎంత మంచి మనిషైనా నైచ్యానికి పాల్పడక మానడని అన్నారు. ఒక విషయం మాత్రం అందరూ ఏకగ్రీవంగా అంగీకరించారు: ఫాదర్ పీటర్‌కు హఠాత్తుగా ధనం దొరికినవైనం నమ్మటానికి వీల్లేకుండా ఉందని అంతా అన్నారు. జ్యోతిష్కుడికి దొరికితే దొరకచ్చు గాని ఫాదర్ పీటర్‌కు అంత డబ్బు ఆ విధంగా దొరకటం అసంభవమని అన్నారు.

ఫాదర్ పీటర్‌కు దొంగతనం అంటగట్టబడటంతో మా ముగ్గురికీ కూడా తలవంపులైంది. గ్రామస్థులు మమ్మల్ని బహిరంగంగా అవమానించ సాగారు. ఫాదర్ పీటర్‌కు ఆ డబ్బు దోవలో దొరికిందనటానికి మేము ముగ్గురం తప్ప ఇంకెవరూ సాక్షులు లేరు. అందుచేత మేము కూడా ఆయనతో లాలూచీ అయి, బహుశా లంచం పుచ్చుకుని అబద్ధమాడినట్లు అంతా అనుమానించారు. ఇళ్లదగ్గిర మా తండ్రులు కూడా మమ్మల్ని అనుమానించారు. తమకు మాయనిమచ్చ తెచ్చిపెడుతున్నామని, ఇప్పటికైనా నిజం ఒప్పుకుని వంశగౌరవం తిరిగి నిలబెట్టవలసిందనీ మమ్మల్ని వేధించుకుతిన్నారు. మేము చెప్పింది నిజమేనని ప్రమాణాలు చేసినకొద్దీ వారి కోపం ఎక్కువకాసాగింది. చివరికి మాకు విసుగు పుట్టింది. జరిగినదంతా చెప్పేద్దామనుకున్నాము. సైతాను రావటం, మాయలు మంత్రాలు చెయ్యటంతో సహా యావత్తూ బయట పెట్టేద్దా మనుకున్నాం. కాని ఎంత ప్రయత్నించినా ఆ రహస్యం బైటికి వస్తేగా. సైతాను పేరెత్తినప్పుడల్లా మా నోళ్లు తెరిచినవి తెరిచినట్టే ఉండిపోవటం పరిపాటి అయింది. సైతాను వస్తే బాగుండుననీ, ఈ విషమపరిస్థితినుండి బయట పడవెయ్యటానికి అతడొక్కడే సమర్థుడనీ తహతహలాడిపోయాము.

(ఇంకా వుంది)

జంతుకోటిలో మానవలక్షణాలు



ఏదైనా ఒక నదిమీద ఆనకట్ట కట్టవలసి వచ్చినప్పుడల్లా మన యింజనీర్లు అందుకు అనువైన స్థలాన్ని కనిపెట్టటానికి నానా యాతన పడతారు. అంత యాతన పడి కూడా వాళ్లు నిర్ణయించిన స్థలం, ఆనకట్ట నిర్మాణానికి అనుకూలంగా లేదని ఆ తరువాత బయటపడుతూ వుండటం కూడా కద్దు. అందుకని అమెరికాలో యింజనీర్లు ఆనకట్ట కట్టవలసి వచ్చినప్పుడు మిగిలిన పరిశీలనల మాట అటుంచి, ఆ నదిపై ఎక్కడైనా 'బీవర్' అనే జంతువు అంతకు ముందే 'డామ్' కట్టి వున్నదేమో చూస్తారు. 'బీవర్' కట్టిన డామ్ గనుక ఎక్కడైనా అదృష్ట వశాన కనుపించిందీ అంటే, యిక డామ్ కట్టవలసిన స్థలాన్ని గురించిన అన్వేషణ వారు నిస్సంకోచంగా విరమించగలరు.

బీవర్లు నదీ ప్రవాహాలకు అడ్డంగా డామ్‌లు కట్టుతాయి. ఆ డామ్‌లలో తమయిళ్లు ఏర్పరచుకొంటాయి. పిత్రార్జితపు ఆస్తిని



'బీవర్'

మనం ఎలా తరతరాలు పెంచుకొంటూ పోవాలని ఆశిస్తూ వుంటామో, యీ బీవర్ జంతువులు కూడా తమ పూర్వులు కట్టిన తొల్లిటి డామ్‌ను తరతరానికి పెంచుకొంటూ పోతూ వుంటాయి.

డాములు కట్టటానికి యీ జంతువులు నదీ తీరాలలో పెరిగే చెట్లను కొట్టుకొస్తాయి. బాగా గజం వ్యాసం గల చెట్టు బోదెలనైనా యివి సునాయాసంగా కొసెయ్యగలవు. ఒక్క రాత్రిలోగా యివి ఆరు అంగుళాల వ్యాసం గల చెట్టును కొట్టి, ఒక్కొక్క ముక్క ఆరేసి అడుగుల పొడుగు వుండేటట్లుగా ఆ చెట్టునంతా కోసి, ఆ కొయ్యముక్కల నన్నిటినీ నీటిలోకి తెచ్చి పడవేసుకోగలవు.

ఎక్కడైనా ఒకచోట డామ్ నిర్మాణం ఆరంభించేముందు, బీవర్లు ఎక్కడెక్కడినుంచో లేత మొక్కలు కోసి తీసుకువచ్చి వాటి ఆకులు, కొమ్మలు ప్రవాహం పోతున్న వైపుకు వుండేలా నీటిలో పడేసి, ఆ ఆకులు కొమ్మల మీద రాతిబండలు, బురద పేర్చి పెట్టుకొంటాయి. ఈపని అంతా పూర్తి అయ్యేసరికి నదీప్రవాహానికి అడ్డంగా గోడ కట్టినట్లు, యీ చెట్లబోదెలు; కొమ్మల వీటితో దడి ఏర్పడిపోతుంది. వందల కొద్దీ టన్నుల బరువుగల రాళ్లను, మట్టిని తీసుకొచ్చి యీ 'డామ్' కట్టుతున్న కారణంచేత, డామ్‌కు అవతలివైపు నీటిమట్టం కొన్ని అడుగుల మేరకు పెరుగుతుంది. ఎప్పుడైతే యీ విధంగా డామ్ నిర్మాణం పూర్తి అయి, నదీప్రవాహవేగం తగ్గిపోయిందనిపిస్తుందో, అప్పుడు యీ బీవర్లు డామ్ వున్న చోటికి కొంచెం ఎగువకు పోయి, అక్కడ ఆ గట్టుకీ యీ గట్టుకీ నట్టనడాన మట్టి కుప్పగా పేర్చి పేర్చి, దాని

★ జంతుకోటిలో మానవ లక్షణాలు ★

సంతతినీ ఒక చిన్న ద్వీపంలా తయారుచేసుకొంటాయి. ఆ ద్వీపం మీద, గిన్నె బోర్లించినట్లు వుండే విధంగా బంకమట్టితోనూ, కర్ర పుల్లలతోనూ ఒక 'యింటి'ని కట్టుకొంటాయి. ఆ యింటి నడి కొప్పుమీద మాత్రం కాస్తంత గాలి, వెలుతురు లోపలికి రావటానికి వీలుగా ఒక చిన్న కంత చేసుకొంటాయి. ఇల్లాటి యింట్లో బీవర్ పుత్ర పౌత్రాభివృద్ధిగా కలకాలం కాపురం చేస్తూవుంటుంది. ఇలాటి యింట్లో వుండగా దానికి శత్రుభయం అన్నది వుండదు.

(మామూలుగా మన జానపద కథలలో మాంత్రికులు, రాక్షసులు వుండే భూతగృహాలు జ్ఞాపకం వస్తున్నాయి – యీ బీవర్ నివాసాన్ని వర్ణిస్తుంటే.)

బీవర్లలో యింకొక గుణం కూడా వున్నది. ఇల్లు కట్టుకొనే కార్యక్రమం ముగిసినా కూడా యివి చెట్లు పడగొట్టటం మానవు. వాటికి ఎంతసేపూ ఒళ్లు అలిసిపోయేలా పనిచేయటం అలవాటు.

ఇంత పకడ్బందుగా అది యిల్లు కట్టుకోగలిగినప్పటికీ, ఆ శక్తి దానికి స్వతస్సిద్ధంగా వచ్చిందిగానే ఒప్పుకో వలసి వున్నది కానీ, దానికి నిజంగా తెలివి తేటలు వున్నాయనటానికి వీలులేదు.

ఒకే జాతికి చెంది వున్నప్పటికీ ఒకదానికంటే మరొకటి ఎక్కువ తెలివి తేటలు చూపించగల శక్తి నక్కలకు, తోడేళ్లకు మాత్రమే వున్నది. నక్కలకు గద్దలను పట్టుకోవటం అనేది చాలా యిష్టమైన వేట. అందుకని యివి సామాన్యంగా కొన్ని చేపలను పట్టుకొచ్చి వాటిని బయలులో పడేసి, తాము ఏ పొద చాటునో దాక్కొని వుంటాయి. ఆకాశంలో ఎగురుతూ ఎగురుతూ వుండే గద్ద ఏదైనా, యీ చేపనుచూసి ఆశపడి క్రిందికి వాలగానే, పొదల చాటున పొంచివున్న నక్క బావ అమాంతం దానిమీద పడి, గొంతు పిసికి పట్టుకుపోతుంటాయి. మనుష్యులు ఎవరైనా నక్కలను వేటాడుతున్నప్పుడు కూడా, యీ నక్కలు, మనుష్యులకు అందకుండా పరిగెత్తి పరిగెత్తి, చివరికి ఏ వాగులోకో దూకి, ఎంత సేపటికైనా సరే, నీటిమీదికి తేలకుండా దాక్కొంటూ, మభ్యపెట్టగలవు.

తోడేళ్లు తరుచు ఒంటరిగా గాక ఒక మందగా చేరి, పదీ కలసి ఏ జింకనో దుప్పినో వేటాడి పట్టుకొంటూ వుంటాయి. తోడేళ్ల మందలో కొన్ని ముందుగా చీలిపోయి, ఏ పొదల చాటునో దాక్కుంటాయి. మిగిలిన తోడేళ్లు అడివిఅంతా గాలించి, జింక ఏదైనా కనిపిస్తే దాన్ని అటు తరిమి యిటు తరిమి, చివరికి తమ మంద తాలూకు తోడేళ్లు ఎక్కడైతే దాక్కొని వుంటాయో సరిగ్గా ఆ చోటికి తరుముకుపోయి, అక్కడ అన్నివేపులా కాపు కాస్తాయి. పాపం–ఆజింకకు ఎటువైపుచూసినా తోడేళ్లే, నోరు పగలదీసుకు కనిపిస్తాయి. చివరికి అన్ని కలిసి దాన్ని చంపేస్తాయి.



సముద్రపు కుక్క

జంతువులను వేటాడేవారికి ఏజంతువు అన్నా అలుసుగానే వుంటుంది కానీ 'వుల్ వరీన్' అనే ఒక జంతువుమాత్రం నిజంగా వాళ్ల ప్రాణాలను వేధిస్తుంది. ఏ వేటగాణ్ణి అడిగినా, యీ 'వుల్ వరీన్' తనకు ఒకటో నెంబరు శత్రువు అంటాడు. దీనికి వేటగాళ్లను చికాకు పెట్టటంలో వున్న తెలివి తేటలు అద్భుతం.

ఇది సామాన్యంగా భూమధ్యరేఖకు అతి వుత్తరంగా వుండే ప్రాంతాలలోనే కనిపిస్తుంది. దాని శరీరప్రమాణం మన కుక్క అంతే వుంటుంది. ఆకారం అదీ, కొంత మటుకు ముంగిసలను పోలి వుంటుంది. నిజానికి యిది యింత చిన్న జంతువే అయినా, అడవిలో తిరిగే పెద్ద పెద్ద జీవాలన్నిటికీ యి అంటే హడల్! దీన్ని చూసి ఎలుగుబంటి కూడా తోక ముడుచుకు పారిపో వలసిందే. దీనికి విపరీతమైన బలం; విపరీతమైన పౌరుషం; విపరీతమైన తెలివి తేటలు సహజంగానే వుంటాయి.

'వుల్ వరీన్'ను పట్టుకోవాలనే వేటగాడు కొన్ని నెలలకు సరిపోయే గ్రాసం పట్టుకు అడవి,

పోయి, అక్కడ కాపరముండాలి. ఆహారపదార్థాలు యీ 'వుల్ వరీన్' కొట్టుకు పోకుండా, వాటిని గురించి ఎంతో శ్రద్ధ తీసుకొంటే గాని, అవి వాడికి దక్కవు. 'వుల్ వరీన్' వేటకుగాను యితగాడు అల్లా ఒకటి రెండుసార్లు తిరిగి వచ్చే లోగా, యిక్కడ అతని మకాములో దాచిపెట్టుకొన్న ఆహార పదార్థాలు కాస్తా, 'వుల్ వరీన్' హరించేస్తుంది. అంతేకాదు - కాస్త వయస్సు మళ్లిన 'వుల్ వరీన్' అయితే, తనను పట్టుకోటం కోసం తిరిగే వేటగాడి వెనకాలే తానూ తిరుగుతూ, ఎక్కడెక్కడైతే అతగాడు తనను పట్టుకోవటానికని తెలివితేటలు వుపయోగించి మాటు పెట్టుతాడో, అక్కడికల్లా గుట్టు చప్పుడు కాకుండాపోయి ఆమాటు పెట్టిన మాంసాన్ని కాస్తా తినేసి మళ్ళీ గుట్టుచప్పుడు కాకుండా జారుకొంటుంది. ఎక్కడైనా పొర పాటున బోను దానికంట పడిందీ అంటే, ఆ బోనును వెంటనే అక్కడే పాతిపెట్టనైనా పాతి పెట్టేతుంది, లేదా విసిరిపుచ్చుకొని ఏట్లో పారేస్తుంది.



'ఉల్ వరీన్'


'వీసెల్' అని మరొక రకం జంతువు వుంది. ఇది 'వుల్ వరీన్' కు జ్ఞాతి. సామాన్యంగా యీ వర్గానికి చెందిన జంతువు లన్నిటికీ దవడ బొమికలు చాలా హుషారుగా పని చేస్తాయి. ఏకోడో, కొక్కిరాయో వాటినోటికి అందిందీ అంటే, కన్ను మూసి తెరిచేలోగా వీటి పైదవడ కింది దవడ గట్టిగా తాళం బిగుసుకుపోయినట్లు బిగుసుకు పోతాయి. ఇవి సామాన్యంగా చిన్న చిన్న పిట్టలను వాటినీ పట్టుకొన్నప్పుడు, పట్టుకోవటంలోనే వాటి మెడలను వాటేసుకొని, అక్కడ వుండే రక్తనాళానికి చిల్లి పెట్టేసి, ఆ వేడివేడి నెత్తురునంతా ఒక్క గుటకలో మింగేస్తాయి. పట్టుపడ్డ ప్రాణి నోరారా అరిచే టంత మాత్రమైనా అవకాశం వాటికి దొరకక ముందే 'హరీ' అని పించేస్తాయి.




'వీసల్'

సముద్రపు కుక్కలని ఒకరకం జంతువు లున్నాయి. వాటిని యింగ్లీషులో 'సీ - ఓటర్స్' అంటారు. వీటికి చిన్న పిల్లలలా కేరింతాలు కొట్టటం మహాసరదా.

(55-వ పేజీ చూడండి)



వినాయక చవితికి పిల్లలకు వినాయకుని బొమ్మయినా కొని యివ్వలేక విచారిస్తున్న
ఆలు మగలు సీత, రంగనాథం—అరుణాఫిల్మ్స వారి గుమాస్తాలో జయమ్మ, నాగయ్య.



జపానీస్ చిత్రం "యూకివారీసూ"లో ఒకదృశ్యం

మద్రాసులో రెండు జపానీస్ చిత్రాలు

ఇటీవల రెండు జపానీస్ చిత్రాలు ఒకేసారి మద్రాసు వచ్చాయి ఒకటి "యూకీవారీసు", రెండోది "రషోమోన్" ఈ రెండుచిత్రాలు బహుశా జపాన్ గత సంవత్సరం తయారుచేసినవాటిలో కల్లా ఉత్తమమైనవై ఉంటాయి ఎందుకంటే "యూకీవారీసూ" ఈ సంవత్సరారంభంలో మనదేశంలో జరిగిన చలన చిత్రోత్సవానికి జపానీస్ సినిమాకళ తరఫున ప్రతినిధిగా పంపబడింది "రషోమోన్" అమెరికాలో ప్రతిఏటా ఇవ్వబడే 'ఉత్తమవిదేశీ చిత్రం' బహుమతి (1951) సంపాదించింది

జపాన్నుండి వచ్చిన ఈ ఉత్తమ చిత్రాలనుబట్టి ఆ దేశంలో సినిమాకళ ఏ స్థాయిలో ఉన్నదీ, కనీసం ఏ స్థాయి నందున్నదీ (ఎందుకంటే అన్ని చిత్రాలూ ఈ స్థాయిలో లేకపోవచ్చు,) గ్రహించవచ్చు ఈ చిత్రాలు చూడటం, చూసి వివరంగా పరిశీలన చెయ్యటం మనకూ, మన సినిమాకళకూ కూడా లాభకరం

యూకివారీసూ


నాలుగేళ్ళ బాలుడు చేతులో ఒక చిన్న పెట్టె పట్టుకుని రైలుపట్టాల పక్కన రోడ్డుమీద ఒంటరిగా నడిచిపోతున్న దృశ్యంతో ఆరంభమవుతుంది ఈ చిత్రం ఆ బాలుడు అలా పోయిపోయి ఒక ఇంటి ఆవరణలో ప్రవేశించి, తలుపు పక్కన ఎత్తుగాఉన్న మీటను అతి కష్టంమీద అందుకుని నొక్కుతాడు బెల్ మోగుతుంది ఒక స్త్రీ వచ్చి తలుపు తెరిచి "ఎవరు నువ్వని అడుగుతుంది బాలుడు మాట్లాడకుండా జేబులోంచి ఉత్తరం తీసి ఇస్తాడు అ ఉత్తరం రాసింది ఆ బాలుడి తల్లి "నీ భర్త, నేనూ యుద్ధంరోజుల్లో అనుకోకుండా విపరీత పరిస్థితుల్లో ఒకరికొకరం తటస్థపడ్డాం అనుకోకుండానే కొద్దిరోజులపాటు మా ఇరువురికీ సంబంధం కలిగింది దాని ఫలితంగా ఈ శిశువు పుట్టాడు నేను ఈ శిశువును పోషించే స్థితిలో లేను వీణ్ని పెంచి పెద్దచేసే భారం నీది," అని రాసివుంటుంది ఆ ఉత్తరం చదివి ఆ స్త్రీ తనభర్త ఇదివరకే మరొక స్త్రీతో సంబంధ మేర్పరచుకోటం, ఆ సంగతి రహస్యంగా దాచటం తెలిసి చాలా బాధపడుతుంది కాని ఎదురుగా వున్న నాలుగేళ్ళ శిశువును పొమ్మనలేక ఇంట్లోకి రమ్మంటుంది అప్పుడు భర్త ఏదో పనిమీద మరొక ఊరువెళ్లి వుంటాడు నాలుగురోజులదాకా రాడు ఈ నాలుగు

★ రెండు జపానీస్ చిత్రాలు ★

రోజుల్లోను బాలుడిపై ఆ స్త్రీకి మొదట కలిగిన వైమనస్యం ఎలా తొలగిపోతుందో, బాలుడు తన బాల్యచేష్టలద్వారా ఆమె హృదయం ఎలా చూరగొంటాడో వివరంగా చూపబడుతుంది. కాని అప్పటికీ ఆమె భర్తచేసిన తప్పు క్షమించలేక పోతుంది. ఆ తరవాత భర్త ఇంటికి వస్తాడు. భర్తకు ఆ బాలుణ్ణి చూపించి 'ఈ యింట్లో ఇక నేనుండను' అని ఆమె వెళ్లిపోబోతుంది. భర్త వద్దని ప్రాధేయపడతాడు. ఇదంతా చూసి 'వీరిద్దరి కలతలకూ నేనే గదా కారణం' అనుకుని, బాలుడు ఎవరితో చెప్పకుండా తన పెట్టె తీసుకుని ఇంట్లోంచి వెళ్లిపోతాడు. భార్యాభర్తలు వెనక్కి తిరిగిచూసి ఇంట్లో బాలుడు కనిపించక గాబరాగా వెదుక్కుంటూ పరుగెత్తుతారు. బాలుడు రైలు పట్టాల మధ్యగా, ఒంటరిగా, ఎక్కడికి పోతోందీ చూసుకోకుండా, నడుస్తూంటాడు. వెనక రైలు వేగంగా వచ్చేస్తూంటుంది. భార్యాభర్తలు సరిగా సమయానికి బాలుణ్ణి రక్షిస్తారు. అంతా ఇంటికివస్తారు. బాలుడి మూలంగా భార్యాభర్తలకు అన్యోన్యత తిరిగి ఏర్పడుతుంది.

ఈ చిన్నకథను, ఏ వంకరటింకరలు లేకుండా, సూటిగా చిత్రించటంలో డైరెక్టరు ప్రజ్ఞ ఎంతైనా కనిపిస్తుంది. కథతో ప్రత్యక్ష సంబంధంలేని ఒక్క చిన్న సంఘటనగాని, సన్నివేశంగాని లేదు. ఇంటర్వల్ వరకూ ఒక స్త్రీ, ఆమె వద్దకు వచ్చిన బాలుడు తప్ప ఇంకొక పాత్రయే లేదు. మొత్తం చిత్రంలో వచ్చేవి మరి రెండే పాత్రలు; బాలుడి అసలు తల్లి, భర్త. ఈ నాలుగు పాత్రలతోనే చిత్రమంతా నడుస్తుంది. సంభాషణలనదగినవి వేళ్ళమీద లెక్కపెట్టవచ్చు. మన చిత్రాల్లోలాగ సంభాషణలతో కథ చెప్పించబడదు. కెమేరాయే కథ చెబుతుంది. ఈ కెమేరా పనివాడి తనాన్ని మాటల్లో వర్ణించటం కష్టం; చూసి తీరాల్సిందే. ఎక్కడో కొన్నిచోట్ల తప్ప కెమేరా కదలకుండా ఒక్క క్షణం ఉండదు. ఒకే షాట్లో 'పానింగ్, టిల్టింగ్, రిసీడింగ్ మొదలైన పద్ధతు లుపయోగించబడ్డాయి. క్లోజప్పులు విరివిగా వాడబడ్డాయి. ఈ పద్ధతులు మన చిత్రాల్లో వాడరని కాదు; కాని మన చిత్రాల్లో కెమేరా కదలికలు సాధించే ప్రయోజనం శూన్యం. ఈ చిత్రంలో ప్రతి కెమేరా కదలిక భావోద్వేగాన్ని ఇనుమడింపజెయ్యటానికో, పాత్ర మనోభావాన్ని వ్యక్తం జెయ్యటానికో ఉపయోగపడుతుంది. క్లోజప్పులతో ఎంత భావం వ్యక్తీకరించవచ్చునో చూడాలంటే ఈ చిత్రం చూడాలి. ఒకొక్కచోట కెమేరా ప్రేక్షకులకు ప్రతినిధిగా పాత్రల మానసిక అనుభూతుల్లో పాల్గొంటుంది.

ఉదాహరణకి, భార్య కిటికీ గాజు తలు



గతనెల 28న "యాంకీవారసు" చిత్రాన్ని మద్రాసు పాఠశాలల్లోని బాల బాలికలకు (వెయ్యిమందికి) జెమినీవారు ఉచితంగా చూపించారు. ఓడియన్ హాలులో కూర్చుని చిత్రాన్ని అత్యాసక్తితో చూస్తున్నారు పిల్లలు.



అసెల్ పిక్చర్సువారి "పిషం"లో కులదీప్ కౌర్

పుసు ముఖం అనించి, భర్తచేసినతప్పి తెలుసుకుని ఏడుస్తూ వుంటుంది. బయట వర్షం కురుస్తూ వుంటుంది ఆమె కళ్ళలో ఏవిధంగా నీళ్ళునిండి తెరలు కప్పినట్టు అయిపోతుందో అదేవిధంగా గాజుతలుపు మీద వర్షబిందువులు పడి ఆ దృశ్యం మసక మసకలై, మన దృష్టికికూడా తెరలు కప్పిన ట్లవుతుంది. ఈమాదిరి ఉదాహరణలు చిత్రంనిండా చూపించవచ్చు

కెమేరా గొప్పదనం అలా వుంచితే కథావస్తువు కూడా చాల ఉదాత్తమైనది ఈ చిత్రంలో సమస్య, దాని పరిష్కార మార్గం విశ్వజనీనమైనవి జపాన్‌లోనే కాదు, ఏ దేశంలోనైనా, ఏ పరిస్థితుల కైనా, ఏ కుటుంబానికైనా అన్వయించే సమస్య అది ఈ విశ్వ జనీనత సాధించటం కోసమే కావచ్చు, దర్శకుడు జపాన్ వాతావరణాన్ని ఎక్కువగా చూపడు ఈ చిత్రం చూసిన తరవాత మానవ స్వభా వాన్ని గూర్చి మనకు తెలిసినంతగా జపాన్‌దేశం గూర్చి తెలియదు.

"రషోమోన్"

రెండో చిత్రం "రషోమోన్" ఇది పై చిత్రానికి అన్నివిధాలా వ్యతిరేక పంథాలో నడుస్తుంది "యూకీ వారీసూ"లో మానవుని సహజ సౌజన్యం మీద నమ్మకం అడుగడుగునా వ్యక్తమవు తుంది "రషోమోన్"లో మానవునిలోని దుర్జనత్వం భయంకరంగా చూపించ బడు తుంది ఈ చిత్రం మామూలుగా హాలీవుడ్ నుంచి వచ్చే వెస్టర్న్ చిత్రాలకోవకు చెందకుండా రక్షించే అంశం ఒకటున్నది అది కథ చెప్పటంలో ఉపయోగించబడిన కొత్తపద్ధతి నలుగురు వ్యక్తులు ఒకే సంఘ టనను నాలుగు విధాలుగా వర్ణిస్తారు హత్య జరుగుతుంది హంతకుడొక విధంగా, హత్య చెయ్యబడినవాని ఆత్మ ఒక విధంగా, హత్యచెయ్యబడినవాని భార్య మరొకవిధంగా, హత్య కళ్లారా చూసిన కట్టెలు కొట్టుకునేవాడొక విధంగా చెబుతారు. ప్రతి వారి కథనమూ నమ్మ దగినదిగానే కనిపిస్తుంది కాని చివరం కళ్లారా చూసిన వాని కథనమే నిజమని పిస్తుంది. ఈ వేర్వేరు కథనాలద్వారా ఆయావ్యక్తుల నీచస్వభావం వ్యక్తం చెయ్యబడుతుంది

ఈ చిత్రంలో హత్యా సంఘటన నాలుగుసార్లు నాలుగురకాలుగా చూపించ బడుతుంది ఒకే సంఘటనను మళ్ళీ మళ్ళీ చూపించినప్పటికీ ప్రతిసారీ కొత్తగాను, ఉద్వేగకరంగానూ ఉంటుంది ఇది ఒక ప్రత్యేకత ఫొటోగ్రఫీ గొప్పతనం ఈ చిత్రంలో కూడా కనిపిస్తుంది


రెండు జపానీస్ చిత్రాల్లోను కొన్ని సామాన్యలక్షణాలు కనిపిస్తాయి బహుశా ఈ చిత్రాలు చాల చవకలో తీయబడినవై ఉండాలి వీలైనంతతక్కువమంది నటులతో చిత్రం తయారుచెయ్యటం, ఒక సెట్టుకంటె ఎక్కువ అవసరంలేని కథ తీసుకోవడం చూస్తే బహుశా ధనవ్యయం తగ్గించాలనే ఉద్దేశ్యంతోనే అలా చేసినట్టు తోస్తుంది రెంటిలోనూ అసాధారణమైన ఫొటోగ్రఫీ ప్రతిభ చూపబడింది ఈ ప్రతిభ సన్ని వేశాలకు బలం చేకూర్చటానికే ఉపయో గించబడింది

రెండు చిత్రాల్లోను ప్రారంభదృశ్యాలు అత్యంత ప్రధానమైనవి "యూకీవారీ సూ"లో మొదటి దృశ్యాల్లో నాలుగేళ్ళ బాలు డొక్కడే రోడ్డుపై నడిచిపోవటం కొంతసేపటివరకూ కనిపిస్తుంది కథలో ప్రధానపాత్ర బాలుడేనని ఈ షాట్స్ ద్వారా ప్రేక్షకులకు సులభంగా అర్థమై పోతుంది అంతేకాక ఆ బాలుడు ఒంట రిగా అలా పోవటంలో, ఆ నడకలో అతని స్వభావం కూడా వ్యక్తమవుతుంది. "రషోమోన్" చిత్రం దుర్గమారణ్య దృశ్యా లతో ప్రారంభమవుతుంది అరణ్యంలో భుజాన గొడ్డలి వేసుకుని కట్టెలవాడు ఒంట రిగా పోతూవుంటాడు. ఈషాట్స్ ఫొటో గ్రఫీ దృష్ట్యానూ కంపోజిషన్ దృష్ట్యానూ అత్యుత్తమమైనవి కథ భయానకరసప్రధాన మైనదని ఈ షాట్స్ సూచిస్తాయి కట్టెల వాడు నడుస్తుంటే తుణతుణానికీ ఏదోమహా ప్రమాదం రాబోతున్నట్లుఅతనికేకాకుండా ప్రేక్షకులకుకూడా అనిపించి ఊపిరిబిగపట్టి చూస్తారు నాలుగైదు మొదటి షాట్స్ తోనే ప్రేక్షకులను అరణ్యమధ్య వాతావ రణంలోకి తీసుకుపోయి స్తంభీభూతులను చేయగలగటం గొప్ప ప్రజ్ఞావిశేషం ★

అంతర్జాతీయ స్థాయి

ఫిల్మ్ ఫెడరేషన్ అధ్యక్షుడు శ్రీ చందూలాల్ షా ఈమధ్య బొంబాయిలో జరిగిన ఒక సభలో మాట్లాడుతూ 1954 నుండీ భారతీయ చిత్రాలు అంతర్జాతీయ స్థాయి అందుకోగలవని వాగ్దానం చేశారట. గడచిన రెండేళ్లలో మన చిత్రాలస్థాయి పడిపోయినందుకు ఆయన నొచ్చుకున్నారట.

ఏ కారణం పురస్కరించుకొని చందూలాల్ షా ఈ ఆశాభావం ప్రకటించారో తెలియదు. కాని ఆయన వెలిబుచ్చిన ఆశాభావం నిజం కావాలంటే, ముఖ్యంగా మన చిత్రాలు అంతర్జాతీయ మార్కెట్‌లోకి ప్రవేశించటానికి అవసరమైన అంతర్జాతీయస్థాయి సంపాదించుకోవాలంటే మన నిర్మాతలు ప్రస్తుతం అనుసరిస్తున్న పద్ధతులు చాలా విసర్జించాల్సి వుంటుంది. 'ప్రొడక్షన్ వాల్యూస్'లో మనం ఇప్పట్లో ఎలాగూ అమెరికన్ చిత్రాలతో పోటీ చెయ్యలేము. ఇందుకవసరమైన డబ్బు మనదగ్గర లేదు. మనది ఇటలీలాంటి పేదదేశం. అందుచేత మన ఆర్థికస్థితికి తగిన చిత్రాలే తయారు చేసుకోవచ్చు. పేదవాడు పెదతనానికి పిసుగుపడి ఉన్న డబ్బంతా దర్జాకోసం ఖర్చుపెట్టినట్లు



భాస్కర్ ప్రొడక్షన్సువారి "బ్రతుకు తెరువు"లో ఒక సన్నివేశం.



శుభోదయావారి "ఆదర్శం"లో నటిస్తున్న సావిత్రి—కేమెరా లక్ష్మీనారాయణ లైటింగ్ అరేంజ్ చేస్తున్నారు.

మనం (ప్రొడక్షన్ వాల్యూస్) "ఆన్" చిత్రంలోగా) కోసం పాకులాడ నక్కరలేదు. అంతర్జాతీయ ఖ్యాతి సంపాదించాలంటే మనకు చేతనైనది కళావిశిష్టత సాధించటమే. ఇదే సాధించటానికి మనవారు కొత్త పద్ధతులు అనుసరించటం అత్యవసరం. ముఖ్యంగా మన సినిమాలను నాటకీయ దృక్పథంతో కాక, సినిమాటిక్ దృక్పథంతో నిర్మించడం నేర్చుకోవాలి. సంభాషణలు బాగా తగ్గించాలి. పాటలు పూర్తిగా తీసివేయాలి. సంభాషణలు భాష తెలిస్తేగాని అర్థంకావు. కాని సినీకెమెరా భాష ప్రపంచంలో ఏ మారుమూలదేశానికైనా అర్థమయ్యే భాష. ఈ భాషను మన చిత్రాల్లో ప్రవేశపెడితే విదేశాల ప్రేక్షకులు సులభంగా ఆకర్షింపబడతారు. [illegible]రవాళ్ళ ముఖ్యంగావచ్చే ఫిర్యాదు మన చిత్రాలు అతిదీర్ఘంగా ఉంటాయని. మనకంటె వెనకబడివున్న క్లిష్టమైన చైనాలో సినిమా చిత్రాలు సగటున 8 వేల అడుగులకు మించవట. ప్రపంచ ప్రేక్షకులకు మనచిత్రాలు ఆదరణీయాలు కావాలంటే వాటిని హ్రస్వీకరించటం చాలా ముఖ్యం.

మన సినిమారంగంలో కనిపించే మరొక లోపమేమిటంటే మనకు సరియైన

సిద్ధాంతకారులు (థియరెటిషియన్సు) లేరు. మన దర్శకులలో, నిర్మాతలలో, టెక్నిషియన్లలో విద్యాధికు లనేకు లున్నారు. వీరు తమ విద్యను, సంస్కృతిని సినిమా కళను విస్తృతం చేయటానికి వినియోగించటంలేదు. 'ప్రాక్టీస్' అనేది ఎంత అవసరమో 'థియరీ' కూడా అంత అవసరమే. ఫ్రాన్సు, ఇంగ్లండు, రష్యా, అమెరికాలలో ఉన్నట్టు మనదేశంలో సినిమా థియరీ (సిద్ధాంతం) బొత్తిగా లేదు. మన సంస్కృతికి, జాతీయతకు అనుగుణమైన థియరీ పెంపొందటంవల్ల మన సినిమా కళకూడా పురోగమించగలదు. సినిమా థియరీని పెంపొందించటానికి విద్యాధికులైన దర్శకులు, టెక్నిషియన్లు పూనుకోవాలి. ఇవన్నీ జరిగితేనే కాని మన చిత్రాలు అంతర్జాతీయ స్థాయి అందుకోలేవు. ★

సినిమా వార్తలు

అవరిండియా ఫిలిమ్స్‌వారి "నాయిల్లు" జనవరి తొమ్మిదవ తేదీకి విడుదల చేయబడుతుందని తెలుస్తోంది. నాగయ్యగారి దర్శకత్వంలో తయారౌతున్న ఈ చిత్రం అన్నివిధాలా విజయవంతం కాగలదని పలువురు అంటున్నారు. నాగయ్య, రాజకుమారి, విద్యావతి, గిరిజ, రామశర్మ మున్నగువారు ఈచిత్రంలో నటిస్తున్నారు. నాగయ్యగారి సంగీత దర్శకత్వం కూడా ఉత్తమంగా ఉందని వినికిడి. రీరికార్డింగ్ ఇటీవలే ప్రారంభించారు



"ప్రేమ కలాపం శిఖపట్టకలాపంగా మారింది

రాజా ప్రొడక్షన్స్ 'పుట్టిల్లు' చిత్రంలో రాజారావు, సూర్యశ్రీ.




వినోదా వారి "దేవదాస్" షూటింగ్‌లో దర్శకుడు వేదాంతం రాఘవయ్య షూట్ అనబోతున్నారు. కెమేరా వెనక బి. యస్. రంగా వున్నారు.

* * *

అంజలీవారి "పరదేశి" ఈ నెల మొదటి వారానికి విడుదల కాగలదని అంటున్నారు. అంజలీదేవి వృద్ధురాలుగా, యువతిగా సర్వోత్తమంగా నటించిందనీ తెలుస్తోంది

* * *

జెమినీవారు హిందీలో తీస్తున్న "మిస్టర్ సంపత్" ఈ నెలాఖరులోగా దేశమంతటా విడుదల చేయబడుతుందని తెలుస్తున్నది. వాసన్ డైరెక్టుచేస్తున్న ఈ చిత్రంలో మోతీలాల్, పద్మిని, వనజ, స్వరాజ్, ఆగా, కన్నయిలాల్ నటిస్తున్నారు. పాటలు, మాటలు పండిట్ ఇంద్ర, కౌశిక్, సంగీతంకళ్లా సమకూర్చారు.



పొరుగింటి విధవకు టాక్సీడ్రైవరు ప్రసాద్ పళ్లు ఇస్తున్నాడు.

ఎమ్. ఆర్. ఏ. వారి "లేడీడాక్టర్"లో సురభి కమల, విజయకుమార్, జగదీశ్వరి.

★ దాగ్ ★

అమియ చక్రవర్తి డైరెక్టుచేసిన "దాగ్" హిందీ చిత్రం గత శుక్రవారం నుండీ వెల్లింగ్టన్ టాకీసులో ప్రదర్శించబడుతోంది. దిలీప్‌కుమార్, నిమ్మీ, క్రొత్తనటి ఉషాకిరన్, లలితా పవర్ మున్నగు వారు నటించారు. శంకర్, జైకిషన్ ద్వయం సంగీతం సమకూర్చారు. లతా మంగేష్కర్, తలత్ మహమ్మద్ ప్లేబాక్ పాటలు పాడారు.

మద్యపాన వ్యసనంవల్ల ఒక యువకుడు ఏవిధంగా తల్లిని కష్టపెట్టేంది, అతడు ఏ విధంగా సంఘం చేత అవమానించబడిందీ, చివరికి ఏ విధంగా ఆ వ్యసనం విసర్జించి బాగుపడి ప్రేమించిన పిల్లను వివాహమాడిందీ చూపిస్తుంది ఈ చిత్రం. మద్యపానంవల్ల కలిగే అనర్థాలను కథా సమస్యగా తీసుకున్నప్పటికీ ఈ చిత్రంలో దానికి సంబంధంలేని పన్ని వేశాలు విరివిగా చొప్పించబడి, అసలు సమస్యను బలహీనం చేశాయి. కథావస్తువు మంచిదైనా దాన్ని చిత్రించటంలో నిర్జీవంగా తయారైంది. తాగుబోతుగా దిలీప్‌కుమార్ నటన కొన్నిచోట్ల అసహజంగావుంది. తప్పతాగి ఇంటికి తూలుతూ వస్తూ, రాగం, తాళం తప్పకుండా అద్భుతమైన పాట పాడేస్తాడు. ఆ పాట పాడించకుండా వుంటే బాగుండేది. నిమ్మీ 'నటి' అనే బిరుదుకు ఏమాత్రం తగదనిపిస్తుంది. ఏ చిత్రంలో చూసినా ఆమె పిచ్చిదానివలె నటించటమే కనిపిస్తుంది. లలితా పవర్ మంచి నటనా కౌశలం చూపించింది. క్రొత్తనటి ఉషాకిరన్ తప్పక ప్రేక్షకుల అభిమానం పొందేటట్లు కనిపిస్తుంది.

శంకర్ జైకిషన్‌ల సంగీతం మూడు నాలుగు పాటల్లో ప్రశంసనీయంగావుంది. మొత్తంమీద ఈ చిత్రాన్ని బొంబాయి పత్రికలు ఎందుకంత ఎక్కువగా పొగిడినవో అర్థంకాదు. ★

ఒకేసారి అనేక చిత్రాల విడుదల

గత సంవత్సరాంతంలోను, ఈ సంవత్సరారంభంలోను మొదలు పెట్టబడిన తెలుగు చిత్రాలనేకం పూర్తికావస్తున్నాయి. ఇవన్నీ కొంచెం ముందువెనుకగా ఒకేసారి విడుదల అయ్యే ప్రమాదం కనిపిస్తోంది. ఇప్పటికే రెండు మూడు నెలలనుంచీ తెలుగు చిత్రాలు వరసగా విడుదలై ప్రజల డబ్బు



"తెరలు తెరలుగా వేదనమూసి పొరలి పొరలి కన్నీరై కురిసె"
శోభావారి "పరోపకారం" లో జి వరలక్ష్మి, ముక్కామల

పంచుకోవటం జరుగుతోంది తెలుగు చిత్రాలకు పోటీగా తమిళులు తెలుగులో తీసిన చిత్రాలు, హిందీ చిత్రాలు కూడా మార్కెట్‌లోకి వస్తున్నాయి ముందు ముందీ పరిస్థితి మరీ విషమించేటట్లున్నది డిసెంబరు, జనవరి మాసాల్లో చాలా తెలుగుచిత్రాలు విడుదలకు సిద్ధం చేయబడుతున్నాయి ఇన్ని చిత్రాలకు థియేటర్లు దొరకటం అటుంచి, ఇన్నిటికీ పెట్టి డబ్బు వాటికి లభించేందుకు అవకాశం వుంటుందా అని అనుమానంగా వున్నది ప్రజాదరణపొందే చిత్రం అదేసమయంలో విడుదలైన మిగతా చిత్రాలన్నిటినీ మింగివేస్తుంది అన్ని చిత్రాలూ చూడగలంత డబ్బు ప్రజలవద్ద లేదు అందుచేత నిర్మాతలు విడుదలకు తొందరపడక, ఒకరితో ఒకరు పోటీపడక నెమ్మది నెమ్మదిగా విడుదల చేయటం అవసరం ఒక చిత్రానికీ మరొక చిత్రానికీ విడుదలలో కనీసం మూడు వారాలైనా తేడా వుంటే గాని చాలదు చిత్రాల ఉత్పత్తి పెరిగినంతగా మన థియేటర్ల సంఖ్య పెరగటం లేదు దీనికితోడు ప్రజలు సినిమాలకు వెచ్చించగల డబ్బు కూడా తగ్గిపోతున్నది ★

* * *

బి టి హెచ్ పిక్చర్సు అనే పేరుతో స్థాపించబడిన ఒక బొంబాయి సంస్థ ఇంగ్లండు, అమెరికాలలో విడుదలచేసే ఉద్దేశ్యంతో 52 టెలివిజన్ చిత్రాలు నిర్మించదలచినదట లెస్లీథామస్ వీటిని డైరక్టు చేస్తాడట, ఒక్కొక్క చిత్రం ప్రదర్శనకు 23 నిమిషాలు పడుతుందట ఈ చిత్రాలన్నిటిలోనూ బొంబాయి నటుడు ముబారక్ ఉంటాడట

* * *

న్యూ థియేటర్సువారు తమ కలకత్తా స్టూడియోలో "వివాహ బంధన్" అనే కొత్త చిత్రం తీస్తున్నారు అరుంధతీముఖర్జీ, బసంత్ చౌదరి నటించే ఈ చిత్రానికి సంగీతం పంకజ్ మల్లిక్ సమకూర్చాడట దర్శకుడు హేమ్‌చందర్.

* * *

బీనారాయ్, ప్రదీప్‌కుమార్, కులదీప్ కౌర్ నటించే ఫిల్మిస్తాన్‌వారి "అనార్కలీ" హిందీ చిత్రం పూర్తికావస్తోందట 18 ఏళ్లక్రిందట ఒక చిత్రంలో అనార్కలీ పాత్ర ధరించిన సులోచన ఈ చిత్రంలో సలీం తల్లిగా నటిస్తోంది నందలాల్ జశ్వంతలాల్ దర్శకుడు మార్షల్ బ్రగాంజా ఫొటోగ్రఫీ దర్శకుడు

ఫిల్మిస్తాన్‌వారు "షర్త్" అనే మరొక భయానక - సంగీత చిత్రం తీస్తున్నారు దీపక్, శ్యామ, మోహన, శశికళ, ఐ. ఎస్ జోహార్ నటించే ఈ చిత్రానికి బిభూతిమిత్రా దర్శకుడు, ప్రఖ్యాత గాయకుడు హేమంతకుమార్ ముఖర్జీ సంగీత దర్శకుడు ఇవిగాక మరో చిత్రాన్ని తమిళం, హిందీలలో ఫిల్మిస్తాన్ నిర్మిస్తున్నారు ఇందులో గీతాబాలి, అజిత్ నటిస్తున్నారు

ప్రశ్నలు..సమాధానాలు

శ్రీ వెంకటరామస్వామిగారు—
పెల్కపాలెం, ప॥ గోదావరి జిల్లా.

పాము కప్పను పట్టుకొన్నప్పుడు కప్ప అరుస్తూవుంటే మనం చూచినట్లయితే విడిపించవలెనా? అక్కరలేదా?

—ఒక ప్రాణిని ఇంకొక ప్రాణి హింసించుచుండగా చూచి సహించలేనటువంటి దయారసము హృదయాన్ని ముంచి వేసినప్పుడు, కప్పను రక్షించవలెనా? అనే సంశయం కలుగదు. శిబిచక్రవర్తి తన శరీరాన్ని కోసి డేగకు ఆహారంగా ఇచ్చాడు. డేగ పట్టుకొన్న పావురాన్ని రక్షించాడు. అటువంటి దయాసముద్రంలో ఎన్ని కప్పలైనా సురక్షితంగా ఉండగలవు.

*   *   *

శ్రీ జూపల్లి వసంతరావుగారు—వెంకటగిరి టవున్.

నవమాసాలు మోసి కనిపెంచింది తల్లి. అగ్నిహోత్రసాక్షిగా పెండ్లాడినది భార్య. వీరిద్దరిలో ఎవరిమాట అనుసరించిన సంసార నౌక సుఖప్రదంగా తీరము చేరును?

—తల్లిమాటనూ వినాలి. భార్యమాటనూ వినాలి. "వినదగు నెవ్వరు సెప్పిన అటు విమ్మట వినినంతనె వేగపడక వివరింప దగున్." అప్పుడు స్వయంగా ఆలోచించి "కని, కల్ల నిజము దెలిసి" యుక్తమనితోచిన పద్ధతిగా ప్రవర్తిస్తే సంసారం సుఖంగా నడుస్తుంది. స్వతంత్రంగా ఆలోచించి వ్యవహరించాలి. తప్పు చెప్పినవారికి వారి తప్పును వారికి తెలియపరచాలి.

*   *   *

శ్రీ లక్కా రంగారావుగారు—గుడివాడ.

దేవుళ్ల ప్రతిమలకు మీసాలుగాని గడ్డాలుగాని కల్పించవు ఎందుచేత?

—మీసాలు గడ్డాలు అనేవి రాజసగుణమును తామసగుణమును స్ఫురింపజేస్తాయి. దేవతావిగ్రహములు ప్రసన్నవదనంతో, శాంత రసభరితమైన సాత్వికగుణప్రధానంగా ఉండాలి అందువల్ల గడ్డాలు మీసాలు దేవతావిగ్రహాలకు అయుక్తము.

జీవించటం ఉద్దేశ్యమేమిటి!

—జీవితమును సద్వినియోగం చేసి సార్థకం చేయుడం కోసమే జీవించాలి జీవితము యొక్క పరమార్థం ధర్మసాధనమని మహర్షులు నిర్వచించారు.

*   *   *

శ్రీ కె. యస్. రత్నంగారు—కలంక్ష.

తలచి వలపించుకొన్న యువతీ యువకులకు వివాహము కాకపోతే వారి మనస్సులెట్లా ఉంటాయి?

—ఈ వలచి వలపించుట అనేది ఎందుకు జరిగినదా? అని విలపిస్తారు. వారి వలపు వారి మెడ కొక పలుపు అవుతుంది.

ప్రస్తుతం మనదేశంలో నిరుద్యోగులు హెచ్చుగా ఉండుటకు కారణ మేమి?

—మనదేశంలో చిరకాలంగా ఉంటున్న కులవృత్తులు అన్నీ కూలిపోయినాయి. చేతిపనులు చేజారిపోయినాయి. యంత్రపరిశ్రమలు వృద్ధికాలేదు. తెనుగు మరచిపోయినాము, ఇంగ్లీషు రాలేదు. అన్నట్లుగా, హస్తపరిశ్రమలు అడుగంటినాయి, యంత్రపరిశ్రమలు విస్తరించలేదు. ఈ ఉభయ భ్రష్టత్వమే నిరుద్యోగ కారణం.

ఆత్మ విశ్వాసాన్ని ఆత్మగౌరవాన్ని కాపాడే ఆయుధమేది?

—ఆత్మను కాపాడగల్గినది పరమాత్మ. కనుక భగవంతుణ్ని నమ్ముకొనడం ఒక్కటే సాధనం. ఆత్మగౌరవం; ఆత్మ

విశ్వాసం, ఆత్మబలం, ఆత్మశుద్ధి, ఆత్మసిద్ధి అన్నీ భగవద్భక్తిసాధనవల్లనే సాధ్యమవుతాయి.

ఏవ్యక్తి అయినా ప్రాణము పోయే ముందు తెలివిగల్గి ఉంటాడా?

—దస్తావేజు అంతా స్వాంతంగా చదివి, సంతకం సగంచేసి ఆవులించి, గుండె ఆగిపోయి, రెప్పపాటులో ప్రాణం విడిచిన సబురిజిస్ట్రారు ఒకరు ఉదాహరణకు ఉన్నారు. అట్లా తెలివి లేనే ఉండి, చులకనగా క్షణంలో పోయినవారు చాలామంది ఉన్నారు. అనాయాసమరణములలో అటువంటి స్మృతి స్మారకం బాగావుంటుంది.

* * *

శ్రీమతి అక్కల కమలగారు—కొండపల్లి.

ఈ ప్రపంచంలో మొగవారికి అతి ముఖ్యమైన వస్తువు ఏది?

—వారివారి మనస్సునుబట్టి, వారివారికి అత్యంత ప్రీతికరమైన వస్తువు ఉంటుంది. చిన్నపిల్లలకు మిఠాయిలమీదను, పెద్దపిల్లలకు మిటారులమీదను, ఎక్కువ మక్కువ ఉంటుంది. ఆబాలగోపాలం అందరికీ ఎక్కువ ముఖ్యమైన వస్తువు రొక్కం.

కాకులు అరుస్తే చుట్టాలు వస్తారని అందురు. ఇది నిజమేనా?

—కాకులు అరిస్తే చుట్టాలు వస్తారనే మాట నిత్యసత్యం కాదు. అది కాకతాళీయమైన విషయం. కాకులు అరవడం చుట్టాలు రావడం ఒక్కనాడే సంభవించవచ్చు. అప్పుడది నిజం. అనాడు చుట్టాలు రాకపోతే అది అబద్ధం. కాని, చుట్టాలూ, కాకులూ సమంగా భావింపబడినారని యీ మూఢనమ్మకంలో ఉన్న గూఢార్థం.

* * *

బి. ఎల్. నరసింహమూర్తి—భీమవరం.

చిత్రమునకు పాటలు వ్రాయునపుడు కవి, తన యిష్టానుసారముగా వ్రాయువా? లేక, డైరెక్టరు, మ్యూజికల్ డైరెక్టరుపై ఆధారపడి వ్రాయునా?

—చిత్రనిర్మాణంలో బహుశా అందరికంటే తక్కువ స్వాతంత్ర్యం ఉన్నది కవికే నేమో. దర్శకుని, సంగీతదర్శకుని సూచనల ననుసరించే సాధారణంగా పాటలు రాయవలసివుంటుంది.

నటుడు నాగేశ్వరరావు తీయ సంకల్పించిన చిత్రము పేరేమి? నటీ నటు లెవరు?

—ఆచిత్రానికింకా పేరు పెట్టలేదు; నటీనటులుకూడా నిర్ణయం కాలేదు. నిర్మాణం బహుశా వచ్చే మార్చికి ప్రారంభమౌతుందట.

* * *

ఏమ్. దత్తాత్రేయ శర్మ—నరసరావుపేట.

'నానా' నవల వ్రాసిన 'ఎమిలీజోలా' స్త్రీయా లేక పురుషుడా?

—పురుషుడే. అతని జీవితకథతో హాలీవుడ్ వారు సినిమా కూడా తీశారు.

* * *

బెహరా శ్రీరామమూర్తి—ఏలూరు.

"ప్రస్తుతము సినీమారంగములో జి. వరలక్ష్మికి, ఎక్కువ అనుభవము గలదని మా మిత్రుడనుచున్నాడు; కాని నేను, భానుమతికి ఎక్కువఅనుభవము, సినీమారంగములో కలదనుచున్నాను" మీరేమంటారు?

—సినిమా అనుభవం ఇద్దరికీ ఎక్కువగానే వున్నది. కాని వరలక్ష్మికంటే భానుమతియే ముందు సినిమాలలో అడుగు పెట్టినది.

* * *

అరిగే రామారావు—నూజివీడు.

—అమెరికన్ నిర్మాతలు ఇండియాను కథాస్థలంగా తీసికొని చిత్రాలను నిర్మించి, వాటిని ఇండియాలోకూడ విడుదల చేసినచో, మన చిత్రాలు మనకే చెగటవునేమో!

—మరేమీ భయము లేదు. అమెరికన్ నిర్మాతలు ఇంగ్లండును కథాస్థలంగా తీసుకుని నిర్మించిన చిత్రాలు ఇంగ్లీషువారిని ఏవిధంగానూ తృప్తిపరచలేకపోగా ఆగ్రహంకూడా తెప్పించాయి. ఇండియాను కథాస్థలంగా తీసుకుని అమెరికన్లు చిత్రాలు నిర్మిస్తేకూడా అంతే జరగవచ్చు.

* * *

ఎ. వి. తాతబాబు—హైదరాబాదు.

19 11-52 ఆంధ్ర, వారపత్రిక ముఖచిత్రం 'లానాటర్నర్' ది వేసి. గ్రేటెస్ట్ షో చిత్రంలో పారమౌంట్ వారి "బెటీ హటన్" అని వ్రాశారు. నా ఈ ఊహ సరైందా, కాదా?"

—కాదు బాబూ కాదు. "గ్రేటెస్ట్ షో" లో లానా టర్నర్ లేదు.

* * *

శ్రీ కూరాళ్ల సీతారామయ్య—తెనాలి.

మనవాళ్ళు సంఘంలో స్త్రీకి గౌరవం లేదంటారు. కాని, భార్యాభర్తలు, తల్లిదండ్రులు, ఆలుమగలు, యీ విధంగా ఉన్న శబ్దప్రయోగాలలో స్త్రీని ముందుగా పేర్కొనుచున్నాము. దాని ఉద్దేశ్యమేమిటి?

—స్త్రీవాచక పదములు సంస్కృతంలో సామాన్యంగా దీర్ఘమైన అచ్చుతో ముగియును. "ఆ"కారాంతం, లేదా "ఈ"కారాంతంగా ఉంటాయి. ద్వంద్వసమాసాలకు దీర్ఘాక్షరాంత శబ్దములైన స్త్రీవాచకములు ముందుఉండి తర్వాత పురుషవాచక శబ్దములు ఉండడంవల్ల ద్వంద్వసమాసం ఉచ్చరించడానికి వీలుగా ఉంటుంది. మన పూర్వులు పురుషులతో స్త్రీలు సమానంగా ప్రవర్తించుటకు వీలు లేదన్నారు. ఎవరి ప్రకృతికి తగినట్లు వారు ప్రవర్తించాలి అన్నారు. ఉభయులకూ సమాన ప్రవృత్తి లేకపోయినా సమాన ప్రతిపత్తి కుటుంబంలో, సంఘంలో కల్పించారు.

* * *

శ్రీ యన్. వెంకట్రామయ్య—తిరుపతి.

రాజాజీగారు తిరుపతిలో ఉపన్యసిస్తూ, "రెండుసారకాయలు పండించి ఒకటి మీరు తీసికొని, ఇంకొకటి అయ్యవారికియివ్వండి" అని చెప్పారు. ఇందులో అర్థమేమిటో తెలుపగలరా?

—అయ్యవారికి మీరు యిచ్చినప్పటికీ, మీ ఉపయోగానికి మీరు తీసుకొని నప్పటికీ, ముదిరిపోయిన సారకాయలను రాజాజీ ఉద్దేశించలేదు. అవి ఎవ్వరికీ అక్కరకు రానివి. రాజకీయరంగంలో ఉన్న రాజాజీ ప్రసంగించినవి లేత సారకాయలే అని గ్రహించవలెను. ★

★ రెండు మహానగరాలు ★

(25-వ పేజీ తరువాయి)

'మీతోపాటువచ్చి అందాకా గేటుదాకా పంపిస్తాను. అక్కడినుంచి అలాకొస్త ఆ వీధివెంటా ఆవీధివెంటా తిరుగుతాను—దేశ దిమ్మరివాణ్ణి మీకు తెలియందేవుంది—కాళ్లు ముడుచుకుని స్థిమితంగా ఒకచోట కూర్చోలేను. తెల్లవారే దాకా మళ్లా యిల్లు జేరుకోలేక పోయినా ఉదయమన్నా వచ్చి దర్శనం చేసుకుంటాను; మరేం అనుకోబోకండి. రేపు మీరు కోర్టుకు వెడతారు గాదూ?'

'వెడతాను'

'నేనుకూడా వచ్చి జనంలో నుంచుంటాలెండి. గూఢచారి నాకు జాగా చూపిస్తానన్నాడు. పెద్దలు ఇలా నాచెయ్యిబట్టుకోండి'

లారీ అతని భుజంమీద చెయ్యివేసి నెమ్మదిగా బయలుదేరాడు. ఇద్దరూ కలిసి మెట్లు దిగి వీధిలోకి వెళ్లారు. అయిదారు నిమిషాల్లో లూసీవాళ్ళూ వుంటూన్న యింటిదగ్గిరికి చేరుకున్నారు. కార్టన్ ఆయన్ని లోపలికి పంపించి పది అడుగులు యివతలికివచ్చి, మళ్లా వెనక్కి తిరిగి చూచాడు: 'లూసీ, రోజూ జైలుదగ్గిరికివెళ్లి అతన్ని చూచి వచ్చేదట. ఈ గేటులోనుంచి యిలాగే బయటికివచ్చేది–ఇలాగే యీసందు మలుపు దిరిగేది. రోడ్డుమీదవున్న ఈ శిలలన్నీ లూసీ పాదాలను స్పృశించి వుంటై. సరే! లూసీ అడుగుజాడలను అనుసరించే నేనూ బయలుదేరిపోతాను.

కార్టన్ లాఫోర్స్ జైలుముందుకు జేరేసరికి దాదాపు రాత్రి పదిగంటలు కావచ్చింది. మామూలుగా లూసీ నిల్చునే చోటికే పోయి నిల్చున్నాడు. అక్కడ కట్టెలు గొడుతూవుండే ముసలాడు కనుపించాడు. వాడు పని ముగించుకుని, పాకగేటుముందు స్థిమితంగా కూర్చుని చుట్ట గాల్చుకుంటున్నాడు. వాడు తనవంక పసిగట్టినట్టు చూస్తూండటం గమనించి కార్టన్, కొంచెం దగ్గిరసా వెళ్ళి.

'నమస్తే తాతా' అన్నాడు.

'నమస్తే'

'ప్రజాప్రభుత్వం ఎలా నడుస్తోంది'–

'గెలటైన్ సంగతేనా–దానికేం బలేగా నరికేస్తా వుండది—ఇయ్యాల అరవైముగ్గురు. రేపట్నుంచీ వందదాకా కూడా తెగొచ్చు. ఆడు శామ్సన్ వొట్టి దచ్చుయెదవ. చేతులు నొప్పెడతా వుండా యంటాడు. నీ కట్టూ జుట్టూ అంతా ఇంగిలీసోడికి మల్లే వుండావుగాని నిజానికి యింగిలీసోడివి గాదల్లేవుందే.'

'అవును'

'ఫ్రెంచి భాష ఘసందుగా మాటాడుతుండావులే–అందుకూ'

'చిన్నప్పుడు ఇక్కడ ఫ్రాన్సులో చదువుకున్నాను.'

'అచ్చు యీదేశ పోడివి మల్లేనే మాట్టాడుతుండావ్–తుల్లొచ్చేదా?'

ముసలాడు అవతలికి వెళ్లిపోయిన అనంతరం, కార్టన్‌కూడా అక్కడినుంచి బయలుదేరాడు. వీధి వెంట కొంతదూరం పైకి నడిచి అక్కడున్న లాంతరు స్తంభందగ్గిర ఆగాడు. జేబులోనుంచి చిన్ని కాయితం ముక్క బయటకిదీసి, దీపం వెలుగులో ఆ చీటీమీద యేవోరెండు ముక్కలు రాసి మళ్ళా జేబులో బెట్టుకున్నాడు. సందులూ గొందులూ దాటి గబగబా ఎక్కడికో నడిచిపోతున్నాడు. అలాపోయి పోయి ఒక మారుమూల చీకటి సందులోవున్న చిన్ని మందుల దుకాణం ముందు ఆగాడు. ఆ దుకాణంలో, ఆ రాత్రివేళ చిన్ని దీపం వొకటి మినుకు మినుకుమంటూ వెలుగుతోంది. అమితవికృతంగావున్న ఆ దుకాణదారు, గోళ్లు గిల్లుకుంటూ ఒక్కడే కూర్చునున్నాడు.

సిడ్నీ కార్టన్ సరాసరి లోపలికివెళ్లి జేబులో వున్న కాయితం ముక్క తీసి దుకాణదారుకు అందించాడు. ఆ గుడ్డిదీపం వెలుగులో కళ్లు చికిలించి ఆ చీటీచదువుకు ఆ దుకాణదారు ఎదో గతుకుతిన్నవాడులాగు: 'అయ్యొ బాబోయ్!' అని గుండె బాదుకున్నాడు'

ఆ ఆశ్చర్యార్థకాన్ని కార్టన్ లక్షించకపోవటం గమనించి మళ్లాతగ్గి: 'చిత్తం'–తమకేనా అండి' అన్నాడు.

'అవును నాకే–'

'వీటినిమాత్రం ఒక దాంతో ఒకటి కలపబోకండి–కలిపితే ప్రమాదం పంభవిస్తుందని తమకి తెలుసునను కుంటాను'

'తెలుసు తెలుసు–ఫరవాలేదు యివ్వు'

దుకాణదారు యేవో చిన్నిచిన్ని పొట్లాలు విడివిడిగా కట్టికార్టన్‌కు అందించాడు. కార్టన్ వాటిని, కోటులోపలి జేబుల్లో భద్రపరుచుకుని వాటి ఖంజువలే యివ్వవలసిన డబ్బు లెక్కజూసి యిచ్చేసి బయటికివచ్చేశాడు. 'ఈవేళకు చేయవలసిన పనులన్నీ పూర్తి అయినట్లే; నిద్రమాత్రం పట్టేట్టులేదు' అనుకుంటూ వీధులవెంట బయలుదేరాడు.

రాత్రి చాలా నిరామయంగావుంది. చంద్రుడు జేగీయమానంగా వెలుగుతున్నాడు; మబ్బులు గగనపథాన పరుగులు బెడుతున్నయ్. కిటికీలలోనుంచి దీపాలు మినుకుమినుకుమంటూ కనుపించుతున్నయ్. ఆ గదులనిండా జనం పడుకుని వొళ్లుమరిచి నిద్రపోతున్నారు. మానవలోకపు సంక్షోభాన్నంతా మరిచేసి ఆ నాలుగు మూడు గంటలూ ఊపిరి విడుచుకుంటున్నారు.

ఆ విధంగా కార్టన్ తెల్లవార్లూ పారిస్ నగరవీధులన్నీ పిచ్చివాడులా తిరిగేశాడు; తెలతెలవారిపోతున్న సమయంలో సైయినీ నదిగట్టునే పడి కొంతదూరం నిర్జన ప్రదేశానికి నడిచాడు; కొంతదూరం పోయి, అక్కడ నదిగట్టుమీద బోర్లగా పడుకుని నిద్రపోయాడు.

అతనికి మళ్లా నిద్ర మెలుకువవచ్చేసరికి, బాగా బారెడు ప్రొద్దెక్కింది. సరాసరి బయలుదేరి లారీగారి మకాముకు వచ్చేశాడు. అతను వచ్చేసరికే లారీ బయటికివెళ్ళిపోయాడు. కార్టన్ కొంచెం కాఫీ గొంతులో పోసుకుని తానుకూడా కోర్టుకు బయలుదేరాడు.

కోర్టుహాలు జనంతో కిటకిట లాడిపోతోంది. మన గూఢచారి కార్టన్ను తీసుకువచ్చి జనంలో ఒకమూలగా నిల్చోబెట్టాడు. కోర్టులో లారీ, డాక్టర్ మానెట్, ఆయనప్రక్కగా లూసీ, అంతా కనుపిస్తున్నారు.

చార్లెస్ డార్నేను తీసుకువచ్చి విచారణసంఘం వారి ముందు నిల్చోబెట్టారు. అతను కట్టెదుట కనుపించగానే, అతనికి ధైర్యోత్సాహాలు కలిగేలాగు, లూసీ అతని ముఖంలోకి మిసమిసా చూచింది. డార్నే ముఖం సంతోషంగా విప్పారుతోంది. ఆ విషయాన్ని కార్టన్ దూరాన్నుంచే అవగతం చేసుకుంటున్నాడు.

పబ్లిక్ ప్రాశిక్యూటర్ లేచి, ముద్దాయిమీద యీ విధంగా నేరారోపణ చేశాడు:

'డార్నే అని పిలవబడుతున్న చార్లెస్ ఎవ్రీమాండ్ అనే యీ ముద్దాయి, ప్రజావిద్రోహులూ, ప్రజలమీద అనేక ఘాతు

చర్యలు జరిపినవారూ అయిన ఒక జమీందారీ కుటుంబానికి చెందివున్నాడు. ఆ జమీందారీ కుటుంబాన్ని ప్రజావిద్రోహులుగా నిర్ణయించి నిర్మూలింపబడవలసిన వాళ్ళుగా రిపబ్లిక్ ప్రభుత్వం ప్రకటించివుంది. ఆ శాసనం ప్రకారం ముద్దాయికి కోర్టువారు మరణశిక్ష విధించవలసివుంది.'

'ముద్దాయిమీద బహిరంగంగా నేరారోపణచేస్తున్న వాదేశభక్తులు యెవరేనావున్నారా?' అని విచారణ సంఘం అధ్యక్షులు ప్రశ్నించారు.

'ఉన్నారు'—

'ఎవరు?–

'ముగ్గురూ—మొదటివారు సెయింట్ ఆంటోనీ వీధిలోని పానశాల యజమాని ఎరనెస్టు డిఫార్జ్'

'బాగుంది'

'రెండవవారు, ఆయనభార్య మాడమ్ డిఫార్జ్'

'సరే మూడోవారూ?'

'మూడోవారు–డాక్టర్ ఎలెగ్జాండర్ మానెట్!'–

'ఆఁ యేమిటీ! నేనా!!' అంటూ డాక్టర్ మానెట్ కంగారుగా లేచి నిల్చున్నాడు.

'అయ్యో! యిదంతా వట్టిమోసం!–దగా! శుద్ధదగా–ముద్దాయి నాకూతురుకు భర్తఅనే సంగతి కోర్టువారికి తెలుసు–నాబిడ్డ భర్తను నా ప్రాణానికంటే ప్రియతముడుగా భావిస్తున్నాను. నా అల్లుడిమీద నేను నేరారోపణ చేస్తున్నానని యిప్పుడు యిక్కడ చెప్పిన మనిషి యెవడు? వాడు వట్టిదగుల్బాజీ మనిషి! వట్టిదగా కోరు' అంటూ గోలబెట్టాడు.

'డాక్టర్ గారూ! మీరు కొంచెం శాంతించండి; మీరు కోర్టువారి అధికారాన్ని శిరసావహించలేకపోతే, మీరుకూడ ప్రభుత్వశాసనాన్ని ధిక్కరించిన వారు కావటం మినహా మరో ప్రయోజనం వుండదు. ముద్దాయి తమకు ప్రియతముడే కావచ్చు; కాని రిపబ్లిక్ పౌరుడైన ప్రతి పెద్దమనిషికీ రిపబ్లిక్ ప్రభుత్వం అత్యంతప్రియతమమైనది.' అన్నాడు, ప్రభుత్వన్యాయవాది.

'రిపబ్లిక్ ప్రభుత్వం, ఒకవేళ, మీబిడ్డనే త్యాగం చెయ్యమన్నా మీరు అలాంటి త్యాగం చెయ్యటానికి సిద్ధపడి వుండవలసివుంటుంది: స్థిమితంగా కూర్చుని మిగతా సంగతులు కూడా వినండి! అందాకా నిశ్శబ్దంగా కూర్చోండి' అని ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ గారిని మందలించారు.

ఏమిచెయ్యటానికీ తోచక, వెర్రివాడులాకోర్టు హాలు యావత్తూ కలియజూస్తూ డాక్టర్ మానెట్ కూర్చుని పోయాడు.

ఇంతలో ఫిర్యాది డిఫార్జ్ జరిగిన కథనంతా వరసనిచెప్పుకొస్తున్నాడు, తాను డాక్టర్ గారి దగ్గిర నౌకరీచేసిన నాటినుంచీ; డాక్టర్ గారు బాస్టిల్లీ జైలునుంచి విడుదలకావటం, తనకు వప్పగింత చెయ్యబడటం, అనంతరం, తిరుగుబాటు సమయంలో తాను, తన ప్రజాసముదాయంతో వెళ్లి బాస్టిల్లీ జైలును ముట్టడించటం—ఇంతవరకూ చెప్పాడు.

బాస్టిల్లీ సంగతిరాగానే—'బాస్టిల్లీ విప్లవీరుడికి జై!' అని జనంలోనుంచి ఒక గావు కేక వినిపించింది. తల విరబోసుకుని వొళ్లు తెలియని వీరావేశంతో, ప్రతీకారిణి గుంపులోనుంచి కోర్టువారి ముందుకు తోసుకొచ్చింది.

'డిఫార్జ్ బావా! నువ్వు వీరాధివీరుడివి, పరమ దేశభక్తుడివి. ఫిరంగిగుళ్లు పేల్చి బాస్టిల్లీని విధ్వంసంచేసిన విజయవీరుడువి. చెప్పు!– ఆనాటి నీ వీరగాథంతా కోర్టువారికి తెలిసేలా చెప్పు'

'సైలెన్స్'!—అంటూ విచారణసంఘం అధ్యక్షుడు గంట మోగించాడు.

'ఛట్! వెధవగంట! ఆవెధవమోతకు ధిక్కారం చెబుతున్నాను'అనేసింది ప్రతీకారిణి; 'చెప్పుబావా చెప్పు! ఆవేళ బాస్టిల్లీలో నువ్వు, చూసిదంతా చెప్పు.'

డిఫార్జ్ కొంచెం విజయసూచకంగా మీసం మెలిపెట్టి చేరువలో నిల్చునున్న భార్యవంక అదో తీవిగా చూసి మళ్ళా మొదలుపెట్టాడు:

'బాస్టిల్లీ ఖైదులో డాక్టర్ మానెట్‌ను ఖైదుచేసి వుంచినగది నార్త్‌టవర్ లోని నూట అయిదోగది; డాక్టర్ గారు విడుదలైనప్పుడు ఆయనపేరే ఆయనకు స్మృతితప్పినస్థితిలో వున్నాడు. నీ పేరేవిటంటే నూట అయిదూ నార్త్‌టవర్ అంటూ వుండేవాడు. బాస్టిల్లీమీద దాడి జరుగుతున్న సందర్భంలో ఆ దుర్గం పతనం కాగానే, ఆ గదిని పరిశోధించి చూడాలని నాకు అభిలాష కలిగింది. దుర్గం పతనమైపోయింది. నేనూ, ప్రస్తుతం జూరీకద్దెలలో కూర్చునివున్న మరోమిత్రులూ వెళ్లి ఆగదిని పరీక్షించాం. గదికి పైవేపుగావున్న పొగ గోటిలోని ఒక తొర్రలో ఈ కాయితం ముక్క కనుపించింది.

'ఇది డాక్టర్ గారి స్వదస్తూరిలోవున్న కాయితం. దాన్ని కోర్టువారి సముఖాన దాఖలుచేసుకుంటున్నాను.'

పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆ కాయితం తీసుకుని కోర్టువారికి చదివి వినిపిస్తున్నాడు. ★

★ జంతుకోటిలో మానవ లక్షణాలు ★

(43-వ పేజీ తరువాయి)
సముద్రంలో వుండే గుల్ల పురుగులు వీటికి ముఖ్యాహారం. గుల్ల పగలగొట్టితే కాని, లోపల వుండే పురుగు తినటానికి వీలుండదు. నట్టనడి సముద్రంలో, గుల్లబద్దలు కొట్టటానికి రాతిబండ ఎక్కడ వుంటుంది? అందుకని యివి సామాన్యంగా సముద్రంలో యీతకు పోబోయే ముందే, ఒక పెద్దబండను కూడా తమతో పాటే పట్టుకుపోతుంటాయి. ఈ సముద్రపు కుక్కలు ఆటలాడుకోవటం బలే తమాషాగా వుంటుంది. అన్నీ కలసి తడిమట్టితో పేటకాలు బల్లలా తయారు చేసుకొని, ఒక్కొక్కటీ వాటిమీదనుంచీ క్రిందికి జారుతూ వుంటే, మిగిలినవన్నీ చుట్టూ చేరి కేరింతాలు కొట్టుతూ గంటలకొద్దీ కాలం గడిపేస్తుంటాయి.

(ఇంకావుంది)

అతకని బతుకులు

(17-వ పేజీ తరువాయి)

యికంగా చూస్తూ మందహాసం చేసింది! ఆ కొండకొనకేసి చేలెత్తి చూపింది. కళ్లు గట్టిగా మూసుకున్నాను; కనుకొలుకుల్లో నిలిచిన నీళ్లు బొటబొట కారినై.

తాయి నీడలా వెంటాడుతున్నది; శకుంతల గోడలా అడ్డునిలబడి వెక్కిరించింది. రాధ జాలిగా చూసింది. సాలోచనగా ఆకాశంలోకి చూశాను. పైన పక్షులు 'కీచు' మని కూసి వెళ్లిపోయినై, గుండె లదిరిపోయేట్టు. భయం వేసి, వంటింట్లోకి వెళ్ళి కూర్చున్నాను. అమ్మ అన్నం వండుతున్నది.

"ఇక, అది పిచ్చిదైపోతుంది" అన్నది అమ్మ, విచారంగా; నేను దిగులుగా తల వంచుకున్నాను.

"ఇంతకూ వాడి రాత; వాడు జన్మలో సుఖపడ్డ దెప్పుడు లే - ఆ కష్టంకున్న దేమో ఒకరోజు తిన్నే, ఒకరోజు మాలుగుతుండేను; కన్నకూతురికేమో ఇట్లా అయిపోయెను" అన్నది, మళ్ళీ అన్నం మెతుకు పట్టి చూస్తూ.

"కానీ, శకుంతలకి మళ్లీ పెళ్లి చెయ్యకూడదూ?" అన్నాను, ప్రశ్నార్థకంగా చూస్తూ. అమ్మ ఒక్కక్షణం నా వంక నిర్ఘాంతపోతూ చూసింది.

"చేస్తాడేమోలే - ఏం, ఎంతమంది చేసుకోటం లేదు గనక?" అన్నది, ఆఖరికి.

"ఆఁ - లేకపోతే, ఏం తప్పు చేసిందని ఇప్పుడే దానికీ వైధవ్యం?" అన్నాను, కోపంగా; అది ఎవరిమీదనో నాకే అవగతం కాలేదు.

"దాని తప్పేముంది? - దాని రాత" అన్నది అమ్మ, నిట్టూర్చి. నేనుమాట్లాళ్ళేదు.

"రేపు నీకు తమ్ముడూ, వాళ్లు అక్కడికి వెళ్తున్నారట్నే?" అన్నాడు నాన్న, అప్పుడే సరాసరి ఎక్కణ్ణుంచో వంటయింట్లోకి వచ్చి.

"తప్పేముంది? జరగవలసిన తతంగమంతా జరగొద్దూ?" అన్నది అమ్మ, నిశ్చలంగా. నాన్న దొడ్లోకి వెళ్లాడు, కాళ్లు కడుక్కునేందుకు.

శకుంతలకూ, నాకూ మధ్య ఏనాడో అగాధం ఏర్పడ్డది; ఇక, శకుంతల్ని మర్చిపోవాలి. హృదయాన్ని పరిశోధించుకున్నాను: శకుంతల రూపం మాసిపోతున్నది. ఆ స్థానంలో రాధ నిలబడి చిలిపిగా, సిగ్గుగా నవ్వుతున్నది. శకుంతల మాటలకు తన్మయత్వం చెందిన వీనులు, రాధ మూకభాషకు పరవశమైపోతున్నై.

వంటింట్లోంచి లేచివచ్చి, వాకిట్లో కూర్చున్నాను. పైనతారలు నవ్వుకుంటున్నై.

"ఇదుగో - కనకాంబరాలు మూటకట్టి ఇక్కడ పెడుతున్నాను, మంచులో; మరిచిపోయేవు" అన్నది అమ్మ, రాత్రి భోజనాలైంతర్వాత నిద్రపోయేటప్పుడు. నేను గదిలోకి వెళ్ళి, అన్నీ సిద్ధంగా ఉన్నయ్యో లేదో చూసుకుంటున్నాను.

"పొద్దున్నే వెళ్తున్నావట్రా?" అన్నాడు నాన్న; పడుకోబోతూ. 'ఊఁ' కొట్టాను.

రాధ నా చెవిలో సంగీతం పాడింది; తలకాయెత్తి చూశాను. గోడమీది ఫొటోలో రాధ మందహాసం చేసింది. వాకిట్లో పడుకుని, తియ్యటి ఊహల్లో, పైవంక చూడటం మొదలు పెట్టాను.

నిజంగా, ఎవరి జీవితాలు ఎట్లా వెళ్ళిపోతయ్యనేది పరమ రహస్యం. శకుంతల బోర్లపడి, వెక్కి వెక్కి ఏడవటం గుర్తొచ్చింది దిండులో ముఖం దాచుకుని, గట్టిగా కళ్లు మూసుకున్నాను. సన్నగా చల్లనిగాలి తెర నామీదుగా జారిపోయింది.

తిరిగి తెల్లవారింది. కాఫీ తాగి స్టేషనుకు బైలుదేరాను, అమ్మ యిచ్చిన కనకాంబరాల మూట సంచీలో పెట్టుకుని.

"వెళ్ళగానే ఉత్తరం వ్రాయి; అందర్నీ అడిగానని చెప్పు" అన్నది అమ్మ; తలకాయూపాను.

"వెళ్ళొస్తా, నాన్నా" అన్నాను, మెల్లిగా.

"మంచిది నాయనా" అన్నాడు నాన్న, కూర్చున్న కుర్చీలోంచి లేచి.

రైలు బయలుదేరటానికి ఇంకా అరగంట ఉన్నది, నేను స్టేషనుకు వెళ్ళేసరికి. టికెట్టు కొనుక్కుని ప్లాటుఫారం మీద పచార్లు చెయ్యటం మొదలుపెట్టాను, సిగరెట్టు కాల్చుకుంటూ.

అకస్మాత్తుగా గుర్తొచ్చింది; మామయ్యా వాళ్లు యీ రైల్లోనే శకుంతల అత్తవారింటికి వెళ్తారు. నా హృదయంలో గొడ్డళ్ళాడినై. ఆర్ద్రనయనాల్తో కళ్ళెత్తి గోడ్సు వేపు చూశాను. శకుంతల బండి దిగుతున్నది; వెనకనే అత్తయ్య దిగింది. మామయ్య సామాను చేతపట్టుకుని ముందు నడుస్తున్నాడు. నా సంచీలోకి చూశాను; తడి గుడ్డమూటలోంచి కనకాంబరాలు రకరకాలుగా విరిసి నవ్వినై. ఆ క్షణం శరీరమంతా జలదరించింది; నామీద నాకే ఒళ్ళు తెలీని కోపం వచ్చి సిగరెట్టు విసిరేశాను, ఉదయపు ఎండలో మెరిసిపోతూ బారులు దీర్చిన రైలుపట్టాల అవతలకి. కళ్లు గట్టిగా తెరిచి సంచీలోకి చూసుకున్నాను; కనకాంబరాలు విరగబడి నవ్వినై; వాటివెనక రాధ మునిసిగ్గుతో మందహాసం చేసింది. పిచ్చెక్కి ఎదురుగుండా చూశాను; ప్లాటుఫారంమీదికి శకుంతల తల్లి వెనకనే ప్రవేశించింది. ఎందుకనో ఎదటపడటానికి మనస్కరించలేదు. వెయిటింగ్ రూములోకి వెళ్లి బల్లమీద కూర్చున్నాను, పైన గిర్రున తిరుగుతున్న 'ఫాను' వంకే చూస్తూ.

[అయిపోయింది]

★ సోదరమానవుడు ★

(19-వ పేజీ తరువాయి)

"ఇక్కడ లైసెన్సుకూలీలే కాని మిగతావాళ్ళు రాకూడదని తెలీదూ"

గోనెగాడు నవ్వేడు.

"మేము లైసెన్సు ఊరికే కట్టుకొంటున్నామనుకొన్నావా?" అన్నాడు పోర్టరు.

"అదంతా నాకెందుకు!" అన్నాడు గోనెగాడు.

"మొదట పెట్టె నక్కడ దించు! దించు అంటే!"

గోనెగాడు పెట్టెను దింపదలుచుకోలేదు. పైగా అది బరువు పెట్టె!

లైసెన్సు కూలీ తోడికూలీలను ముగ్గురను పిల్చేడు. వాళ్ళు వచ్చేరు. అందరూ కలిసి గోనెగాడి నెత్తిమీది పెట్టెని బలవంతంగా కిందికి దించేరు.

"నిన్నిక్కడ ఎవరు అడుగు పెట్టనిచ్చారురా?" అన్నాడు ఒక పోర్టరు.

"ఇక్కడ తేరగా డబ్బులు దొరకుతాయనుకొన్నావట్రా యెదవా?" అన్నాడు మరొకడు.

గోనెగాడు ఏదో జవాబు చెప్పబోయేడు.

"మొదట గేటుఫారం దాటి అవతలకిపో!" అన్నాడు ఇంకొక కూలీ.

'కదలడేమి!' అంటూ ఒక పోర్టరు గోనెగాడిని మెడపట్టుకు గెంటేడు.


వాడు వెనక్కి తిరిగి చూస్తూండగా మరొకడు "ఇంకా నూత్తాడు!" అంటూ మరొక గెంటు గెంటేడు. మూడోవాడు వచ్చి గెంటిన గెంటికి గోనెగాడు వెళ్ళి కటకటాల దడిమీద పడ్డాడు. తల మోసింది. నెత్తిని చేతులు పెట్టుకొని కూలో పడిపోయేడు. ★

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St Madras.



దూరపు కొండలు

—చిత్రకారుడు : శ్రీ ఇరుకుల కుమారిలస్వామి.


డిసెంబరు
విడుదల
శోభనాచల వారి
ప్రజాసేవ
డైరెక్షన్.....ప్రభాకరావు..